www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 209 | శనివారం | 19 జనవరి, 2019

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**
పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

వరంగల్ మేయర్ ఎంపికపై కసరత్తు

జిల్లా ఎంఎల్ఎలతో కెటిఆర్ చర్చలు



మన తెలంగాణ / హైదరాబాద్ : వరంగల్ మేయర్ ఎంపిక కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుక్రవారం కసరత్తు ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐదుగురు శాసనసభ్యులు, శాసనమండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డిలతో కెటిఆర్ చర్చలు జరిపారు. అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడిన వెంటనే టిఆర్ఎస్ ఎల్పి కార్యాలయంలో కెటిఆర్ తదుపరి మేయర్ అభ్యర్థి ఎంపికపై ఆ జిల్లా నేతల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. ఇంతకాలం వరంగల్ మేయర్‌గా ఉన్న నన్నపనేని నరేందర్ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నిక కావడంతో కొత్త మేయర్ ఎంపిక అనివార్యమైంది .వరంగల్ వెస్ట్ శాసనసభ్యుడు దాస్యం వినయభాస్కర్, వర్ధన్నపేట శాసన సభ్యుడు ఆరూరి రమేష్, వరంగల్ తూర్పు శాసన సభ్యుడు నన్నపనేని నరేందర్ ఈ భేటీలో పాల్గొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎ టి. రాజయ్య, పరకాల ఎంఎల్ఎ చల్లా ధర్మారెడ్డిలతో సమావేశం నుంచే కెటిఆర్ ఫోన్‌లో మాట్లాడారు. మరికొంతమంది అభిప్రాయాలను తీసుకుని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కెసిఆర్‌కు నివేదించి వరంగల్ మేయర్ అభ్యర్థిపై తుది నిర్ణయం తీసుకుంటామని కెటిఆర్ ఈ సమావేశంలో తెలిపారు.

కెసిఆర్ ఫ్రంట్‌తో బాబు బెంబేలు

కె.తారక రామారావు



మనతెలంగాణ / హైదరాబాద్ : కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి టిఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పలు రాజకీయ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. చెప్పుకోవడానికి గొప్పగా చేసిన పనులేవీ లేని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం ఇప్పుడు ప్రధాని మోడీని బూచిగా చూపిస్తున్నారని, అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని, దీన్ని ఆ రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. నాలుగున్నర సంవత్సరాలుగా మోడీతో కాపురం చేసిన చంద్రబాబు ఇప్పుడు తెలంగాణ సిఎం కెసిఆర్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఆంధ్రపై గద్దల్లా వాలారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు శత్రువుగా వ్యవహరించి, సోనియాగాంధీని తీవ్ర పదజాలంతో విమర్శించిన చంద్రబాబు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలను రెచ్చగొడుతూ కాంగ్రెస్‌తో జతకట్టి కెసిఆర్‌ను ఓడించాలని, తెలంగాణలో తిరిగి అడ్డావేయాలని ప్రయత్నించలేదా అని చంద్రబాబును ప్రశ్నించారు. తెలంగాణలోని సీమాంధ్రులు ఎన్నికల్లో కెసిఆర్‌కు ఓట్లు వేసి బలపర్చిన విషయం చంద్రబాబుకు ఇప్పటికైనా అర్థంకాలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్,బిజెపిలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తుంటే చంద్రబాబుకు దిమ్మతిరిగిపోతోందని అన్నారు.

బిజెపి అంటే బిల్డప్ జాతీయ పార్టీ

దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్, బిజెపిలు కలిసినా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేనంత హీన స్థాయికి చేరుకున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవతో దేశంలోని రాజకీయ పార్టీలు ఫెడరల్ ఫ్రంట్‌గా రూపు దిద్దుకుంటున్నాయని అన్నారు. తెలంగాణ ఎన్నికల్లో ప్రధాని మోడితో పాటు బిజెపి జాతీయ నాయకులు ప్రచారం చేసినా 103 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతయ్యాయని, దేశ స్థాయిలో కూడా మోడి పతనం ప్రారంభమైందని, ప్రజలు ఆయనను విశ్వసించడం లేదని అన్నారు. దేశ రాజకీయాల్లో బిజెపి ఇకపైన 'బిల్డప్ జాతీయ పార్టీ'గానే మిగిలిపోతుందన్నారు. మోడి వ్యవహారం చూస్తుంటే పైన పటారం లోన లొటారంలా ఉందని హేళన చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో గుడ్డిలో మెల్ల గా కాంగ్రెస్ గెలిస్తే ఏదో గొప్ప సాధించినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పుకోవడం విచిత్రంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి పూర్తిగా పతనమవుతాయన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్‌కు భారీ మెజారిటీ

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్కటి మినహా మిగిలిన 16 పార్లమెంట్ స్థానాలూ టిఆర్ఎస్ కైవశం అవుతాయని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఆ ఒక్క స్థానం మజ్లిస్ పార్టీకి దక్కుతుందన్నారు. టిఆర్ఎస్ గెలిచే స్థానాలు ఖరారైనా ఎక్కువ మెజారిటీ సాధించేలా పార్టీ శ్రేణులంతా నిరంతరం కృషి చేయాలని కోరారు. తాజాగా జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాలే రానున్న పార్లమెంటు ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ట్రాక్టర్ గుర్తుతో కొన్ని స్థానాల్లో టిఆర్ఎస్‌కు ఓట్ల శాతం తగ్గిందని, అతి తక్కువ ఓట్ల చేడాతో సుమారు 10 శాసనసభ స్థానాలను కోల్పోయామని పేర్కొన్నారు. ఖమ్మంలో ఆశించిన ఫలితం రాలేదన్నారు. ఈ అంశాలను అధ్యయనంచేసి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో 16 స్థానాలు గెలుచుకుంటే కేంద్రంలో టిఆర్ఎస్ నిర్ణయాత్మకంగా ఆవిర్భవిస్తుందన్నారు. తెలంగాణలో ఆశించినంత అభివృద్ధి జరగాలంటే కేంద్రంలో తప్పనిసరిగా టిఆర్ఎస్ శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు. ఇప్పటికే దేశంలో కాంగ్రెస్, బిజెపికి వ్యతిరేకంగా ఎస్‌పి, బిఎస్‌పి, బిజెడి ఆవిర్భవించాయని, ఇటీవల వైసిపి నేత జగన్మోహన్‌తో జరిపిన చర్చల్లోనూ ఆయన ఇదే ఆలోచనను వ్యక్తం చేశారని చెప్పారు.

సీమాంధ్రులంతా టిఆర్ఎస్ పక్షమే

తెలంగాణలో ఉంటున్న సీమాంధ్ర ప్రజలకు టిఆర్ఎస్ వ్యతిరేకంకాదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం సీమాంధ్రులను కడుపులో పెట్టుకుని కాపాడుకోవడంతోనే తెలంగాణ ఎన్నికల్లో వారు కెసిఆర్‌కు ఓటువేశారన్నారు. అన్నదమ్ముల్లా విడిపోయి అభివృద్ధిలో పోటీ పడాలన్నదే టిఆర్ఎస్ విధానమన్నారు. చంద్రబాబు కుటీల రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, సోనియాని ఇటలీ మాఫియాగా విమర్శించి ఇప్పుడు ఆ పార్టీతోనే జతకట్టారని అన్నారు. బాబు తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కెసిఆర్‌పై అభాండాలు వేస్తున్నారని ఆరోపించారు. టిఆర్ఎస్‌కు బిజెపి, కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధాలు లేవని, సాధారణ ఎన్నికల్లో బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించింది టిఆర్ఎస్ పార్టీ అని గుర్తుచేశారు.

టిఆర్ఎస్‌లో చేరిన వంటేరు

- కెసిఆర్ పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారు
- తప్పు తెలుసుకొని టిఆర్ఎస్‌లో చేరుతున్నా : వంటేరు ప్రతాపరెడ్డి



గజ్వేల్‌కు చెందిన కాంగ్రెస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆ పార్టీని వీడి టిఆర్ఎస్‌లో చేరారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో గులాబీ కండువాను కప్పుకున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి ఏ కారణంతో చేరాల్సి వచ్చిందో వివరించారు. టిఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్‌లో శుక్రవారం సాయంత్రం వంటేరు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో యావత్తు దేశం గర్వించదగిన స్థాయిలో తెలంగాణ ఉందని, అందువల్లనే తాజా అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టిఆర్ఎస్ కృషిని గుర్తించి ఆశీర్వదించారని, కెసిఆర్‌ను ముఖ్యమంత్రి చేశారని అన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న అనేక పథకాలు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని, ఈ పరిస్థితుల్లో తాను కాంగ్రెస్‌లో ఉండటం పొరపాటే అవుతుందని గ్రహించి ఇప్పుడు టిఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టంచేశారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమక్షంలో శుక్రవారం టిఆర్ఎస్ పార్టీలో చేరిన అనంతరం మనసులోని మాటలను వ్యక్తం చేశారు. 2009, 2014, 2017 ఎన్నికల సందర్భంగా టిఆర్ఎస్ పార్టీలో చేరాలంటూ తనకు ఆహ్వానం వచ్చిందని, అయినా మొండిగా వ్యవహరించానని, ఇప్పుడు పొరపాటును గ్రహించి తన మనసు మార్చుకుని టిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకుని ఇప్పుడు చేరానని వివరించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ దూరదృష్టితో తలపెట్టిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గతంలో తాను పోరాటాలు చేసినా అక్కడి ప్రజలు మాత్రం తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌కే ఓటు వేశారని, దీంతో తన తప్పు ఏంటో తెలుసుకున్నానని, అందువల్లనే అనుచరులతో కలిసి టిఆర్ఎస్‌లో చేరానని పేర్కొన్నారు. కెసిఆర్ సంక్షేమ పథకాలు పేదలందరికీ చేరడంతోపాటు రైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశానికి ఆదర్శమయ్యాయన్నారు.

బియ్యం కొనుగోలు టెండర్లు

- నేటితో ముగియనున్న ప్రక్రియ
- 4.70 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు చర్యలు

మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను కూడా ప్రారంభించింది. శనివారంతో ఈ టెండర్ల ప్రక్రియ ముగియనుంది. రాష్ట్రంలో ఏడాదికి సగటున ఆరు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరముంటుంది. ఈ ఏడాది సంస్థ భారీగానే ధాన్యాన్ని కొనుగోలు చేసినప్పటికీ అవసరాలకు తగిన మేరకు బియ్యం సరిపోవనే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం దీనికి సంబంధించిన ప్రక్రియను శనివారంతో ముగించనుంది. ప్రస్తుతం నాలుగు లక్షల డెబ్బై వేల లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు కోసం సంస్థ మిలర్ల నుంచి టెండర్లను ఆహ్వానించింది. అయితే ముందుగా ఈ టెండర్లలో పాల్గొనేందుకు రైస్‌మిల్లర్ల అసోసియేషన్ వెనుకడుగు వేసింది. తమకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి గతంలోనే పౌరసరఫరాలశాఖ కమిషనర్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన హామీ ఇచ్చారు. ఆ తర్వాత బియ్యం కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రస్తుతం 4.70 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో 3.50 లక్షల మెట్రిక్ టన్నుల మేరకు దొడ్డు బియ్యం, 1.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. పౌరసరఫరాల సంస్థ ప్రజా పంపిణీ వ్యవస్థలో పలు ఆధునిక సాంకేతిక పద్ధతులకు శ్రీకారం చుట్టడంతో 1.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఆదా అవుతుందని సంస్థ అధికార యంత్రాంగం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 80 లక్షల రేషన్ లబ్ధిదారుల కోసం 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుంది. అయితే కేంద్రం లబ్ధిదారుల్లో ప్రతి ఒక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని సరఫరా చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం మరో కిలో అదనంగా చేర్చి ఆరు కిలోలను అందజేస్తున్నది. దీంతో కేంద్రం 1.05 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 70 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేస్తోంది. దీంతో పాటు సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇతర విద్యా సంస్థలు, మరికొన్నింటికి సంబంధించి ఏడాదికి సగటున ఆరు లక్షల మెట్రిక్ టన్నుల అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజా పంపిణీ అవసరాల రీత్యా కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ఈ టెండర్ల వ్యవహారంలో రాష్ట్ర మిల్లర్ల అసోసియేషన్ పాల్గొంటుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఢిల్లీలో లాబీయింగ్ బంద్ గావాలె

- కష్టపడ్డవాళ్లకు కాంగ్రెస్‌లో గుర్తింపేదీ?
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరిగి పూర్వవైభవం రావాలంటే ఢిల్లీలో లాబీయింగ్ విధానం బంద్ అవ్వాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఢిల్లీలో ఏ మాత్రం ప్రాధాన్యత లభించడం లేదని, అలాంటి వారికి పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలవడం కూడా గగనమవుతోందని ఆయన విమర్శించారు. కోటరి నేతలు అడ్డుపడుతుండడంతో నిజాయితీతో పనిచేసే నాయకులకు పార్టీ అధ్యక్షుడిని కలుసుకుని తమ మనోభావాలను పంచుకునే అవకాశం లేకుండా పోతోందని జగ్గారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవా రం సీఎల్పీ కార్యాలయంలో జగ్గారెడ్డి కొద్దిసేపు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పార్టీలో నెలకొన్న పరిస్థితులపై సంచలన వ్యాఖ్య లు చేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని అధిష్టానం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సీఎల్పీ నేత ఎంపిక విషయంలో రాహుల్‌గాంధీ సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. సమర్థుడైన నాయకుడికే ఆ బాధ్యతలు అప్పగించాలని, అలా కాకుండా ఢిల్లీలో లాబీయింగ్ చేసుకుని సిఎల్పీ నేతగా ఎన్నిక అయితే మా త్రం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మరిన్ని కష్టాలు తప్పవని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు పూర్తి స్థాయిలో రాహుల్‌గాంధీకి తెలియడం లేదని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. ఫలితంగానే ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం పాలైందన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితితో పాటు నాయకుల పనితీరుపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ పార్టీకి కష్టలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు 'హెరిటేజ్ తెలంగాణ' అంతర్జాతీయ సదస్సు

దక్షిణాది రాజ్యాలు, అభివృద్ధిపై సమగ్ర చర్చ

మన తెలంగాణ/హైదరాబాద్ : 'దక్షిణాపథంలో రాజ్యాలు, సామ్రాజ్యాలు – తెలంగాణ' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నగరంలో శనివారం ప్రారంభం కానుంది. 'హెరిటేజ్ తెలంగాణ' ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సు మూడవ అంతర్జాతీయ సదస్సుగా గుర్తింపు పొందింది. పూణేలోని దక్కన్ కాలేజీ వైస్ చాన్సలర్ వసంత్ షిండే ఈ సదస్సును శనివారం ఉదయం ప్రారంభిస్తారు. దక్షిణాపథం (కృష్ణా, తుంగభద్ర నదులకు ఉత్తరం వైపు, వింధ్య పర్వత శ్రేణులకు దక్షిణంలో ఉన్న ప్రాంతం)లోని రాజ్యాలు, సామ్రాజ్యాల్లో వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధి, తెలంగాణ కోణంపై జాతీయ, అంతర్జాతీయ స్కాలర్లు పరిశోధనా పత్రాలను సదస్సులో సమర్పిస్తారు. రెండవ అంతర్జాతీయ సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై, నిజామాబాద్‌లోని శాసనాలపై, పెద్ద బొంకూరులో తవ్వకాలపై హెరిటేజ్ తెలంగాణ శాఖ రూపొందించిన నివేదికలతో కూడిన పుస్తకాలను సదస్సులో ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు.

ఆ ఆలయంలో బిర్యానీ మహా ప్రసాదం

మదురై : తమిళనాడులోని మధురై జిల్లాలోని కుగ్రామం వదక్కంపట్టిలో వెలిసి ఉన్న మునియండి స్వామి ఆలయంలో మహాప్రసాదంగా బిర్యానీ అందించడం సంప్రదాయంగా సాగుతోంది. మాంసంతో తయారుచేసిన బిర్యానీని భక్తులకు ప్రసాదంగా అందించే ఈ తంతు 83 ఏళ్లుగా సాగుతోందని స్థానికులు తెలిపారు.

www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 209 | శనివారం | 19 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



ఆసీస్ ఫసక్

ఆస్ట్రేలియా గడ్డపై భారత్ పరిపూర్ణ విజయం

వన్డే సిరీస్ చారిత్రక గెలుపు

15

స్పీకర్ సర్

పోచారం ఏకగ్రీవం

- సిఎం కెసిఆర్, ఇతర పార్టీల నేతల అభినందన పరంపర
- ఆదర్శసభగా తీర్చిదిద్దుకుందాం : స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి తొలి పలుకు

7



టిఆర్‌ఎస్‌లోకి వంటేరు

కెసిఆర్ పథకాలే దేశానికి శిరోధార్యాలు,ఈ స్థితిలో నేను కాంగ్రెస్‌లో కొనసాగడం పొరపాటే అవుతుంది : వంటేరు ప్రతాప్‌రెడ్డి

2



ఏప్రిల్, మేలో లోక్‌సభ ఎన్నికలు?

14

మార్చి మొదటి వారంలో షెడ్యూల్? ఏపి, ఒడిషా, అరుణాచల్‌కు కుదిరితే కశ్మీర్ అసెంబ్లీకీ

మరింత మాగాణి



కోటింబావు ఎకరాలకు సాగునీరు

● ఈ లక్ష్యసాధన కోసం నిరంతర కృషి జరగాలి ● ఇంతవరకు ప్రాజెక్టులపై ఖర్చయినది రూ.99,643 కోట్లు ● ఈ ఆర్థిక సంవత్సరాంతానికి రూ. 1.07లక్షల కోట్లకు చేరనున్న వ్యయం ● ఐదేళ్లలో నిధులన్నీ ఖర్చుచేసి లక్ష్యం సాధించాలి ● తమ్మిడిహట్టి బ్యారేజి నిర్మాణంతోపాటు పెద్ద వాగు నీటిని సద్వినియోగం చేసేందుకు సమగ్ర వ్యూహం రూపొందించాలి : సమీక్షలో సిఎం కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రంలోని 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడం కోసం రూ. 2.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందించడానికి మించిన ప్రాధాన్యత మరొకటి లేదని, ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కొరత లేదని, వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రాణహిత నదిపై తమ్మిడిహట్టి వద్ద బ్యారేజి నిర్మించడంతో పాటు పెద్దవాగు నీటిని సద్వినియోగం చేసుకోడానికి సమగ్ర వ్యూహాన్ని తరువాయి 6లో

కెసిఆర్ ఫ్రంట్‌తో బాబు బెంబేలు : కెటిఆర్

2

కుంచెపోటు



అందరికీ బీరు వైద్యం కుదర్దయ్యా..!

ఇద్దరి ప్రాణాలు తీసిన పేలుడు



హైదరాబాద్ నగర శివారు కుషాయిగూడ కాప్రాలో సిలిండర్ పేలుడుకు ఇద్దరి దుర్మరణం, తునకలైన భవనం, చుట్టు ప్రక్కల విధ్వంసం

మన తెలంగాణ/చర్లపలి

ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇంటి యజమానితో పాటు దారిన పోతున్న ఓ వ్యక్తి మృతి తరువాయి 6లో



సిఎల్‌పి నేతగా భట్టి

కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం

7

ఉభయసభలనుద్దేశించి

నేడు గవర్నర్ ప్రసంగం

ఓట్‌అన్ అకౌంట్‌లో పాత పథకాలకు నిధులు

6

రెండోవిడతలో **788** ఏకగ్రీవ పంచాయతీలు

లోక్‌పాల్ వ్యవస్థ అవస్థ

సంపాదకీయం


గత లోక్‌సభ ఎన్నికల అఖండ విజయంతో భారతీయ జనతా పార్టీ అధికారం కైవసం చేసుకోడానికి ప్రధాన కారణాల్లో ఒకటైన లోక్‌పాల్ నియామక వ్యవహారం ఆ ప్రభుత్వ పదవీ కాలం ముగిసిపోవస్తున్నా ఒక కొలిక్కి రాకపోవడం మన ప్రజాస్వామ్యం నడుస్తున్న తీరుపై అసంతృప్తిని కలిగించకమానదు. ఎప్పుడో 2014 జనవరి 1 తేదీ నాడు అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోద ముద్రతో అవతరించిన చట్టం కింద ప్రధాని సహా దేశంలోని అత్యున్నత స్థానాలలో గలవారిపై అవినీతి ఆరోపణలను దర్యాప్తు చేయడానికి ఉద్దేశించిన లోక్‌పాల్ వ్యవస్థకు ఇంతవరకు నియామకాలు జరగకపోవడం పాలకుల అవకాశవాదాన్నే ఎత్తి చూపుతున్నది. లోక్‌పాల్ అధ్యక్ష, సభ్యుల పదవులకు వడపోసిన పేర్ల జాబితాను ఫిబ్రవరి నెలాఖరు లోగా ఎంపికల సంఘానికి సమర్పించాలని సెర్చ్ కమిటీని సుప్రీంకోర్టు గురువారం నాడు ఆదేశించవలసిరావడం ఈ వ్యవహారంలో జరుగుతున్న వల్లమాలిన జాప్యానికి తాజా తార్కాణం. లోక్‌పాల్ వ్యవస్థకు నియామకాల దిశగా ఇంతకాలం జరిగిందేమిటి, ఆలస్యానికి కారణాలేవి అనే ప్రశ్నలు కలగడం సహజం. పాలకులు గట్టిగా తలచుకుంటే ఇంతటి కీలక వ్యవస్థకు నియామకాలు సకాలంలో జరిపించలేరా? వారిలో ఆ తలంపు ఎందుకు అంకురించలేదు?

గాంధేయవాది అన్నాహజారే నేతృత్వంలో ఢిల్లీ వేదికగా దేశమంతటా ఉధృతంగా సాగి ప్రపంచ దృష్టిని విశేషంగా ఆకర్షించిన లోక్‌పాల్ ఉద్యమం నేపథ్యంలో 2011 డిసెంబర్ 27న దీనికి సంబంధించిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. తర్వాత రెండు రోజుల్లో ఆ నెల 29న రాజ్యసభలో ప్రవేశించింది. అర్ధరాత్రి వరకు సుదీర్ఘ చర్చ సాగిన తర్వాత ఓటింగ్ జరగకపోవడంతో బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు. చివరికి 2013 డిసెంబర్ 17న కొన్ని సవరణలతో రాజ్యసభ ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి ముద్రతో 2013 నాటి లోక్‌పాల్, లోకాయుక్త చట్టంగా దేశ శాసన సముదాయంలో చేరింది. కాని ఇంతవరకు ఈ చట్టం ఫలితాన్ని దేశప్రజలు చవిచూడలేకపోయారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు తదితర రాజకీయ నీతిమాలినతనం కేసులు ఒకదాని తర్వాత ఒకటి సంచలనాలు సృష్టిస్తున్నాయే గాని వాటిపై దుర్భిణీ వేసి నిజాలు నిగ్గు తేల్చే వ్యవస్థ చిటారు కొమ్మమీద మిఠాయి పొట్లం మాదిరిగా నోరూరిస్తూ నోట్లో మట్టి కొడుతూనే ఉంది. ప్రధాన ప్రత్యర్థి రాజకీయ పక్షాలు నువ్వు దొంగవంటే నువ్వేనంటూ పరస్పర ఉతుకుడు కార్యక్రమాన్ని రక్తికట్టిస్తూ ప్రజలకు సినిమా చూపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం లోక్‌పాల్ చైర్ పర్సన్ పదవికి కనీసం ఐదుగురిని, ఒక్కో సభ్యత్వ ఖాళీకి తక్కువతక్కువగా ముగ్గురేసి మందిని సెర్చ్ కమిటీ గుర్తించి ఎంపికల సంఘానికి సిఫారసు చేయాలి. సెలెక్షన్ కమిటీలో లోక్‌సభ స్పీకర్, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో జడ్జి సభ్యులుగా ఉంటారు. అలాగే సెర్చ్ కమిటీ కూడా నిపుణులతో నిండి ఉంటుంది. ఆయా పదవులకు తగిన ప్రతిభావంతులను సెర్చ్‌లైట్ వేసి వెతుకుతుంది. సువిశాల భారతంలో వివిధ రాష్ట్రాల్లోని నిపుణులను వడగట్టి తుది జాబితాను సిద్ధంచేసే పనిని నిర్వర్తిస్తుంది.

సెర్చ్ కమిటీని తాము గత సెప్టెంబర్ 27నే నియమించామని కేంద్రం సుప్రీంకోర్టుకు చెప్పింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అది జరిపిన అన్వేషణ ఎంతవరకు వచ్చిందో తెలియదు. సుప్రీంకోర్టు ఇప్పుడు గడువు విధించింది కాబట్టి నెలన్నర రోజుల్లో ఈ అన్వేషణ పూర్తయి ఖరారు జాబితా సిద్ధం కావలసి ఉంది. సుప్రీంకోర్టు వెంటబడినందునే సెర్చ్ కమిటీ నియామకం ఇంతకాలానికి జరిగిందని అనుకోవలసి ఉంది. కేంద్రంలోని పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ఇది ఎప్పుడో జరిగి ఉండవలసింది. తమ రాజకీయ ప్రత్యర్థుల ప్రభుత్వాన్ని కూల్చడానికి, వారి పార్టీని ఎన్నికల్లో చిత్తుగా ఓడించడానికి తగిన పాచికగా తాము చాకచక్యంతో ఉపయోగించుకున్న లోక్‌పాల్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేయడంలోని కేంద్ర పాలకుల దుష్ట రాజకీయం తీవ్రంగా ఖండించదగినది. తాజాగా సుప్రీంకోర్టు పెట్టిన వ్యవధిలోనైనా అర్హుల జాబితా సమర్పణ జరిగి దేశ తొలి లోక్‌పాల్ నియామకం క్రియా రూపం ధరిస్తుందని ఎదురు చూద్దాం.

కర్ణాటక కప్పల రాజకీయం



కర్ణాటకను ఒకవైపు కరువు పీడిస్తోంది. అనావృష్టితో అల్లాడిపోతోంది. రాష్ట్రంలోని 30 జిల్లాల్లో దాదాపు 23 జిల్లాల్లో వర్షపాతం చాలా తక్కువ నమోదైంది. రాష్ట్రం ఇలాంటి పరిస్థితిలో ఉంటే 224 మంది ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులుగా చేయవలసిందేమిటి? ఈ కరువు సమయంలో ప్రజలను ఆదుకోడానికి పని చేయాలి. కాని బిజెపి శాసనసభ్యులు వారితో పాటు కొందరు కాంగ్రెసు శాసనసభ్యులు గుర్ గాంవ్ లోని లగ్జరీ హోటల్లో క్రికెట్ ఆడుకుంటూ, విహారయాత్ర చేశారు. ఖరీదైన హోటల్లో ఈ శాసన సభ్యుల కోసం డెబ్బయి రూములు బుక్ చేశారట. ఒక్కో రూముకు ఒక రోజుకు రూ. పాతిక వేల నుంచి ముప్పయి వేల వరకు కిరాయి చెల్లించి ఎమ్మెల్యేలను అక్కడ బిజెపి ఎందుకు ఉంచింది? అనేది ఇప్పుడు ప్రజలు అడుగుతున్న ప్రశ్న. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అధికారం కోసం కుమ్ములాటల కుట్రలు జరిగాయి.

కర్ణాటకలో జెడి (యస్), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఉంది. బిజెపి ప్రతిపక్షంలో ఉంది. 224 మంది సభ్యుల అసెంబ్లీలో 104 మంది శాసనసభ్యులున్న బిజెపి అతిపెద్ద పార్టీ. కాని కమలనాథుల వ్యూహాలనే వారిపై ప్రయోగిస్తున్న కాంగ్రెస్ ఎత్తుగడ వల్ల కర్నాటకలో బిజెపికి అధికారం దక్కలేదు. కాంగ్రెస్ బలం 80. జెడి(యస్) బలం 37. ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, పార్టీమార్పిళ్ళను ప్రోత్సహిస్తోందని, ఎమ్మెల్యేలను కొనేసే ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలతో ఈ వారం రోజులు కర్ణాటకం కొనసాగింది. మరోవైపు బిజెపి కూడా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసింది.

చూపు

ప్రభుత్వంలో ఉన్న కూటమికి మొత్తం 117 మంది సభ్యుల బలం ఉంది. స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురున్నారు. బిజెపి బలం 104. మెజారిటీకి 9 మంది ఎమ్మెల్యేలు తక్కువ ఉన్నారు. పార్టీ మార్పిడిని ప్రోత్సహించి కొందరు ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకోవడం బిజెపికి సులభ సాధ్యం కాదు. అలా చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా న్యాయస్థానంలో అది నిలబడడం కష్టం. కాంగ్రెస్‌ను లేదా జెడి(యస్) లను నిలువుగా చీల్చే సామర్థ్యం, వనరులు కూడా బిజెపికి ఉన్నాయి. కాని 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను కాని జెడి(యస్)ను కాని చీల్చడం అంత సులభం కాదు. ప్రభుత్వాన్ని పడగొట్టే మరో పద్ధతి కాంగ్రెస్ శాసనసభ్యుల్లో కనీసం 13 మంది అసెంబ్లీకి రాజీనామా చేస్తే సభలో సభ్యుల సంఖ్య 211కు పడిపోతుంది. అప్పుడు మెజారిటీకి కావలసింది కేవలం 106 మంది ఎమ్మెల్యేలే. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో బిజెపి ప్రభుత్వంలోకి రావచ్చు. కాని కాంగ్రెస్ నుంచి 13 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించడం కూడా సులువు పని కాదు. కాబట్టి ఇప్పటికిప్పుడు కర్ణాటకలో ప్రభుత్వాన్ని పడగొట్టే పరిస్థితి బిజెపికి లేదు.

కొన్ని మీడియా సంస్థలు కర్ణాటక ప్రభుత్వం రేపోమాపో కుప్పకూలుతుందన్నట్లు రాశాయి. ఎందుకింత అయోమయం సృష్టించారన్నది ఆలోచించవలసిన ప్రశ్న కర్ణాటకలో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నించడం ద్వారా బిజెపి ఎందుకు అయోమయాన్ని సృష్టించింది? గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయత్నాలు చేసిన చరిత్ర ఉంది. రాజ్యాంగ విలువలను లక్ష్యపెట్టకుండా బిజెపి పార్టీ మార్పిడి రాజకీయాలను ప్రోత్సహిస్తుందన్న విమర్శలు రావచ్చని తెలిసినా బిజెపి ఇలా ఎందుకు చేసింది అనేవి ముఖ్యమైన ప్రశ్నలు. కర్ణాటకలో బిజెపి అతిపెద్ద పార్టీ కాబట్టి న్యాయంగా తమకే ప్రభుత్వంలోకి రావలసిన హక్కు ఉందని, కాంగ్రెస్ కుట్ర పూరితంగా తమను అధికారానికి దూరం చేసిందని అందువల్ల బిజెపి ప్రయత్నాలను ప్రజలు అర్థం చేసుకుంటారని కొందరు వాదించవచ్చు. కాని అలా చెప్పే అవకాశం లేదు. గోవాలో కాంగ్రెస్ విషయంలో బిజెపి ఏం చేసిందో, కర్ణాటకలో బిజెపి విషయంలో కాంగ్రెస్ అదే చేసింది. కాబట్టి రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలే ఇవి. అతిపెద్ద పార్టీ కాబట్టి మాదే ప్రభుత్వం అని చెప్పే అవకాశం లేదు.

కర్ణాటకలో బిజెపి ఒక స్పష్టమైన సందేశాన్ని దేశ ప్రజలందరికీ ఇవ్వాలనుకుంటోంది. అదేమిటంటే, సంకీర్ణ ప్రభుత్వాలు నిలకడలేనివి అన్న సందేశం. కర్ణాటక ప్రభుత్వం పడిపోయే పరిస్థితి లేదు. అయినా పడిపోతుందేమో అనే వాతావరణం మీడియా ద్వారా సృష్టించడం జరిగింది. సంకీర్ణ ప్రభుత్వాలు స్థిరంగా పాలించలేవు అనే అభిప్రాయం యావత్తు దేశంలో ఏర్పడేలా చేయడమే ఈ ఎత్తుగడ. ప్రభుత్వ స్థిరంగా లేనప్పుడు ఏం జరుగుతుంది? కర్ణాటకలో జరిగింది ఇదే. రాష్ట్రం కరువు పరిస్థితుల్లో ఉంటే పాలక పక్షం తన ఎమ్మెల్యేలను కాపాడుకునే ప్రయత్నాల్లో పడింది. ప్రతిపక్షం తన ఎమ్మెల్యేలను ఖరీదైన హోటల్‌కు తరలించింది. ప్రజల సమస్యలను పట్టించుకునేవాడే లేకపోయాడు.

భారతదేశంలో 1990 తర్వాతి నుంచి 2014 వరకు అనేక సంకీర్ణ ప్రభుత్వాలు పనిచేశాయి. యుపిఎ ప్రభుత్వం కాని, అంతకు ముందు ఎన్‌డిఎ ప్రభుత్వం కాని, ఈ రెండింటికి ముందు నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ వగైరాలన్నీ కూటమి రాజకీయాల పరిమితుల వల్ల అనేక నిర్ణయాలను వాయిదా వేసుకోవడం జరిగింది. సంకీర్ణ ప్రభుత్వాలు బలహీనంగా పనిచేయడం వల్లనే బలమైన నాయకుడు అవసరమన్న ధోరణి పెరిగింది. గుజరాత్ మోడల్ ప్రచారం, మోడీ బలమైన నాయకుడనే ప్రచారం వల్ల 2014 ఎన్నికల్లో బలమైన నాయకుడి కోసం మొత్తం దేశం ఓటు వేసింది. భారత ప్రజాస్వామ్యం అధ్యక్ష తరహాలోకి మళ్ళుతుందేమోననుకొన్న స్థాయిలో 2014 ఎన్నికల ప్రచారం జరిగింది. బలమైన నాయకుడు, బలమైన కేంద్రం వంటివి ప్రజలను ఆకట్టుకున్నాయి. దీనికి కారణం సంకీర్ణ ప్రభుత్వాలు బలహీనంగా కనిపించడమే. ఇప్పుడు మరోసారి దేశ వ్యాప్తంగా కూటమి రాజకీయాలు జోరందుకున్నాయి. ఒకవైపు ఫెడరల్ ఫ్రంట్, మరోవైపు మహాఘటబంధన్ రాజకీయాలు మొదలయ్యాయి. బీహారులో మహాఘటబంధన్ లో చిచ్చుపెట్టి బిజెపి కొంత విజయం సాధించింది. కర్ణాటకలోనూ అలాంటి పరిస్థితిని సృష్టిస్తే సంకీర్ణ ప్రభుత్వాలు బలహీనమైనవన్న అభిప్రాయం ప్రజల్లో బలపడితే బిజెపికి ప్రయోజనమన్నది ఎత్తుగడ కావచ్చు.కాని ఇప్పుడు ప్రజలు బలమైన నాయకుడు, ఎదురులేని నాయకుడు అవసరమని భావిస్తున్నారా అన్నది ప్రశ్న. ఎదురులేని నాయకుడు ఉండడం వల్లనే 2016లో నోట్లరద్దు అర్ధరాత్రి వచ్చి పడింది. ఎటిఎం క్యూలలో ప్రజలు ప్రాణాలు విడిచే పరిస్థితి దాపురించింది. ఇలాంటి ప్రమాదాల కన్నా బలహీనమైన సరే సంకీర్ణాలే మెరుగు అని ప్రజలు భావించినా ఆశ్చర్యం లేదు. బలమైన నాయకుడి కోసం ఓటేసే బదులు ఫెడరల్ స్ఫూర్తితో ప్రాంతీయ పార్టీలు కలిసి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పరచడమే మంచిదని ప్రజలు నిర్ణయించుకోవచ్చు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఇలాంటి ఆలోచనలనే ప్రజల్లో పెంచుతున్నాయి. బిజెపి ఎత్తుగడ బెడిసికొడుతుందా? రానున్న ఎన్నికల్లోనే తెలుస్తుంది.

* ఉమైర్

కోదండరాం వైఫల్యం ఎందుకు?



టంకశాల అశోక్
9848191767


అసెంబ్లీ ఎన్నికలలో కోదండరాం ఎందుకు విఫలమైనట్లు? ఆయన అంతకు ముందు సామాజిక కార్యకర్తగా, మేధావిగా తగిన గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించారు. ఆమేరకు వాటిని ఆయన విజయాలు అనాలి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తనకు రాజకీయ పరమైన ఆలోచనలు లేవని, సమాజం పక్షాన 'వాచ్‌డాగ్' వలె వ్యవహరించగలనని అన్నారు. ఒకవేళ అటువంటి పాత్ర నిర్వహణకు పూనుకొని ఉంటే ఏ విధంగా సఫలమై ఉండేవారో ఊహించి చెప్పలేము. ఎందుకంటే, ఒక పాత్రను ఎంచుకోగానే సరిపోదు. దానిని ఎంచుకున్నంత మాత్రాన ఆటోమేటిక్‌గా సఫలమవుతారని చెప్పలేము. ఆ పాత్ర విషయమై తన నిర్వచనం, అజెండాలు ఏమిటి? వాటిని ఏ విధంగా నిర్వహిస్తారు అనే దానిపైనే సాఫల్యాలు – వైఫల్యాలు ఆధారపడి ఉంటాయి.

ఏది ఏమైనా ఆయన తను ప్రకటించిన పాత్రను కాకుండా అంతిమంగా ప్రత్యక్ష రాజకీయాలను ఎంచుకున్నారు. అందుకు ఇదమిత్థమైన కారణాలు ఏమిటో మనకు పూర్తిగా తెలియవు. సమాజాన్ని మార్చాలన్నా, పరిపాలన, అభివృద్ధి సవ్యంగా సాగాలన్నా ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొనటం, అధికార సాధన అవసరమని తన మిత్రులు సలహా ఇచ్చారని, అందువల్లనే అటువంటి నిర్ణయం తీసుకున్నానని ఒకటి రెండు సందర్భాలలో క్లుప్తంగా అన్నారు కోదండరాం. అదిగాక బయటకు వెల్లడించని కారణాలు ఏమైనా ఉన్నాయేమో మనకు తెలియదు. ఊహాగానాలు కొన్ని సాగుతున్నాయిగాని, ఆధారాలు లేకుండా వాటిలోకి వెళ్లటం వల్ల ఉపయోగం లేదు. దానినట్లుంచితే, తన మిత్రుల సలహా అంటూ టిజెఎస్ అధ్యక్షుడు చెప్పిన మాటలలో యథాతథంగా తగిన విలువ ఉంది. వాచ్‌డాగ్‌లు మార్పులను సూచించగలవు, వత్తిడులు సృష్టించగలవు తప్ప స్వయంగా మార్పులను తేలేవు. ఆ పని చేయగలది రాజకీయ శక్తులే.

ఆ విధంగా కోదండరాం ఆలోచించటం వరకు సరిగానే ఉన్నదిగాని, తన పొరపాట్లు ఆ తర్వాత నుంచి మొదలయ్యాయి. వాచ్‌డాగ్ పాత్రను గురించి తాను అన్నదానిపై పైన మనం చెప్పుకున్న మాటలు ఈ రాజకీయ పాత్రకు కూడా వర్తిస్తాయి. ఒక పాత్రను ఎంచుకున్నంత మాత్రాన ఆటోమేటిక్‌గా సఫలమవుతారని చెప్పలేము. దానిపై తన నిర్వచనం, అజెండాలు ఏమిటి? వాటి ఏ విధంగా నిర్వహిస్తారు అనే దానిపైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉంటాయి. అందుకు అదనంగా మరొకటి స్పష్టం చేయాలి. "ఏ విధంగా నిర్వహిస్తారు" అనే మాటలో, ఆ వ్యక్తి శక్తి సామర్థ్యాలు ఏమిటి అనేది అంతర్లీనంగా ఉంటుంది.

పార్టీ ఏర్పాటులో కోదండరాం ఉద్దేశాలు మనకు ఇప్పటికీ పూర్తిగా తెలియవు గాని, అవి ఏమైనప్పటికీ ప్రాథమికంగా ఒక మాట చెప్పాలి. ఆయన పార్టీ గురించి మొదట అస్పష్టంగా, తర్వాత స్పష్టంగా మాట్లాడి చివరకు టిజెఎస్‌ను ప్రకటించిన దశలోగాని, అప్పటి నుంచి మొదలుకొని మహాకూటమి మీదుగా ఎన్నికల ఫలితాల వరకు గల దశలోగాని ఆయన ప్రయాణపు తీరును పరిశీలించిన మీదట ఒక విషయం బాగా స్పష్టమైపోయింది. రెండు ఇంగ్లీషు మాటలలో చెప్పాలంటే ఆయన "పొలిటికల్ ఎనిమల్" కారు. అదే విధంగా 'హి ఈజ్ నాట్ కట్ ఫర్ దట్'. ఈ మాటల అర్థం తెలుగులో చెప్పాలంటే, తను ఒక రాజకీయ జీవి కాలేరు. రాజకీయాలు చేయలేరు. అందుకు తగిన లక్షణాలు లేవు.

ఉద్యమం ద్వారా ఏర్పడిన ఒక రాష్ట్రానికి వాచ్‌డాగ్ అన దగ్గది ఒకటి అవసరమని కోదండరాం భావిస్తే అందులో ఆక్షేపించవలసింది లేదు. కాని ఆయన ఆ మాట అనటానికి, పార్టీని ప్రకటించటానికి మధ్య కాలంలో ఆ పాత్ర గురించి నిర్వచించిందిగాని, అటువంటి పాత్రను నిర్వహించిందిగాని నికరమైన రీతిలో పెద్దగా కన్పించదు. అది నిర్వహిస్తానని కొద్దిసార్లు అన్నంత మాత్రాన దాని స్వరూప స్వభావాలు ఏమిటో, కార్యరూపం ఏమిటో ప్రజలకు తెలిసిపోదు. అవన్నీ స్పష్టంగా సామాన్యులకు తెలియాలి, ఆచరణలో వారికి తగినంత కాలం కన్పించాలి. అందువల్ల కలిగే ప్రయోజనమేమిటో అనుభవానికి రావాలి. అపుడుగాని వాచ్‌డాగ్ అయినది తన పాత్రను స్థిరపరచుకోజాలదు. అది జరిగిన తర్వాతగాని ఆ పాత్ర ధారికి రాజకీయ విలువ కూడా ఏర్పడదు. లక్ష్యాల సాధన ప్రత్యక్ష రాజకీయాల ద్వారా మాత్రమే వీలు పడుతుందన్నది సూత్ర రీత్యా నిజమే. కాని ఆ విధంగా ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించే ముందు, వాచ్‌డాగ్ పాత్రను సమర్థంగా నిర్వహించటం ద్వారా గుర్తింపును, సమర్థతను, అనుభవాన్ని సంపాదించుకోవాలి. అవి పార్టీ దశలో ఉపయోగపడతాయి. కాని టిజెఎస్ అధ్యక్షుడు ఇటువంటివి ఏవీ చేయలేదు. కారణాలు ఏవైతేనేమి లాంగ్‌జంప్‌కు నిర్ణయించుకున్నారు.



ఒక పాత్రను ఎంచుకున్నంత మాత్రాన ఆటోమేటిక్‌గా సఫలమవుతారని చెప్పలేము. దానిపై తన నిర్వచనం, అజెండాలు ఏమిటి? వాటిని ఏ విధంగా నిర్వహిస్తారు అనే దానిపైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉంటాయి. అందుకు అదనంగా మరొకటి స్పష్టం చేయాలి. "ఏ విధంగా నిర్వహిస్తారు" అనే మాటలో, ఆ వ్యక్తి శక్తి సామర్థ్యాలు ఏమిటి అనేది అంతర్లీనంగా ఉంటుంది.

కోదండరాం రెండవ పెద్ద వైఫల్యం అసలు తన ప్రాపంచిక దృక్పథం, విధానాలు ఏమిటో తెలంగాణ సందర్భంలో వివరిస్తూ ఒక విధాన పత్రాన్ని (కాన్సెప్ట్ పేపర్) ప్రజల ముందుంచక పోవటం. ఆ పని ఆయన 'వాచ్‌డాగ్' అవతార కాలంలో చేయలేదు, పార్టీ ఏర్పాటు దరిమిలా కూడా చేయలేదు. ఆయన నుంచి నిర్మాణాత్మకంగా, పాజిటివ్‌గా ఇటువంటివేవీ ప్రజలకు తెలియరాలేదు గాని, ప్రభుత్వంపై, అధికార పక్షంపై, వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌పై నిరంతర విమర్శలు మాత్రం వినవస్తూ పోయాయి. విమర్శలు ఆయన హక్కు. కాని పాజిటివ్‌గా చేయవలసినవి చేయటం అంత కన్న చాలా ముఖ్యం. ప్రజలకు కేవలం విమర్శలపట్ల కొద్ది కాలం తర్వాత విసుగు వేస్తుంది. చేయగల దేమిటో పాజిటివ్‌గా చెప్పాలని కోరుకుంటారు. తన మాటల తీరు, శైలి వల్ల ఆయనకు తెలంగాణ మంచి చెడులపట్ల ఏమి ఆలోచనలు ఉన్నాయో తెలియదుగాని, కెసిఆర్ పట్ల వ్యక్తిగత వ్యతిరేకత ప్రధానమైపోయిందనే అభిప్రాయం ఏర్పడుతూ పోయింది. 'చేత కాకుంటే దిగండి, మేము చేసి చూపిస్తాం', 'దించేందుకే బయలు దేరాం', 'ఎట్లాగైనా గద్దె దించాలి' వంటి మాటలు, శీర్షికలు కోదండ రాంకు కలిగించిన నష్టం అపారమైనది. అవి కలిగించిన అభిప్రాయాలను ఆయన సరిదిద్దేందుకు ప్రయత్నించలేదు సరికదా, కంకణం ఏదో కట్టుకున్నట్లు దానిని మరింత బలపరుస్తూ పోయారు. ఆశ్చర్యకరం, గమనార్హమేమంటే, ఒక వైపు కెసిఆర్‌కు ప్రజాదరణ పెరుగుతూపోతున్న దశలో కోదండరాం ఈ పని చేశారు.

అటువంటి పరిస్థితులలో ప్రజలకు కోదండరాం నిజమైన ఉద్దేశాలు ఏమిటా అన్న సందేహాలు మొదలయ్యాయి. తనపట్ల గౌరవం, నమ్మకం రెండూ తగ్గసాగాయి. ఇటువంటి మార్పు ఆయన ఇంకా పార్టీ పెట్టక ముందే కన్పించింది. దానితో, ఇక ఆయన కాంగ్రెస్‌తో కలిసి పోతారంటూ అంతకు ముందు కొద్ది మందికి ఉండిన అనుమానాలు చాలా మందికి కలగసాగాయి. ఒకసారి ఆ మార్పు వచ్చిందంటే ఇక తన వాచ్‌డాగ్ మాటలనుగాని, పార్టీ ఆరంభించటంలో ఏవో సదుద్దేశాలు ఉన్నాయనిగాని నమ్మటం ప్రజలకు కష్టమవుతుంది. అదే జరిగింది కూడా. చివరకు కూటమితో, చంద్రబాబుతో చేతులు కలపటంతో కథ ఒక ముగింపుకు వచ్చింది. ఇటువంటి కథకు అది తార్కికమైన ముగింపు కూడా. కూటమిలో ఒకసారి చేరిన తర్వాత ఏమేమి జరుగుతూ వచ్చిందో అందరికీ ఒక జుగుప్సాకర విషాదాంత ప్రహసనంగా గుర్తుండే ఉన్నందున ఆ వివరాలు ఇక్కడ చెప్పుకోనక్కర లేదు. ఆ విధంగా కోదండరాం అపరిపక్వ, అస్పష్ట రాజకీయ ప్రయోగం ముగిసిపోయింది. అయితే ఇందుకు ఆయన తనను తాను తప్ప మరెవరినీ నిందించజాలరు.

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేక కోటా



పాణి
విరసం కార్యదర్శి
9866129458

బిజెపి ప్రభుత్వం అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవడం రాజ్యాంగ వ్యతిరేకం. రిజర్వేషన్ల వెనుక ఉన్న సామాజిక న్యాయ భావనను ఈ నిర్ణయం అపహాస్యం చేస్తోంది. అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వాళ్లకు రిజర్వేషన్లనే పేరుతో ప్రభుత్వం ఇన్నేళ్ల రిజర్వేషన్ల విధానంలోకి కొత్త ఒరవడిని తీసుకొని వచ్చింది. రిజర్వేషన్లకు ఆర్థిక వెనుకబాటుతనం, పేదరికం ప్రాతిపదిక కాదు. అంటరానితనం, సామాజిక వివక్ష మాత్రమే రిజర్వేషన్ల కల్పనకు పునాది. సామాజిక అంతరాలు, వైరుధ్యాలు పరిష్కారం కాకుండా ప్రతి మనిషికి ఓటు హక్కు ఇచ్చినంత మాత్రాన సమానత్వం సాధ్యం కాదనే ఎరుకతో రాజ్యాంగ నిర్మాతలు ఈ స్ఫూర్తిని ప్రదర్శించారు.

ఇంకో పక్క ఆస్తిపర వర్గాలకే సమాజం మీద, రాజ్యాంగ యంత్రం మీద పెత్తనం కట్టబెట్టే రాచమార్గాన్ని రాజ్యాంగమే కల్పించింది. మన దేశంలో సంపద మీద అధికారానికి కుల వ్యవస్థకు దగ్గరి సంబంధం ఉంది. కులంతో సంబంధం లేకుండా పేదరికం లేదు. వెనుకబాటుతనం లేదు. ఒకవేళ ఆర్థిక సమానత్వం సాధించినా సామాజిక న్యాయం అమలు కాదు. అంటరానితనం, కుల వివక్ష పోనంత వరకు సామాజిక సమానత్వానికి చోటే లేదు. దీన్ని సాధించేందుకు సామాజిక ప్రాతిపదిక పునాది కావాలి. ఆర్థికం కాదు.

తరతరాలుగా కొన్ని సామాజిక సమూహాలకు పని గట్టుకొని అన్ని అవకాశాలను దూరం చేసిన అమానవీయ కుల వ్యవస్థ మన దేశంలో బలంగా వేళ్లూనుకొని ఉంది. అన్ని రంగాల్లోనూ దళితుల, వెనకబడిన కులాల ప్రాతినిధ్యం పెంచకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదు. ఉన్నత విద్య, ఉద్యోగాల సామాజిక బాధ్యత నిర్వర్తించి, ప్రజలకు సేవ చేసే స్థానాలు కనకనే వాటిల్లో అన్ని సమూహాల ప్రాతినిధ్యం ఉండాలి. ప్రజలకు సేవ చేసే స్థానాల్లో ఆధిపత్య కులాలు, పురుషులు మాత్రమే ఉంటే అక్కడికి పీడిత కులాలు, స్త్రీలు చేరుకోవడమే దుర్లభం. కనుక రిజర్వేషన్లు కల్పించడం ప్రజాస్వామ్య బాధ్యత. అందుకోవడం ఆయా వర్గాల హక్కు. ఇది అయ్యో పాపం అని అందించే సహాయం కాదు. వేల ఏళ్లుగా వ్యవస్థ చేసిన తప్పును సరిదిద్దుకోవడం. వందల వేల ఏళ్లుగా సామాజిక వివక్షకు గురవుతున్న వాళ్లకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక రాజ్యాంగం స్థూలంగా ఈ స్ఫూర్తిని ప్రదర్శించింది.

దళితుల్లో సంపన్నులు దాదాపు లేనట్లే. మొత్తంగా సంపన్నులు చాలావరకు అగ్రకులాల వాళ్లే ఉంటారు. అయితే అగ్రకులాల్లో కూడా సంపన్నుల కన్నా సామాన్యులే మెజారిటీ. దీనిని చూపించి మరి అగ్రకులాల్లో పేదలకు అవకాశాలు అక్కర్లేదా అని వాదన చేస్తూ ఉంటారు. మరో అడుగు ముందుకేసి అసలు రిజర్వేషన్ల వల్లే అగ్రకులాల్లో పేదలకు అవకాశాలు లేకుండా పోతున్నాయని అంటారు. రిజర్వేషన్ల అర్థం తెలీని చాలా అసంబద్ధమైన వాదన ఇది. ఇందులో కుల స్వభావం తొంగిచూస్తూ ఉంటుంది. ఉద్యోగం రాకపోవడం మొత్తంగా నిరుద్యోగ సమస్యలో భాగం. లక్షల్లో అభ్యర్థులు, వందల్లో కూడా లేని ఉద్యోగాలు ఇప్పుడున్న స్థితి. నిరుద్యోగ సమస్య మీద ప్రజలకు ప్రభుత్వంపై ఆగ్రహం కలగాలి. కానీ మన దేశంలో కింది కులాల మీద అసూయ, ద్వేషం కలుగుతుంది.

ఇటువంటి భావజాలానికి సంఘపరివార్ మద్దతు ఉంటుంది. మద్దతు మాత్రమే కాదు దీన్ని రెచ్చగొడుతుంది కూడా. ఎలాగైతే ముస్లింలకు వ్యతిరేకంగా మతం పేర జనాన్ని రెచ్చగొడుతుందో, అలా దళితుల మీద ఆక్రోశంగా రిజర్వేషన్ల వ్యతిరేక వైఖరిని పలు సందర్భాల్లో అది వ్యక్తం చేసింది. మన దేశంలో ఫాసిజం కత్తికి మతం ఒక అంచు అయితే కులం మరో అంచు. రిజర్వేషన్ వ్యతిరేకత కూడా సంఘపరివార్ ఫాసిజంలో భాగం. మెరిట్ చర్చ కూడా ఇందులో భాగంగానే వచ్చింది. మెరిట్ లేకపోయినా డబ్బున్న వాడు సీటు కొనుక్కొని డాక్టర్ అయితే వాడి వల్ల సమాజం ఏమైపోతుంది అనే చర్చ రాదు. దళితుల విషయంలోనే ఈ చర్చ వస్తుంది. సామాజిక న్యాయ భావనకు సంఘపరివార్ వ్యతిరేకం కనకనే అది రిజర్వేషన్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ అసంబద్ధమైన చర్చను తీసుకొస్తుంది. అందుకు రిజర్వేషన్‌ను పేదరికానికి ముడిపెడుతుంది.

ఇప్పుడు పార్లమెంటులో తిరుగులేని అధికారంలో ఉన్న సంఘపరివార్ అగ్రకుల పేదలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పుడిక రిజర్వేషన్లను పేదరిక నిర్మూలనా కార్యక్రమంగా మార్చేశారు. పేదరికం, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం నానాటికీ పెరిగిపోవడానికి పాలకుల విధానాలే కారణం. దోపిడీతో సంబంధం లేకుండా పేదరికాన్ని పరిశీలించడానికి లేదు. శ్రమ దోపిడీ రద్దు కాకుండా పేదరిక నిర్మూలనా కార్యక్రమాల వల్ల వరిగేదేమీ లేదు. ఆ మాటకొస్తే సామాజిక సమానత్వ సాధనకు రిజర్వేషన్లే ఏకైక మార్గం అని ఎవరు అనుకున్నా అది నిజం కాదు. ఇప్పుడున్న రాజ్యయంత్రాంగంలో తరతరాలుగా దుర్భర స్థితిలో ఉన్న పీడిత కులాలకు రిజర్వేషన్లు ఉపశమనం మాత్రమే. రిజర్వేషన్ల ఫలాలను, వాటి ప్రభావాలను ఏ మాత్రం తక్కువ చేయకుండానే ఎక్కువ చేయడానికి కూడా లేదు. అలాగే పేదరికానికి కారణమైన దోపిడీ రాజకీయార్థిక వ్యవస్థ పరిధిలోనే పేదలకు కనీస ఆసరాగా అయినా సరే ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టాలి. వాటి అవసరాన్ని గుర్తించి పోరాడాల్సిందే.

పేదలను మనుషులుగానే పరిగణించని రాజకీయార్థిక విధానాలు అమలు చేస్తూ, ఇంకోపక్క సామాజిక అసమానతలు తగ్గించడానికి ఉద్దేశించిన రిజర్వేషన్లను పేదరిక నిర్మూలనా కార్యక్రమంగా మార్చివేయడంలోని కుట్రను అర్థం చేసుకోవాలి. ఈ 10 శాతం రిజర్వేషన్ల విధానాన్ని ఖండించడమంటే అగ్రకుల పేదల సమస్యలను విస్మరించడం కాదు. వారికే కాదు, మొత్తంగా సమాజంలో పేదలందరి కోసం ప్రభుత్వం చాలా చేయాలి. దోపిడీ మీద ఆధారపడిన ఈ పాలకవర్గం వల్ల పేదరికం పెరుగుతోందే కాని, తగ్గదనే మౌలిక అవగాహనపట్ల ఏ గందరగోళం లేకుండానే ప్రభుత్వం మీద ఈ విషయంలో ఒత్తిడి తేవాలి.

అగ్ర వర్ణ పేదల ఓటు బ్యాంకు కోసమే బిజెపి ఈ చట్టం తీసుకొస్తే, నిత్యం అనేక విషయాల్లో అవమానకర స్థాయిలో చట్ట సభల్లో, బైటా తగాదాపడే రాజకీయ పార్టీలన్నీ ఇది రిజర్వేషన్ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి, అంతిమంగా రాజ్యాంగానికీ వ్యతిరేకం అని చెప్పకుండా తమ ఐక్యతను గొప్పగా చాటుకున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తే అగ్రకులాల ఓట్లకు తాము ఎక్కడ దూరమవుతామో అనే భయంతో అందరూ చిన్న తేడాలతో మోదీ గొంతుతోనే ఈ బిల్లుకు స్వాగతం పలికారు. హడావిడిగా ప్రవేశపెట్టారని, తగిన కసరత్తు చేయలేదని, ఆచరణలో ఇబ్బందులుల తలెత్తి అమలు కావడం కష్టమనీ పార్లమెంట్ లోపల, బైటా విమర్శ వినిపిస్తోంది. ఏ మినహాయింపులు లేకుండా, అమలుకు సంబంధించిన సాదకబాదకాలతో నిమిత్తం లేకుండా తిరస్కరించవలసిన విధానం ఇది. 'పేదరికం' చాటుకోవడం ఈ దేశంలో నిమిషాల పని. అవసరమైతే అంబానీలు, ఆదానీలు కూడా తాము నిరుపేదలమని కాయితాలు తీసుకొని వస్తారు. ఆర్థిక వెనుకబాటుతనం అనే పేరుతో అగ్రకులాల్లోని పలుకుబడి, పెత్తనం ఉన్న వాళ్ల బొక్కసాలకే ఈ రిజర్వేషన్ ఫలాలు చేరుకుంటాయి. దశాబ్దాల తరబడి మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్‌లో అతీగతీ లేదు కాని, నరేంద్రమోదీ తన ఎన్నికల వ్యూహానికి మూడు రోజుల్లో ఆమోదం పొందగలిగాడు. దీన్ని అంగీకరించడం ద్వారా తమ ప్రయోజనాలను తామూ తీర్చుకోగలిగామని అన్ని రాజకీయ పార్టీలు సంతోషిస్తున్నాయి.

మన తెలంగాణ
5
హైదరాబాద్
శనివారం
19 జనవరి, 2019
www.manatelangana.news

సకుటుంబం



మధుబని మెరుపులు

బిహార్ సంప్రదాయ మధుబని చిత్రకళ ప్రతిబింబించే ఈ చీరలు మగువల మనసు దోచుకుంటున్నాయి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలంటే ఇలాంటివి వార్డురోబ్‌ల్లో ఉండాల్సిందే!

వేధింపులను రికార్డ్ చెయ్యండి..

మేడమ్ నా పేరు మోనిక. నేను m.com చదివాను. మా నాన్న గారిది చిన్న బట్టల షాపు. నన్నూ , చెల్లి హారికను బాగా చదివించాలని ఆయన కోరిక . ప్రస్తుతం చెల్లి b.tech రెండవ సంవత్సరం చదువుతుంది. నాది పీ.జీ అయిపోయింది కనుక నాన్న కష్టంలో పాలుపంచుకోవాలని ఆయనకు నా వంతు సహాయం చేయాలని ఒక చార్టెడ్ అకౌంటెంట్ వద్ద ఉద్యోగంలో చేరాను. ఆయన చాలా మంచి వ్యక్తి, ఆఫీసు పనులన్నీ ఎలా చెయ్యాలో నేర్పిస్తున్నారు. నేను కూడా చాలా సీరియస్‌గా నేర్చుకొని నా ఉద్యోగాన్ని సక్రమంగా చేస్తున్నాను. అమ్మ, నాన్న, చెల్లి అందరూ నేను జాబ్ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నారు. అయితే నాకు ఈ మధ్య ఒక సమస్య ఎదురైంది. అది మా సార్ తమ్ముడి రూపంలో.. అతను ఈ మధ్య మా ఆఫీసుకి వచ్చి, తనకు సంబంధం లేని విషయాలను నన్ను పదే పదే అడిగి, సాయంత్రం వరకూ నా వద్దే వుండి నాకు ఇబ్బంది కలిగిస్తున్నాడు. తనతో సినిమాలకు, షికార్లకు రమ్మని నన్ను ఒంటరిగా ఉన్న సమయంలో వచ్చి వేధిస్తున్నాడు. నేను ఈ బాధను ఎవరితోనూ చెప్పకోలేక , భరించలేక పోతున్నాను. అమ్మా, నాన్నలతో చెబితే జాబ్ మానేయ మంటారు. మా బాస్‌కి చెబితే వాళ్ళ తమ్ముడి మీద నమ్మకంతో నా మాట నమ్ముతాడో లేదో అని అనుమానంగా వుంది. నేను ఏం చేయాలో దయచేసి సలహా ఇవ్వండి. ఆడవాళ్ళకు ఈ లైంగిక వేధింపులు తప్పవా?వీటికి చట్టపరమైన శిక్షలు ఏమున్నాయి? తెలియజేయండి.

చూడు మోనికా ! నీవు రాసిన ఈ సమస్య వాస్తవానికి నీ ఒక్కదానిదే కాదు. నూటికి 90 శాతం మంది మహిళలు అంటే వేరు, వేరు రంగాల్లో ఉద్యోగం చేసేవారు, విద్యార్థినులు,గృహిణిలు అందరూ వీటిని ఎదుర్కొంటున్నారు. ఈ వేధింపులకు వయస్సుతో సంబంధం లేదు. ఇక నీలాంటి పెళ్ళి కాని పిల్లలు ఉద్యోగానికెళితే చెప్పనక్కర్లేదు. కొందరు వీటిని ఎవరికి చెప్పుకోలేక నరకయాతన పడుతున్న తీరు వర్ణనాతీతం.అందుకే వీటిని అరికట్టడానికి 1964 లోనే లైంగిక వేధింపులు చట్టం తెచ్చారు. దీన్ని 1998లో మరలా ఎమెండ్ చేశారు. రూల్ నెం.3 ప్రకారం లైంగిక వేధింపులను నిషేధించారు. అయితే ఐపీసీ సెక్షన్ 34 కింద ఈ వేధింపుల దురుద్దేశాన్ని రుజువు చేయాల్సివుంటుంది.

స్త్రీలపై లైంగిక వేధింపులకు ఎవ్వరు పాల్పడినా (యజమాని లేదా సహ ఉద్యోగులు) సెక్షన్.6 ప్రకారం 5 సంవత్సరాల జైలు శిక్ష , 25 వేలు జరిమాన ఉంటుంది. నీవు నీ సార్‌కి చెప్తే ఏమంటారో అన్న అనుమానం వదిలిపెట్టు . నీవు సెల్‌ఫోన్ ద్వారా అతను నిన్ను వేధిస్తున్న తీరుని రికార్డు చేసి చూపించు. అలాగే సెక్షన్ 14 ప్రకారం యజమాని ద్వారా కాకుండా మూడో వ్యక్తి ద్వారా వేధింపులకు గురైతే యజమాని ఆ స్త్రీకి సహకరించి అరికట్టాలి. అలాగే ప్రభుత్వ సంస్థల్లో సెక్షన్ 15 ప్రకారం లైంగిక వేధింపులు దర్యాప్తుకై ప్రత్యేక ఆఫీసర్ల నియామకం వుంది. కనుక ఎవ్వరూ ఈ విషయంలో భయపడకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే నిందితులు చట్టరీత్యా శిక్షింపబడతారు. బయట ప్రపంచంలో ఇలాంటివి జరగక్కుండా షీ టీమ్స్ పనిచేస్తున్నాయి. చదువు, టాలెంట్ వున్న నీకు ఈ జాబ్ పోయినా, మరొకటి దొరుకుతుంది. ధైర్యంగా వుండు చట్టం నీకు అండగా వుంటుంది.



ఎస్.బిటి సుందరి
హైకోర్టు న్యాయవాది, ఫ్యామిలీకౌన్సిలర్

మీ సమస్యలను features@manatelangana.orgకి పంపగలరు.



నిమ్మలో పోషకాలు నిండుగా..

నిమ్మకాయ ఆరోగ్యానికి మంచిదన్నది తెలిసిందే. అయితే ఆ నిమ్మను మంచినీళ్లతో కలిపి తీసుకుంటే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ముఖ్యంగా తగినన్ని మంచినీళ్లను తాగడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి అంటున్నారు.



* పంచదార లేకుండా గోరువెచ్చని నీళ్లలో నిమ్మకాయ పిండుకుని తాగడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. నిమ్మలోని పోషకాలు పొట్టలోని జీర్ణ రసాలను ప్రేరేపించి, ఆహారం జీర్ణం కావడానికి తోడ్పడుతుంది.
* ఈ నీళ్లలోని సి– విటమిన్ కొన్ని రకాల వ్యాధులను– ముఖ్యంగా ఈసోఫే గల్ క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. జీవక్రియని పెంచి బరువును తగ్గించడానికీ తోడ్పడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచి జలుబూ జ్వరాలూ వంటివి రాకుండా రక్షిస్తుంది.
* నిమ్మలోని మెగ్నీషియం, పొటాషియంలు బీపీని అదుపులో ఉంచడం ద్వారా హృద్రోగాలనీ నివారిస్తాయి. రక్తంలో చక్కెర శాతం పెరగకుండా చేస్తాయి. అంతేకాదు, పొట్టలో హానికర బ్యాక్టీరియా పేరుకోకుండా కాపాడతాయి. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా చేసే గుణాలూ నిమ్మకాయకి ఉన్నాయి అంటున్నారు

పిల్లలకు నిద్ర సమస్య రానివ్వకండి...!

పిల్లలు నిద్రపోవాలంటే ముఖ్యంగా చిన్న పిల్లలతో బాటు టీనేజీ వయసు పిల్లల గదుల్లో స్మార్టుఫోన్లూ కంప్యూటర్లూ వీడియో గేమ్‌లూ టీవీలూ లేకుండా చూడమని చెబుతున్నారు నిపుణులు. ఎందుకంటే వీటివల్ల నిద్రపోయే సమయం బాగా తగ్గిపోవడంతో బాటు తరచూ నిద్రాభంగానికి గురవుతున్నారు. ఫలితంగా వాళ్లలో అసహనం బాగా పెరిగిపోయి, అది మానసిక వ్యాధులకు దారితీస్తుందని గుర్తించారు. కాబట్టి పిల్లలు పడుకునే గదుల్లో అవేవీ లేకుండా చేయడమే మంచిదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వాటి నుంచి వెలువడే ప్రకాశవంతమైన కాంతి జీవ గడియారాన్ని ప్రభావితం చేయడంతో నిద్రా సమస్యలకు కారణమవుతుందని వివరిస్తున్నారు.

మెరుపు చూడతరమా..!

ఖర్చుతో కూడిన ఫేస్ క్రీమ్స్ కంటే.. ఖర్చులేని సహజసిద్ధమైన చిట్కాలే ముఖానికి అన్ని విధాలా మంచిదంటున్నారు నిపుణులు. అందుకే మరి మీ ముఖ సౌందర్యానికి కాసింత సమయాన్ని వెచ్చించండి. ముందుగా క్లీనప్, స్క్రబ్ వంటివి చేసుకుని ఆవిరి పట్టించుకుని ఫేస్‌ప్యాక్ వేసుకుంటే ముఖం మరింత కాంతివంతం అవుతుంది. మచ్చలు, మొటిమలు లేని మృదువైన అందం మీ సొంతమవుతుంది. ఇంకెందుకు ఆలస్యం? ఇలా ప్రయత్నించండి.



కావల్సినవి : క్లీనప్ : రోజ్‌వాటర్ – టీ స్పూన్, గ్లిజరిన్ –3 లేదా 4 చుక్కలు, స్క్రబ్ : కొబ్బరిపాలు – ఒకటిన్నర టీస్పూన్లు, బియ్యంపిండి– అర టీస్పూన్, పెసరపిండి – అర టీస్పూన్ **మాస్క్ :** చిక్కటి పాలు – 2 టీస్పూన్లు, కీరదోస గుజ్జు – 2 టీస్పూన్లు, శనగపిండి – అర టీస్పూన్

తయారీ : ముందుగా రోజ్‌వాటర్, గ్లిజరిన్ చిన్న బౌల్‌లో పోసుకుని బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు నిమిషాల తర్వాత మెత్తని క్లాత్‌తో క్లీన్ చేసుకోవాలి. ఇప్పుడు కొబ్బరిపాలు, బియ్యంపిండి, పెసరపిండి ఒక బౌల్ లోకి తీసుకుని బాగా కలుపుకుని ఇంచుమించు ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసుకోవాలి. తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని ఆవిరి పట్టించుకోవాలి. ఇప్పుడు చిక్కటిపాలు, కీరదోస గుజ్జు, శనగపిండి ఒక బౌల్‌లోకి తీసుకుని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని, ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీళ్ళతో ముఖం కడగాలి. ఇలా వారానికి రెండు లేదా మూడుసార్లు చెయ్యడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఐవిఎఫ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మిల్లర సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్

ఇద్దరి ప్రాణాలు తీసిన పేలుడు

(మూడవ పేజీ తరువాయి)

చెందిన సంఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాప్రాలో చోటు చేసుకుంది. పేలుడు ధాటికి ఇంటి మొదటి అంతస్తు పూర్తిగా ధ్వంసం కాగా చుట్టు పక్కల దాదాపు కిలో మీటర్ వరకు పలు ఇళ్ళ అద్దాలు పగిలి పోయాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుసాల్ పురా గ్రామం, పాలె జిల్లా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మోహన్‌లాల్ చౌదరి(45) తన భార్య లీలా వతి(38) కూతురు నిఖితా (11), కుమారుడు గోవింద్ (14) కుటుంబం పది సంవత్సరాల క్రితం కాప్రాకు వచ్చి స్థిర పడ్డారు. బంగారం షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం ఉదయం మోహన్ లాల్ ఇంట్లోని పై అంతస్తులో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఇంటి యజమాని మోహన్‌లాల్ అక్కడిక్కడే మృతి చెందగా, ఆ మార్గం గుండా వెళ్తున్న ఎలగందుల రవి(33) అనే వ్యక్తి తలకు ఇటుక రాయి అతని తలకు తగలడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మోహన్ లాల్ భార్య లీలా వతి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుదోంది. వారి పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డావారు.చుట్టు పక్కల వారు పలువురు స్వల్ప గాయాలకు గురైనట్లు పలువురు పేర్కొన్నారు. పేలుడు ధాటికి ఇంటి గోడలు, ఇంట్లోని సామాగ్రి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంట్లోని సామాను ఎగిరి చుట్టు పక్కల వారి ఇండ్లలో పడి వారి ఇళ్ళ అద్దాలు పగిలిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. రాచ కొండ కమీషనర్ మహేష్ భగవత్, అడిషనల్ సిపి సుధీర్ బాబు, మల్కాజిగిరి జోన్ డిసిపి ఉమా మహేశ్వర శర్మ, కుషాయిగూడ ఎసిపి శివ కుమార్, సిఐ చంద్ర శేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పేలుడుకు గల కారణాలను పరిశీలించారు. కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్

పేలుడు సంఘటన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎం.వి రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియొద్దీన్, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, స్థానిక కార్పోరేటర్ స్వర్ణ రాజులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు సంఘటనా స్థలానికి వచ్చిబాధితులను పరామర్శించారు. దారి గుండా వెళ్తూ ఇటుక రాయి తగిలి చనిపోయిన రవి మృతి పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. రవి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రభుత్వం నుండి తగిన సహాయం అందేలా కృషి చేస్తామని కలెక్టర్ అతని కుటుంబ సభ్యులకు హామినిచ్చారు.

అంబేద్కర్ విదేశీ విద్యానిధికి 42 మంది ఎంపిక



మనతెలంగాణ/హైదరాబాద్ : విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు అంబేద్కర్ విదేశీ విద్యానిధి కింద 42 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎస్‌సి సంక్షేమ శాఖ సంచాలకులు పి.కరుణాకర్ తెలిపారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో వీరికి సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఈ పథకానికి 48 మంది దరఖాస్తు చేసుకోగా, 45 మంది హాజరయ్యారని అన్నారు. వీరిలో 42 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన 42 మంది విద్యార్థులను అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాలలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ సైన్సెస్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్‌లలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఆ పై కోర్సులు చదవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనుందని తెలిపారు. విమాన ప్రయాణానికి, వీసా ఖర్చులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, ఎస్‌సి సంక్షేమ శాఖ ఉప సంచాకులు బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు సిపిఐ మద్దతు : సురవరం



మనతెలంగాణ/హైదరాబాద్ : కార్మికుల సమ్మెకు సిపిఐ పార్టీ మద్దతు ఇస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నాలుగు సంఘాలకు చెందిన కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారని, ఆ సంఘాలు చేసే సమ్మెకు తాము మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని ఆయన పేర్కొన్నారు. రక్షణ రంగ పరిశ్రమలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు సమ్మెను నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో రక్షణ విభాగం చాలా పెద్ద పరిశ్రమ అని ఆయన తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం దేశ రక్షణకు ముప్పుగా మారనుందన్నారు. సిబిఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను తొలగించడం చాలా దారుణమన్నారు. ఇది తొందరపాటు చర్యగా ఆయన అభివర్ణించారు. ఇది ప్రధాని మోడీ కక్షపూరితంగా చేశారని ఆయన ఆరోపించారు. అలోక్‌వర్మ విషయంలో పారదర్శకంగా విచారణ జరగాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రధాని మోడీ కేరళలో కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలను సురవరం ఈ సందర్భంగా ఖండించారు. మోడీ పూర్తిగా బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేశారని ఇది చాలా దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మోడీ కేరళలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జేఎన్‌యూ విద్యార్థులపై అక్రమంగా నమోదు చేసిన చార్జిషీట్‌ను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాశ్మీర్ విషయంలో కాదు, మనువాదం నుంచి, బ్రాహ్మణవాదం నుంచి అజాదీ కావాలన్నారు. విద్యార్థులపై చేసే ఆరోపణలన్నీ నిరాధారణమైనవని సురవరం పేర్కొన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం కూటములు కడితే తప్పేముందన్నారు. ఫెడరల్ ఫ్రంట్ పేరుతో బిజెపి వ్యతిరేక ఓట్లను చీల్చే ప్రయత్నం కెసిఆర్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్పీకర్‌గా కొత్తగా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభను ఔన్నత్యంగా నడపాలని స్పీకర్ పోచారంకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓటరు నమోదుకు గడువు పెంపు?

- సిఇఒ విజ్ఞప్తికి ఇసి ఓకే !
- ఇప్పటి వరకు 13.10 లక్షల దరఖాస్తులు
- 1950 టోల్ ఫ్రీ నెంబర్ సేవల విస్తరణ





మన తెలంగాణ/హైదరాబాద్: ఓటర్ల నమోదు గడువు పెంపునకు కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు రావడంతో ఓటరు నమోదుకు కొంచెం ఇబ్బంది ఏర్పడిందని, గడువు పెంచాలని సిఇఒ రజత్ కుమార్ ఇసిని కోరారు. ఐదు లేదా వారం రోజుల పాటు పొడిగించేందుకు మౌఖికంగా అంగీకరించినట్లు తెలిసింది. దీనిపై రెండు, మూడు రోజుల్లో లిఖితపూర్వక సమాధానం రానుంది. వాస్తవానికి గత నెల 26వ తేదీన ప్రత్యేక ఓటరు నమోదు సవరణ కార్యక్రమం మొదలైంది. అయితే సంక్రాంతి పండుగ రావడం, వరుస సెలవులు, పంచాయతీ ఎన్నికలతో ఓటరు నమోదు కార్యక్రమం జనాల్లోకి వెళ్లడం లేదని పొడగింపు ఇవ్వాలని ఇటీవల అఖిలపక్ష రాజకీయ భేటీలో పలు పార్టీలు సిఇఒకు విజ్ఞప్తి చేశాయి. ఆయన వారి ప్రతిపాదనను ఇసి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ గడువు కేవలం దరఖాస్తులను తీసుకోవడం వరకే ఉంటుందని, మిగతా ప్రక్రియ అంతా షెడ్యూల్ ప్రకారంగానే సాగుతుందన్నారు.

అర్బన్ నుంచే ఎక్కువ దరఖాస్తులు

ఓటరు నమోదు కార్యక్రమానికి భారీగా స్పందన వస్తుందని, ఇప్పటి వరకు 13.10 లక్షల దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర ఎన్నికల సంయుక్త అధికారి ఆమ్రపాలి తెలిపారు. ప్రధానంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతీ వ్యక్తి ఓటరుగా నమోదు చేసుకోవడం కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఎపిక్‌కార్డు చేతిలో ఉంటే ఓటు ఉన్నట్లుగా కాదని, ఓటరు జాబితాలో పేరుంటేనే ఓటు ఉన్నట్లుగా భావించాలని అన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలన్నారు. ఓటర్ల నమోదులో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ జిల్లాలు టాప్‌లో ఉన్నాయని ఆమె వివరించారు. అర్బన్ ప్రాంతాలలో ఎక్కువగా ఓటు నమోదు జరుగుతుందన్నారు. గతంలో జరిపిన ఓటరు నమోదు కార్యక్రమాల్లో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన ఇఆర్‌ఒ నెట్ సాంకేతిక సమస్యతో 1.16 లక్షల డబుల్ ఓటర్లు వచ్చారని, వారిని ఈ సవరణలో తొలగిస్తున్నట్లు చెప్పారు.

20న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్

ఈ నెల 20వ తేదీన ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్నట్లు ఆమ్రపాలి వివరించింది. పోలింగ్ బూత్‌ల వద్ద బిఎల్‌ఒలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఈ నెల 22, 23, 24 తేదీలలో జిహెచ్‌ఎంసి పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. దరఖాస్తులతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవచ్చని అన్నారు.

1950 సేవల విస్తరణ

1950 టోల్ ఫ్రీ నెంబర్‌తో ఇప్పటి వరకు ఫిర్యాదు మాత్రమే స్వీకరిస్తున్నామని, త్వరలో ఓటరు కార్డు ఉందో లేదో కూడా తెలుసుకునేలా ఈ సేవలను విస్తరిస్తమని ఆమ్రపాలి తెలిపారు. 1950 నెంబర్ ద్వారా ఓటర్లు ఎపిక్ కార్డు నెంబర్ చెప్పి ఓటరు జాబితాలో పేరుందా..? లేదా..? అనే విషయాలను కూడా కనుక్కోవడంతో పాటు అవసమైతే సంబంధిత సమాచారం ఇస్తే ఓటరు నమోదు కూడా చేసే వీలును పరిశీలిస్తున్నట్లు వివరించారు.

ఈ నెల 17 వరకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా

ఫారం 6	11.5 లక్షలు
ఫారం6ఎ	1,536
ఫారం7	29,500
ఫారం 8	82,900
ఫారం 8ఎ	46,690
మొత్తం	**13,10,626**

788 పంచాయతీలు ఏకగ్రీవం

- 10,317 వార్డులు
- మొదటి విడతతో కలిపితే 1557కు చేరిన ఏకగ్రీవ పంచాయతీల సంఖ్య



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీలకు ఏకగ్రీవాల హవా కొనసాగుతోంది. మొదటి విడతలో 769 పంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవమైతే, రెండో విడతలో 788 ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఇప్పటి వరకు మొత్తం 1557 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే రెండో విడతలో 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతతతో కలిపితే ఈ సంఖ్య 20,971కి చేరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జిల్లాల వారీగా దాఖలైన నామినేషన్లు, స్క్రూటిని, తిరస్కరణ, ఉపసంహరణ అనంతరం ఒకే పంచాయతీకి సర్పంచ్ పదవికి ఒకే నామినేషన్ వచ్చిన వాటిని ఏకగ్రీవంగా ప్రకటించారు. రెండో విడతలో 4135 పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో 5 పంచాయతీలకు నామినేషన్లు రాకపోవడం, వచ్చినవాటిలో తిరస్కరణకు గురికావడంతో వాటికి ఎన్నిక నిర్వహించడం లేదు. 788 ఏకగ్రీవం కావడంతో 3342 పంచాయతీలకు ఎన్నిక నిర్వహించనున్నారు. వీటికి 10,668 బరిలో ఉన్నారు. అలాగే 36,602 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా 94 వార్డులకు నామినేషన్లు రాలేదు. 10,317 ఏకగ్రీవం కావడంతో 26,191 వార్డులకు 63,480 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒకటి కంటే నామినేషన్లు ఎక్కువగా దాఖలైన రెండో విడత పంచాయతీల్లోని సర్పంచ్, వార్డు మెంబర్ పదవికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 25వ తేదీన ఎన్నిక నిర్వహించనుంది.

ఆదిలాబాద్‌లో అత్యధికం

రెండో విడతలో అత్యధికంగా 65 గ్రామ పంచాయతీలను ఏకగ్రీవమయ్యాయి. ఆ తరువాత స్థానంలో మహబూబ్‌నగర్ 58, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో 52 చొప్పున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అత్యల్పంగా వరంగల్ అర్బన్‌లో రెండు, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలో ఐదు, కరీంనగర్‌లో ఐదు, జయశంకర్ భూపాల జిల్లాలో ఏడు మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. పోటీ ఉన్న పంచాయతీలలో నామినేషన్లను ఉపసంహరణ చేయించేందుకు స్థానిక రాజకీయ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేసి కొన్నింటిని ఏకగ్రీవం చేయడంలో దాదాపుగా సఫలీకృతలయ్యారు. ఎక్కువ జిల్లాల్లో త్రిముఖ పోటీ రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతలో



జరిగే పంచాయతీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఎక్కువగా ఉంది. కొన్నిజిల్లాల్లో నలుగురు చొప్పున పోటీలో ఉన్నారు. అన్నీ జిల్లాల్లో పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవికి పోటాపోటి ఉంది. మొదటి విడతలో నల్లగొండలో 224 పంచాయతీ సర్పంచ్‌లకు 678, మహబూబ్‌నగర్‌లో 185 పంచాయతీలకు 594 మంది పోటీ పడుతున్నారు.


జిల్లాల వారీగా ఏకగ్రీవమైన పంచాయతీలు, వార్డుల సంఖ్య

జిల్లా పేరు	సర్పంచ్	వార్డులు
ఆదిలాబాద్	65	839
ఆసిఫాబాద్	19	311
మంచిర్యాల్	14	219
నిర్మల్	25	420
జగిత్యాల్	22	395
కరీంనగర్	05	167
పెద్దపల్లి	09	164
సిరిసిల్ల	16	236
కొత్తగూడెం	17	289
ఖమ్మం	35	469
గద్వాల	14	170
మహబూబ్‌నగర్	58	698
నాగర్‌కర్నూల్	21	260
వనపర్తి	20	253
మెదక్	40	427
సంగారెడ్డి	52	579
సిద్ధిపేట	19	238
నల్లగొండ	52	585
సూర్యాపేట	29	261
భువనగిరి	16	160
కామారెడ్డి	52	720
నిమామాబాద్	33	452
మేడ్చల్	05	50
రంగారెడ్డి	21	256
వికారాబాద్	18	308
జనగాం	27	317
భూపాలపల్లి	07	201
మహబూబాద్	42	438
వరంగల్ రూరల్	33	396
వరంగల్ అర్బన్	02	39
మొత్తం	**788**	**10,317**

ఓటాన్ అకౌంట్‌లో పాత స్కీమ్‌లకు కేటాయింపులు

- 'ఆసరా', తొలి విడత రైతుబంధుకు నిధులు ?
- మూడు నెలలా.. ఆరు నెలలా అనే- దానిపై ఆర్థికశాఖ కసరత్తు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ప్రవేశపెట్టాలనుకుంటున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పాత పథకాలకూ నిధులు కేటాయించనుంది. కేవలం ఉద్యోగుల జీతభత్యాలు మాత్రమే కాకుండా 'ఆసరా', 'రైతుబంధు' వంటి పథకాలకు నెలవారీగా ఖచ్చితంగా నిధులు అవసరమయ్యే పథకాలకు, ఇతర అవసరమైన వాటికి కేటాయింపులు చేయనున్నట్లు తెలిసింది. ఆర్థిక శాఖ అధికారులు కూడా సూచనప్రాయంగా ఈ అంశాన్ని ధృవీకరించారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ శాఖల నుంచీ బడ్జెట్ ప్రతిపాదనలను తీసుకుంటున్నామని, ఇందులో ప్రగతి పద్దు, నిర్వహణ పద్దు కింద ఆన్‌లైన్‌లో కొన్ని శాఖలు ఇప్పటికే ప్రతిపాదనలు పంపాయని వివరించారు. టిఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రకటించిన పథకాలకు ఒకవేళ మార్గదర్శకాలు రూపొందించినట్లయితే వాటికి ఎంత మొత్తంలో ఖర్చు అవుతుందో కూడా వివరాలు పంపాల్సిందిగా ఆయా శాఖలను ఆదేశించామని, అందులో కొన్ని శాఖల నుంచి ఇప్పటికే ప్రతిపాదనలు అందాయన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న దానిపై అధ్యయనం చేయాల్సిందిగా ఇటీవల సిఎం కెసిఆర్ ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో అన్ని శాఖల తరపున ఆర్థిక అధికారులు ఈ కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడితేనే మంచిందని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సిఎం కెసిఆర్‌కు నివేదించారు. దీంతో ఆయా శాఖలు పంపిన బడ్జెట్ ప్రతిపాదనలకు అనుగుణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో మూడు లేదా ఆరు నెలల కాలానికి అసెంబ్లీలో బడ్జెట్ ఆమోదం తెలుపనున్నట్లు తెలిసింది. రెండు విధాలుగా





ఎంత మొత్తం నిధులు అవసరమౌతాయో సిఎంకు నివేదించాక, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా బడ్జెట్ ఉంటుందని మరో అధికారి వ్యాఖ్యానించారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లుగా ఉండగా, ఇందులో ప్రగతి పద్దు కింద రూ.1.04 లక్షల కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.69 వేల కోట్లు కేటాయింపులు జరిగాయి. ఇందులో 'ఆసరా' పథకానికి రూ. 5,388 కోట్లు కేటాయించింది ప్రభుత్వం. అయితే ఇటీవల ఎన్నికల హామీలో భాగంగా ఫించన్‌లన్నింటినీ రెట్టింపు చేస్తామని సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారు. వాటిని ఈ బడ్జెట్‌లోనే పొందుపర్చి, ఏప్రిల్ నెల నుంచే ఇవ్వనున్నారు. దాదాపు రూ.10 వేల కోట్లు పింఛన్‌లకే అవసరమవుతున్నట్లు ప్రాథమిక ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసింది. రైతులకు మొదటి విడత రైతుబంధు పెట్టుబడిని మే నెల ఖారులోగా ఇవ్వాల్సి ఉంటుంది.

దీంతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనే రూ. 6 వేల కోట్లు కేటాయింపులు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ నిధులకు సంబంధించి ఇబ్బంది ఉంటే పూర్తి స్థాయి బడ్జెట్‌లోనే పెట్టనున్నారు. సాగునీటి రంగానికి, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్య శాఖ ప్రాధాన్యతగా ఉన్నట్లు తెలిసింది.

మరింత మాగాణి



(మూడవ పేజీ తరువాయి)

రూపొందించుకొని నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై సిఎం కెసిఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో సమీక్షించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, నీటిపారుదల శాఖ ఇఎన్‌సి మురలీధర్, సిఇలు హరిరాం, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఇలు విష్ణుప్రసాద్,వేణు, ఇఇ రామకృష్ణ, ఎంఎల్‌సి ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రాజెక్టుల కోసం ఇప్పటి వరకు రూ.77,777 కోట్లు ఖర్చు చేశామని, భూసేకరణ, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం, సహాయ, పునరావాస పనుల కోసం మరో రూ.22 వేల కోట్లు వెచ్చించామని స్పష్టంచేశారు. ఈ ఏడాది మార్చి నాటికి మరో రూ. 7 వేల కోట్లు ఖర్చు చేస్తామని, దీంతో మొత్తం ఖర్చు రూ. 1.07 లక్షల కోట్లు అవుతుందన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టులతో పాటు మిషన్ కాకతీయ పనుల కోసం మరో రూ.1.17 లక్షల కోట్లు కావాలని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఈ నిధులను ఖర్చు చేసి, ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి, రాష్ట్రంలోని మొత్తం 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్య సాధన కోసం ప్రభుత్వం ప్రాధాన్యతను గుర్తించి, వెంటవెంటనే నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కెసిఆర్ స్పష్టంచేశారు.

ఆదిలాబాద్ జిల్లా స్వరూపం మారాలి

సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు ఓ జోక్‌గా మారాయని, ఎన్నికలప్పుడే ప్రాజెక్టుల పేరు చెప్పి పార్టీలు ఓట్లు అడిగేవని, ప్రాజెక్టులు మాత్రం కట్టలేదని కెసిఆర్ వ్యాఖ్యానించారు. అత్యధిక వర్షపాతం, పుష్కలమైన నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లా తలరాత మారలేదని, ఇకపైన జిల్లా చరిత్రను మార్చాలని అన్నారు. తమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి, రెండు లక్షల ఎకరాలకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 56,900 ఎకరాలు, ఆసిఫాబాద్‌లో 38,900 ఎకరాలకు, చెన్నూరులో 31,500 ఎకరాలకు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 72,770 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. తమ్మిడిహట్టి బ్యారేజికి, 20 టిఎంసిల నీటి వినియోగానికి కేంద్ర జల సంఘం అంగీకారం తెలిపిందన్నారు. ఈ నీటిని సద్వినియోగం చేసుకొని, ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు ఇచ్చేలా సమగ్ర వ్యూహాన్ని రూపొందించాలన్నారు. జిల్లాలో పారుతున్న పెద్దవాగుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని, ఇది చాలా నియోజకవర్గాల మీదుగా వెళుతుండడంతో, ఈ నీటిని సద్వినియోగం చేసుకునేలా అవసరమైన నిర్మాణాలను చేపట్టాలని అధికారులకు సూచించారు. పెన్‌గంగ ప్రాజెక్టుపై నిర్మిస్తున్న చనాఖ కొరాట ప్రాజెక్టు పనుల్లో వేగాన్ని పెంచాలని, కుప్తి రిజర్వాయర్ నిర్మాణానికి వెంటనే టెండర్లను పిలిచి, పనులు ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. తమ్మిడిహట్టి దగ్గర నిర్మాణం, చనాఖ కొరాట ప్రాజెక్టు, పెద్దవాగు సద్వినియోగంతో ఆదిలాబాద్ జిల్లాలో చాలా వరకు సాగునీరు అందుతుందని, మిగిలిన భాగానికి కాళేశ్వరం ప్రాజెక్టుతో నీరు పారుతుందన్న విశ్వాసాన్ని సిఎం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గోదావరి బేసిన్‌లో తెలంగాణ వాటాను సంపూర్ణంగా వినియోగించుకోవాల్సి ఉందన్నారు. గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై నెలాఖరులో యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు.

ఈ నెలాఖరుకు పాలమూరు, డిండికి సిఎం కెసిఆర్

ఫిబ్రవరి మాసంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి ఎత్తిపోతల పనులను స్వయంగా పరిశీలిస్తానని సిఎం తెలిపారు. ఫిబ్రవరిలో కృష్ణా బేసిన్ ప్రాజెక్టులపై యాక్షన్ ప్లాన్ తయారుచేస్తామని, వచ్చే వర్షాకాలం వరకు వేగంగా పనులు చేసుకునే వెసులుబాటు ఉందని, కాబట్టి వెంటనే కార్యరంగంలోకి దిగాలని అధికారులకు కెసిఆర్ సూచించారు. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని మొదట చెరువులకు మళ్లించాలని ఆదేశించారు. ఈ ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు నుంచి ఎస్‌ఆర్‌ఎస్‌పి వరకు, మల్లన్నసాగర్ వరకు నీరు అందుతుందని, అలా వచ్చిన నీటిని మొదట చెరువులకు మళ్లించడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏదైనా చెరువుకు ఫీడర్ చానల్ లేకుంటే, కొత్తగా కాల్వ తవ్వాలని ఆదేశించారు. ఎస్‌ఆర్‌ఎస్‌పి రెండో దశ వరకు చెరువులు నింపాలని చెప్పారు.





ఆదర్శ సభగా తీర్చిదిద్దుకుందాం : పోచారం

స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన పోచారం శ్రీనివాసరెడ్డి ఈ పదవి అత్యంత కీలకం మాత్రమే కాక సంక్లిష్టమైనదని, సభా నిర్వహణలో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, విధుల నిర్వహణలో సభాపతిగా న్యాయబద్ధంగా వ్యవహరిస్తానని, సభ్యులందరి సహకారం అవసరమని విజ్ఞప్తి చేశారు. సభా కార్యక్రమాలను ఆదర్శవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని, అసెంబ్లీని ప్రజాసమస్యలు చర్చించే వేదికగా నడుపుకోవడం సభ్యులందరి సమిష్టి బాధ్యత అని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్ర రైతాంగానికి సేవ చేసే అవకాశం కల్పించడమే కాకుండా 'లక్ష్మీపుత్రుడి'గా బిరుదు ఇచ్చిన సిఎం కెసిఆర్‌కు పోచారం శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు దోహదపడిన అన్ని రాజకీయ పార్టీల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. సభా సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాసనాలు చేసే ఈ శాసనసభలో ప్రజాహితమే ధ్యేయంగా వ్యవహరిద్దామని సూచించారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న పోచారం ఇప్పుడు శాసనసభకు స్పీకర్‌గా ఎన్నిక కావడం ఉద్యమకారులకు దక్కిన గౌరవమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.తాను ఆర్థిక మంత్రిగా, పోచారం వ్యవసాయ మంత్రిగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలుసుకునేవారమని, వ్యవసాయ రంగానికి అవసరమైన నిధుల గురించి తనతోటి, రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లతో ముక్కుసూటిగా మాట్లాడేవారని ఈటల వ్యాఖ్యానించారు. హోం మంత్రి మహమూద్ ఆలీ మాట్లాడుతూ, వ్యవసాయ మంత్రిగా పోచారం హయాంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.ఎదిగినకొద్దీ ఒదిగి ఉండే మనస్తత్వం పోచారం ప్రత్యేకత అని, ఒకసారి ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన నిరాడంబర జీవన శైలిని ప్రత్యక్షంగా చూశానని కాంగ్రెస్ శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పద్మా దేవేందర్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్త, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్, గంగుల కమలాకర్, తలసాని, కొప్పుల ఈశ్వర్, గ్యాదరి కిశోర్, పువ్వాడ అజయ్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, నోములనర్సింహయ్య పోచారంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



అధ్యక్షా...

స్పీకర్‌గా పోచారం ఏకగ్రీవం

- వివిధ పార్టీల నేతల అభినందనలు
- ఏకగ్రీవం చేసినందుకు సిఎం కృతజ్ఞతలు
- పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ సేవలను కొనియాడిన సభ్యులు
- సహాయ సహకారాలు అందిస్తామని హామీ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర రెండవ శాసన సభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పదవికి కేవలం పోచారం మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం శాసనసభ సమావేశం ప్రారంభం కాగానే ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ఆయనకు ముఖ్యమంత్రి కెసిఆర్ సహా వివిధ పార్టీల నేతలు అభినందనలు తెలిపారు. స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునే సంప్రదాయాన్ని కొనసాగించినందుకు, సహకారం అందించినందుకు విపక్ష పార్టీల నేతలకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిఎం కెసిఆర్, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంఐఎం నేత అహ్మద్ బలాలా, శాసనసభ్యులు ఈటల రాజేందర్‌లు కలిసి పోచారం శ్రీనివాసరెడ్డిని తోడ్కొని వెళ్ళి స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టారు. శాసనసభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి స్పీకర్ ఎన్నిక ప్రక్రియను పూర్తిచేసిన ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్‌ను ముఖ్యమంత్రి సహా పలువురు నేతలు అభినందించారు. సుమారు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం కలిగిన పోచారం శ్రీనివాసరెడ్డి రెండో శాసనసభకు స్పీకర్‌గా ఎన్నిక కావడంపై వివిధ పార్టీల నేతలు ప్రశంసలు కురిపించారు. సుమారు పాతిక మందికిపైగా సభ్యులు పోచారం రాజకీయ సేవలను కొనియాడారు. సహాయ సహకారాలను అందిస్తామని స్పష్టం చేశారు.

వ్యవసాయ మంత్రి బాధ్యతలు విలువైనవి

తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎన్నిక కావడం ఆనందదాయకమని పేర్కొన్న ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ ఎన్నికను ఏకగ్రీవం చేసిన కాంగ్రెస్, బిజెపి, ఎంఐఎం పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. సభాపతి ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు సహకరించాలని తాను అన్ని పార్టీలకు చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా స్పందించడం హర్షణీయమన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తన రాజకీయ జీవితంలో అనేక మెట్లు అధిగమిస్తూ ఆరుసార్లు (ఉప ఎన్నికతో కలిపి) శాసనసభకు ఎన్నికయ్యారని, వ్యవసాయ మంత్రిగా ఆయన హయాంలో తెలంగాణలో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, ఆయన ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పోచారం చేసిన కాలాన్ని తాను మరిచిపోలేనని, ఆయన హయాంలో అనేక మంచి పనులు జరిగాయని, రైతు బంధు పథకాన్ని ఐక్యరాజ్యసమితి కూడా ప్రశంసించిందని గుర్తుచేశారు. పోచారం కాలుమోపిన వేళా విశేషం బాగుంది కాబట్టే వ్యవసాయంలో అద్భుత ఫలితాలు వచ్చాయని అన్నారు. రైతు బంధు లాంటి పథకాన్ని చాలా రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయని, వ్యవసాయ రంగంలో రాష్ట్రం ఇంత అభివృద్ధి సాధించిందంటే ఆ ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విప్లవాత్మక పథకాలకు మంచి ఫలితాలు వచ్చినందునే తాను ఆయన్ను 'లక్ష్మీపుత్రడు'గా పిలుస్తున్నానని కెసిఆర్ గుర్తుచేశారు. వ్యవసాయంలో యాంత్రికీకరణ, అధునాతన వ్యవసాయ పద్ధతులు ఆయన కృషిలో భాగమన్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్వయంగా తనతో రైతు బంధు పథకాన్ని కాలియా అనే పేరుతో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారని, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ కార్యక్రమాన్నిచేపట్టారని కెసిఆర్ గుర్తుచేశారు. చాలా రాష్ట్రాలు ఈ పథకాన్ని పరిశీలిస్తున్నాయని తెలిపారు. స్వగ్రామం పేరునే ఇంటిపేరుగా చేసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి రాజకీయ జీవితంలో ఇటీవలి వరకు వ్యవసాయ మంత్రిగా చేసిన కృషి ఒక కలికితురాయి అని, ఉజ్జ్వల అంకం అని కెసిఆర్ కొనియాడారు.



రెండో హరిత విప్లవానికి బీజం పడింది

రాష్ట్రంలో రెండో హరిత విప్లవానికి పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే బీజం పడిందని, ఆయన హయాంలోనే రూ.17 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు, 58 లక్షల మంది రైతులకు రైతుబంధు సాయం అందడం, 38 లక్షల మంది రైతులకు రైతుబీమా ద్వారా సౌకర్యం చేరువ కావడం సాధ్యమైందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి రైతుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపారని, 4,200 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించారని, వ్యవసాయంలో పరిశోధనలకు ఊతమిచ్చే విధంగా ఈ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారని, ఇవన్నీ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. వ్యవసాయం కుటుంబం నుంచి వచ్చిన కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం, పోచారం శ్రీనివాసరెడ్డి స్పీకర్ కావడం రాష్ట్రాభివృద్ధికి శుభ పరిణామం అని అన్నారు. వయసును సైతం లెక్క చేయకుండా ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ సజీవ సంబంధాలు పెట్టుకున్న పోచారం నుంచి చాలా నేర్చుకున్నానని అన్నారు.

సిఎల్పీ నేతగా భట్టి విక్రమార్క

ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభ పక్ష నాయకుడిగా మల్లు భట్టి విక్రమార్క పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి అధికారికంగా ప్రకటన చేసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్‌సి కుంటియా, ప్రత్యేక పరిశీలకుడు కెకె వేణుగోపాల్ తదితరులు రాష్ట్రానికి వచ్చి కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ శాసనసభ్యులతో విడివిడిగా మాట్లాడి అభిప్రాయాలను తీసుకోవడంతో పాటు కోర్ కమిటీ సమావేశంలోనే చర్చించారు. అనంతరం ఈ అభిప్రాయాలను ఉటంకిస్తూ నివేదికను పంపి నిర్ణయం తీసుకోవాల్సిందిగా అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ నివేదికను పంపగా శుక్రవారం సాయంత్రానికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లాట్ అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించిన మల్లు భట్టి విక్రమార్క ప్రస్తుతం మధిర నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. సిఎల్‌పి పదవి కోసం భట్టితో పాటు పిసిసి అధ్యక్షుడు ఉత్తంకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, నల్గొండ జిల్లాకు చెందిన శాససనసభ్యుడు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. కానీ పార్టీ హైకమాండ్ భట్టివైపే మొగ్గుచూపింది. దీంతో సిఎల్‌పి నేతపై రెండు రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. గతంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క తెలంగాణ ఉద్యమం సమయంలో కేంద్రం నుంచి వచ్చిన బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి చర్చకు శ్రీకారం చుట్టి ప్రత్యేక గుర్తింపు పొందారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాదెండ్ల మనోహర్ శాసనసభ స్పీకర్‌గా ఉండడంతో తెలంగాణ బిల్లును సభలో ప్రవేశపెట్టడానికి ఇబ్బందులు నెలకొన్న సమయంలో భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్‌గా చైర్‌లో ఉన్నప్పుడు బిల్లుపై చర్చను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో తెలంగాణ ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగింది. రానున్న ఐదేళ్ళ పాటు సిఎల్‌పి నేతగా వ్యవహరించనున్నారు.

నేడు ఉభయ సభల్లో గవర్నర్ ప్రసంగం



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర శాసనసభ కొత్తగా కొలువుదీరడంతో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ శనివారం ప్రసంగించనున్నారు. రాష్ట్ర రెండవ శాసనసభ ఏర్పడిన తర్వాత గవర్నర్ ప్రసంగించడం ఇదే తొలిసారి. శనివారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర శాసనసభ, శాసనమండలిని ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగానికి మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. గతేడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించిన తర్వాత సెప్టెంబరు ఆరవ తేదీన అసెంబ్లీ రద్దు కావడంతో ఎన్నికల అనంతరం రెండు రోజుల క్రితం కొత్త శాసనసభ కొలువుదీరింది. నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ నెల 17న కొత్త శాసనసభ్యుల చేత ప్రోటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. రెండవ రోజైన శుక్రవారం కొత్త స్పీకర్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. నూతన స్పీకర్‌గా పోచారం శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన మరుసటి రోజునే ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ మరుసటి రోజున (ఆదివారం) గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన చర్చ జరగనుంది. అనంతరం సభ ఆమోదం తెలపనుంది. శాసన మండలి సమావేశాలు సైతం శనివారం ఉదయం ప్రారంభం కానున్నట్లు శాసన వ్యవహారాల కార్యదర్శి నరసింహాచార్యులు ఇప్పటికే ప్రకటించారు. ఆదివారం కూడా శాసనమండలి సమావేశాలు జరగనున్నాయి.

పౌరసరఫరాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతా





- రైతుల సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన
- సంస్థ నూతన ఛైర్మన్‌గా మారెడ్డి శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకరణ

మన తెలంగాణ / హైదరాబాద్ : పౌరసరఫరాల సంస్థను దేశంలోనే అత్యున్నతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కృషి చేస్తానని సంస్థ నూతన ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తనపై ఉంచిన నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సంస్థ పనితీరును మెరుగు పరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణలో పౌరసరఫరాల సంస్థలో చేపట్టిన పలు రకాల విప్లవాత్మక మార్పుల వల్ల దేశానికి ఆదర్శంగా మారిందన్నారు. దీన్ని అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు అవసరమైన చర్యలకు శ్రీకారం చుడతానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రెండవసారి అధికారాన్ని చేపట్టిన తర్వాత పౌరసరఫరాల సంస్థకు ఛైర్మన్‌కు మారెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం పౌరసరఫరాల సంస్థ భవన్‌లో కమిషనర్ అకున్ సబర్వాల్‌తో పాటు ఇతర అధికారులు, మాజీ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డిల సమక్షంలో ఆయన పదవి బాధ్యతలను చేపట్టారు. అనంతరం స్థానికంగా బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మారెడ్డి మాట్లాడుతూ తాను రైతు కుటుంబానికి చెందిన వ్యక్తినని తెలిపారు. దీంతో రైతులకు ప్రయోజనానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటానని హామినిచ్చారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై తనకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. సిద్ధిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు. చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యక్షం గా పరిశీలించానని తెలిపారు. దీంతో రైతుల సమస్యలపైఅవగాహన ఉందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నా రు. పౌరసరఫరాల విభాగం ప్రభుత్వానికి చాలా కీలకమైనదన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత బలోపేతం చేసేందుకు కూడా కృషి చేస్తానన్నారు. చేపడుతున్న కార్యక్రమాలపై తనకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందన్నారు. ఇందులో పనిచేసేందుకు తనకు అవకాశం కల్పించినందుకు సిఎం కెసిఆర్ కృతజ్ఞతలు తెలిపారు. పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, ఎంఎల్‌ఎలు, మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీశ్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బిబి.పాటిల్, టిఎస్‌ఐఐసి ఛైర్మన్ బాలమల్లు, నగర మేయర్ బొంతు రాంమోన్‌తో పాటు పలువురు ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిలు, ఇతర కార్పొరేషన్ల ఛైర్మన్ల భారీగా పాల్గొని ఆయన అభినందనలు తెలిపారు. పదవి బాధ్యతలను స్వీకరించిన తర్వాత మారెడ్డి శ్రీనివాసరెడ్డి నేరుగా ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



అర్చక డైరీ ఆవిష్కరించిన కెటిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ అర్చక సమాఖ్య రూపొందించిన 2019 సంవత్సరపు డైరీని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం ఆవిష్కరించారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో అర్చక సమాఖ్య నాయకులతో కెటిఆర్ కొద్ది సేపు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి చేస్తున్న కృషిని వివరించారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చకులకు వేతనాలు ఇవ్వడంతో పాటు దేవాలయాలకు దూపదీప నైవేద్యాలకు అందిస్తున్న సేవను అర్చకుల సమాఖ్యనేతలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, గ్రేటర్ హైదరాబాద్ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీనివాసా చార్యులతో పాటు కరుణాకరాచార్యులు, రాజేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ నుంచి స్పీకర్ దాకా..

- పోచారం శ్రీనివాసరెడ్డి ప్రస్థానం



మన తెలంగాణ / హైదరాబాద్ : నిజామాబాద్ జిల్లాలోని పోచారం గ్రామానికి చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటిపేరు 'పరిగె' అయినప్పటికీ ఆయన తన స్వస్థలం పేరునే ఇంటిపేరుగా మార్చుకునేలా ప్రజలతో మమేకమై గుర్తింపు పొందారు. 1969లో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుకునే వయసులో పాల్గొని సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధానికి గురయ్యారు. వ్యవసాయ పనుల్లోనే నిమగ్నమైన పోచారం 1977లో రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ తరుపున దేశాయిపేట్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1980లో కాంగ్రెస్ తరఫున సమితి అధ్యక్షుడిగా పోటీచేసి ఓడిపోయారు. ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో 1984లో ఆ పార్టీలో చేరి 1985లో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించారు. 1987లో బుర్గి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికై ఆ తర్వాత జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1989లో తెలుగుదేశం తరపున ఎంపిగా పోటీచేసి ఓడిపోయారు. 1991నుంచి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడిగా ఏడుసార్లు, రాష్ట్ర కార్యదర్శిగా రెండుసార్లు పదవులు చేపట్టారు. 1994లో తెలుగుదేశం శాసనసభ్యుడిగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి గెలుపొంది 1998లో హౌ సింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొంది బొగ్గు గునుల శాఖ మంత్రిగా, 2000 సంవత్సరంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై పోటీచేసి ఓడిపోయారు. 2009లో తెలుగుదేశం తరఫున గెలుపొందినా 2011లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సందర్భంగా ఎంఎల్‌ఏ పదవికి, టిడిపికి రాజీనామా చేసి టిఆర్‌ఎస్‌లో 2011లో జరిగిన ఉపఎన్నికల్లో తిరిగి పోచారం విజయం సాధించారు. 2014 ఎన్నికల్లోనూ గెలుపొంది వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2018 ఎన్నికల్లోనూ బాన్సువాడ నుంచి గెలుపొందారు.

గవర్నర్‌తో పోచారం భేటీ

రాష్ట్ర శాసనసభ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. శాసనసభకు స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత మర్యాదపూర్వకంగా కలిశారు. పోచారంతో పాటు ఆయన భార్య, కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. అన్ని పార్టీల శాసనసభ్యులు మద్దతు తెలియజేయడంతో స్పీకర్‌గా పోచారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. నాలుగున్నరేళ్ళ పాటు వ్యవసాయ మంత్రిగా పనిచేసిన పోచారం రైతుబంధు, రైతుబీమా, రైతు సమన్వయ సమితి, వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం, వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ తదితర పలు వినూత్నమైన పథకాలకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు పథకానికి ఐక్య రాజ్య సమితి గుర్తింపు లభించడంతో పాటు పలు రాష్ట్రాలు ఈ స్ఫూ ర్తితో ఆ తరహా పథకాలను ప్రవేశపెట్టాయి. మరికొన్ని రాష్ట్రాలు ఇప్పటికీ అధ్యయనం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా దీన్ని అమలుచేయడంపై కసరత్తు చేస్తోంది. వ్యవసాయ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించిన మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఇప్పుడు శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై గవర్నర్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ శనివారం ఉదయం 11.30 గంటలకు ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌తో భేటీ కావడం విశేషం.

త్రుటిలో తప్పిన రైలు ప్రమాదం

మల్యాల క్రాస్ రోడ్డు స్టేషన్ సమీపంలో విరిగిన పట్టాలు



మనతెలంగాణ/మల్యాల : అట్టు గ్యాంగ్‌మెన్, ఇటు గేట్ కీపర్ అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాలరిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న గూడ్స్ రైలు మల్యాల ఎక్స్‌రోడ్డు నూకపెల్లి స్టేషన్ దాటి జగిత్యాల వైపు వస్తోంది. అదే సమయంలో రామన్నపేటకు వెళ్లే రహదారికి అడ్డంగా ఉన్న గేట్ సమీపంలో రైలు పట్టాలు దెబ్బతిని విరిగిన స్థితిలో ఉండడాన్ని అక్కడే ఉన్న గ్యాంగ్‌మెన్ గమనించి వెంటనే మొబైల్ ఫోన్‌లో గేట్ కీపర్‌కు సమాచారం అందించాడు. దీంతో స్పందించిన గేట్ కీపర్ వెంటనే రైలుకు ఎదురు వెళ్లి డ్రైవర్‌కు సైగ చేస్తూ ఆరిచి ఆపడంతో డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపివేశారు. లేని పక్షంలో గేట్ దాటాకా గూడ్స్‌రైలు పట్టాలు తప్పి బోల్తా పడేది.

పంచాయతీ రిజర్వేషన్లపై సుప్రీంకు కృష్ణయ్య

మన తెలంగాణ / ముషీరాబాద్ : గ్రామ పంచాయతీ బిసి రిజర్వేషన్లను 34 నుంచి 22 శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారి చేసిన ఆర్డినెన్సును రద్దు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సుప్రీంకోర్టులో శుక్రవారం స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేశారు. మంత్రి వర్గ సమావేశం లేకుండా అసెంబ్లీలో పాసైన పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌లో పేర్కొన్నారు. పైగా రాష్ట్రంలో 56 శాతానికి పైగా ఉన్న బిసిలకు 22 శాతానికి రిజర్వేషన్లు తగ్గించడం మూలంగా బిసిలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇలా తగ్గించడం వలన 1400 సర్పంచ్ పదవులు, 18 వేల వార్డు మెంబర్ పదవులు బిసిలకు దక్కకుండా పోయాయని కృష్ణయ్య పేర్కొన్నారు. అలాగే త్వరలో జరిగే ఎంపిటిసి, జెడ్‌పిటిసి పదవులు కూడా దక్కకుండా పోతున్నాయన్నారు. జనాభా లెక్కలు శాస్త్రీయంగా ఉంటే రిజర్వేషన్లు 50 శాతం దాటి పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పిందన్నారు. తెలంగాణలో 2014 లో జరిపిన సమగ్ర సర్వేలో బిసి జనాభా 52 శాతం ఉన్నట్లు తేలిందని, అలాంటప్పుడు జనాభా నిష్పత్తిలో బిసి రిజర్వేషన్లు పెంచాలని కోరారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లు 50 శాతం గరిష్ఠ పరిమితికి కొంత శాస్త్రీయ పరమైన అర్థముందన్నారు. ఎందుకంటే మెరిట్ దెబ్బ తినరాదని 50 శాతం సీలింగ్ పెట్టారని, కానీ రాజకీయ రిజర్వేషన్లకు మెరిట్ లేదన్నారు. కాబ్బటి 50 శాతం గరిష్ఠ పరిమితి విధించడంలో ఏ మాత్రం అర్థంలేదని కృష్ణయ్య పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, ప్రతి సామాజికవర్గానికి వారివారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని కోరారు. ఈ కేసు సోమవారం సుప్రీం కోర్టు చీఫ్ జస్టీస్ బెంచ్ మీద వాదోపవాదాలు జరుగనున్నాయని కృష్ణయ్య తెలిపారు.

అశోక్ దళం కొరియర్ల అరెస్ట్

స్ప్రింగ్ ఫీల్డ్ ఆయుధం, తూటాలు స్వాధీనం



మనతెలంగాణ/మహబూబాబాద్ ప్రతినిధి: సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి అశోక్ దళం డిప్యూటీ కమాండర్ తాటి పవన్ కళ్యాణ్ ఎలియాస్ గణేష్, ఎలియాస్ రాకేష్ దళం కొరియర్లు జక్కుల సమ్మయ్య, వాసం వెంకన్నలను శుక్రవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్‌పి నంద్యాల కోటిరెడ్డి తెలిపారు. స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ వారి నుండి ఒక స్ప్రింగ్ ఫీల్డ్ ఆయుధం, 48 తూటాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొత్తగూడ మండలం తాటివారిపల్లి గ్రామానికి ఎన్‌డి దళ కమాండర్ అశోక్ వచ్చి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీవారిని గెలిపించుకోవాలని గ్రామస్థులతో సమావేశమయ్యేందుకు వస్తున్న నేపథ్యంలో సమాచారం అందుకున్న ఎస్‌ఐ తాహెర్‌బాబా, కొత్తగూడ సిఆర్‌పిఎఫ్ స్పెషల్ పార్టీ సిబ్బందితో వెళ్ళి అడవి నుండి తాటివారి వేంపల్లి గ్రామానికి ఉదయం చేరుకుని గాలింపు చేస్తుండగా వారికి నక్సల్ దళం ఎదురుపడి వారిని సరెండర్ కావాలని పోలీస్‌లు హెచ్చరించినప్పటికీ నక్సల్స్ తప్పించుకుని అడవిలోకి పారిపోయారని తెలిపారు. అందులో ముగ్గురిని మాత్రమే పోలీసులు పట్టుకున్నారని వారిలో అశోక్ దళం డిప్యూటీ కమాండర్ తాటి పవన్‌కళ్యాణ్, అతని వద్ద ఒక స్ప్రింగ్ ఫీల్డ్ రైఫిల్, 48 తూటాలు స్వాధీనం చేసకున్నట్లు తెలిపారు. అలాగే మిగతా ఇద్దరు కొరియర్లు జక్కుల సమ్మయ్య, వాసం వెంకన్నను కూడా అరెస్ట్‌చేసి కొత్తగూడ పోలీస్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అతి చిన్న వయసులోనే సర్పంచ్



మనతెలంగాణ,మరిపెడ: అతి చిన్న వయస్సులోనే సర్పంచ్ పదవికి జర్పుల స్వాతి(22)ని తండావాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వీరారం శివారు నూతనంగా బాల్యతండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ డైరెక్టర్ జర్పుల కాలు నాయక్ పెద్ద కూతురు జర్పుల స్వాతి నామినేషన్ వేశారు. 22 సంవత్సరాల వయస్సు కలిగిన స్వాతి బీటెక్(కంప్యూటర్) చదివిన విద్యావంతురాలు కావడంతో అ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి ఎవరు నామినేషన్ వేయలేదు. అందరు ఐక్యమత్యంతో స్వాతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రిటర్నింగ్ అధికారులు ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లుగా ప్రకటించారు.

సెంట్రింగ్ పరికరాల దొంగల ముఠా అరెస్ట్





మన తెలంగాణ/నిర్మల్ ప్రతినిధి: జిల్లాకేంద్రంలో గత కొన్ని రోజులుగా సెంట్రింగ్ పరికరాలు ఎత్తుకెళ్తున్న ముఠా చివరకు నిర్మల్ జిల్లా పోలీసుల చేతికి చిక్కారు. గత కొన్ని రోజుల నుండి నిర్మల్ జిల్లాకేంద్రంలో భవన నిర్మాణ పనులకు వాడే సెంట్రింగ్ మెటిరియల్ చోరీకి గురవుతున్నాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అప్రమత్తమై నూతన భవన నిర్మాణాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సెంట్రింగ్ పరికరాలు దొంగతనం చేయడానికి వచ్చిన ముఠా సంబంధిత వ్యక్తులు చివరకు శుక్రవారం పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుండి సుమారు రూ.5లక్షల విలువ చేసే సెంట్రింగ్ పరికరాలతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 9 మంది సభ్యులుగా గల ఈ ముఠాకు భీమేష్ అనే వ్యక్తి నాయకుడు. కాగా అతడు నేర చరిత్రగలవాడని, పలుమార్లు జైలు శిక్ష అనుభవించి తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్నాడని కొంతకాలంగా ఇతడి కోసం పోలీసులు గాలిస్తున్నప్పటికి అజ్ఞాతనంలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ దొంగతనంతో అతడు పట్టుబడ్డాడని ఇతడితో పాటు మొత్తం ముఠా సభ్యులను అదుపులోని తీసుకున్నట్లు ఎస్పి పేర్కొన్నారు. వీరి వద్ద లభ్యమైన సుమారు రూ. 5లక్షలు విలువ చేసే సెంట్రింగ్ మెటిరియల్‌ను, దొంతనానికి ఉపయోగించే ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి శశిధర్‌రాజు తెలిపారు.

రబీలో వరిసాగుపై తగ్గిన ఆశలు

ఆరుతడి పంటలపై దృష్టిసారించిన రైతన్నలు

మనతెలంగాణ/ఖమ్మం : ఈ ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు కురిసినప్పటికీ అ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో భూగర్భజలాలు పడిపోయాయి. ఖమ్మం జిల్లాలో 2.10 లక్షల ఎకరాలకు సాగర్ జలాలను ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో అందించినప్పటికీ రబీలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని అందిస్తామని అధికారులు అధికారికంగా ప్రకటన జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో వరిసాగు సజావుగా సాగినప్పటికీ రబీలో సాగర్ జలాలు పూర్తిస్థాయిలో రావని అధికారులు తేల్చి చెప్పడంతో వరిసాగుపై రైతులు ఆశలు కోల్పోయారు. రబీలో వరి సాగు బదులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆరుతడి పంటలపై రైతులు దృష్టిసారించారు. రబీలో ప్రధానంగా రెండు నుంచి మూడు లక్షల ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, పెసర, మినుము, వంగ, టమోట తదితర కూరగాయల పంటలపై మక్కువ చూపుతున్నారు. రబీలో వరిసాగుకు ఎక్కువ నీటి వసతి అవసరమున్న నేపథ్యంలో ఆరుతడి పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు దృష్టి పెట్టారు. ప్రధానంగా ఆరుతడి పంటలు పండితే గిట్టుబాటు ధర విషయంలో తమకు న్యాయం జరుగుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఖమ్మం రూరల్, అర్బన్, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, వైరా, తల్లాడ, ఏన్కూర్, జూలూరుపాడు, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి, ఆశ్వారావుపేట, దమ్మపేట, ఇల్లందు, కామేపల్లి, కారేపల్లి,







గుండాల, ట్ఠండాల, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్, ములకలపల్లి, చంద్రుగొండ, భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం తదితర మండలాల్లో రబీలో ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలకు సాగు నీటి వసతి తక్కువగా ఉండటంతో ఆయా పంటలు పండిస్తే దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబులెన్స్‌లో మద్యం సరఫరా

రూ.1.20 లక్షల విలువైన మద్యం స్వాధీనం • సర్పంచ్ అభ్యర్థి సహా వైద్యుడిపై కేసు



మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : ప్రస్తుతం పల్లెల్లో గ్రామపంచాయతీ ఎన్నికల వాతావరణం సందడి చేస్తున్న విషయం తెలిసిందే. ఎలాగైన సర్పంచ్ పదవిని చేజిక్కించుకోవాలనే ఆలోచనతో పలువురు అభ్యర్థులు వివిధ రకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుంటారు. అందులో భాగంగా ఓ అభ్యర్థి వినూత్నంగా ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు కొత్తపద్ధతిని అవలంభించాడు. అతనికి వైద్యుడైన సోదరుడు సహకరించాడు. ఇంకేముంది వారి ఆలోచనను అమల్లో పెట్టగా సమాచారం అందుకున్న ఖాకీలు వారి ఆలోచనకు అడ్డుకట్టవేసి కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకున్న సంఘటన వివరాలను శుక్రవారం కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరీంనగర్ ఎసిపి డాక్టర్ పి.అశోక్‌కుమార్ వివరించారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామం నుండి సర్పంచ్ పదవికి పోటీచేస్తున్న నారగోని విజయ్‌కుమార్ ఎలాగైనా ఎన్నికల్లో గెలువాలనే సంకల్పంతో ఓటర్లకు మద్యం పంపిణీ చేసి ఆకట్టుకోవాలని ఆలోచించాడు. వెంటనే తన ఆలోచనను ఆయన సోదరుడైన కరీంనగర్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ నారగోని కుమార్‌గౌడ్‌కు తెలిపాడు. ఇరువురు తమ ఆలోచన మేరకు కుమార్‌గౌడ్ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో మద్యం తరలించాలని నిర్ణయించుకుని చొప్పదండి మండలంలోని కంతనపల్లి గ్రామానికి చెందిన దామెరపల్లి తిరుపతి అనే డ్రైవర్ ద్వారా కరీంనగర్‌లోని రాంపూర్ వద్ద గల వైన్స్‌లో మద్యాన్ని కొనుగోలు చేశారు. ఆ మద్యాన్ని డాక్టర్ కుమార్‌గౌడ్ ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో గ్రామానికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న కరీంనగర్ వన్‌టౌన్ సిఐ తుల శ్రీనివాస్ రావు తన సిబ్బందితో కలిసి నగరంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ వద్ద అంబులెన్స్‌ను పట్టుకుని అందులో ఉన్న రూ.1.20 లక్షల విలువైన 20 ఐ.బి. కాటన్‌లతోపాటు 4 బీరు కాటన్‌లను స్వాధీనం చేసుకుని మద్యాన్ని తరలిస్తున్న తిరుపతితోపాటు సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నారగోని విజయ్‌కుమార్, వైద్యుడు నారగోని కుమార్‌గౌడ్‌ల మీద ఐపిసి సెక్షన్ 171/ఇ కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా రాంపూర్ వైన్‌షాప్ యాజమాన్యం మీద సైతం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం తిరుపతి పోలీసుల అదుపులో ఉండగా మిగితా వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎసిపి డాక్టర్ అశోక్ తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతూ ఎలాంటి వాహనంలో మద్యాన్ని తరలించినా చర్యలు తప్పవన్నారు. పంచాయతీ ఎన్నికలపై పోలీసుల పటిష్టమైన నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా పెద్దమొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వైన్‌షాపుల యజమానులకు ఎసిపి అశోక్‌కుమార్ సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో కరీంనగర్ వన్‌టౌన్ సిఐ తుల శ్రీనివాస్ రావు, ఎస్.ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మనతెలంగాణ/జగిత్యాల టౌన్ : చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్య కార్మికుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పట్టణంలోని వాణినగర్‌కు చెందిన దేశవేని నర్సయ్య (66) అనే మత్స్యకార్మికుడు శుక్రవారం ఉదయం ధర్మసముద్రం చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వల వేసిన నర్సయ్య అదే వలలో చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. అయితే పక్కనే ఉన్న గంగపుత్రులు నీటిలో మునిగిపోయిన నర్సయ్యను బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించేలోపే నర్సయ్య మృతి చెందాడు. బయటకు తీసిన సమయంలో గుండెపోటు రావడంతో నర్సయ్య మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

మృతదేహంతో బంధువుల ఆందోళన



మనతెలంగాణ/దండేపల్లి: పేదలకు సర్కార్ ఆసుపత్రిలో వైద్యం అందుతుందని ప్రసూతి కోసం వెళ్లిన బాలింత వైద్యం అందక మృతి చెందిన వైనమిది. ప్రభుత్వ వైద్యాధికారి సునీల్ నిర్లక్ష్యం వలనే బాలింత వేల్పుల సవిత (24) మృతి చెందిందని బంధువులు మృతదేహంతో శుక్రవారం దండేపల్లి ఆసుపత్రికి వెళ్లి రోడ్డుపై రాస్తారోకో చేశారు. బంధువుల కథనం ప్రకారం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నిండు గర్భిణీ సవితను భర్త రాజు కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రసవం కోసం చేర్పించారు. సుమారు 7గంటల సమయంలో వైద్య సిబ్బంది నార్మల్ డెలివరీ చేసేందుకు చికిత్సలు అందించారు. దీంతో పాప జన్మించగా బాలింత సవితకు ప్రసవం అనంతరం రక్తస్రావం అధికమైంది. దీనికితోడు పాప ఆరోగ్యంగా లేదని వైద్యసిబ్బంది మంచిర్యాల ఆసుపత్రికి అంబులెన్స్‌లో తల్లిబిడ్డలను తరలిస్తుండగా మార్గమధ్యలో తల్లి సవిత మరణించింది. వైద్యాధికారి నిర్లక్ష్యం వలన భార్య మృతి చెందిందని మృతురాలి భర్త రాజుతోపాటు బాధిత కుటుంబసభ్యులు మృతదేహంతో దండేపల్లి ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. సిఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంజీవ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని ఎసిపికి విన్నవించారు. దీంతో ఎసిపి గౌస్ బాబా బాధితుల బంధువులతో మాట్లాడి ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని మృతికి కారణమైన వైద్యాధికారి, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈవిషయమై వైద్యాధికారి సునీల్‌ను వివరణ కోరగా తమ నిర్లక్ష్యం ఏమి లేదన్నారు.

దుప్పిని చంపిన ఊరకుక్కలు

మనతెలంగాణ/ అమ్రాబాద్ : అడవిలో సరిపడా నీరులేక ఓ దుప్పి గ్రామపరిసరాల్లోకి ప్రవేశించింది. దుప్పిని గమనించిన ఊరకుక్కలు ఒక్కసారిగా దాడిచేసి చంపేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇది గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని మృతిచెందిన దుప్పిని సమీప అడవిలోకి తీసుకెళ్లి కాల్చివేశారు.

వెయ్యి మీటర్ల అగ్నిగోళమే

- పేలి ఉంటే.. పెను ప్రమాదమే..!
- పోలీసుల ప్రమేయంతో పెను ప్రమాదం తప్పింది
- కీలక నిందితుని కోసం పోలీస్ వేట

మన తెలంగాణ/హైదరాబాద్: డీజల్ చౌర్యంలో చిన్నపాటి అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఉంటే 1000 మీటర్ల మేరకు అగ్నిగోళంగా మారేదని సేఫ్టీ అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదం ధాటికి 600 మీటర్ల అగ్నికీలలు ఎగిసిపడే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. డీజల్ తస్కరించేందుకు ఏర్పాటు చేసుకన్న సొరంగ మార్గం నుంచి భారీ ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడి పైప్‌లైన్లు పేలిపోయే ప్రమాదం సైతం ఉందని వివరిస్తున్నారు. డీజల్ దొంగలు పైప్‌లైన్ నుంచి డీజల్ మోటర్ల ద్వారా పంపింగ్ చేసే క్రమంలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకున్నా, అగ్గి రవ్వలు వ్యాపించినా ఆ ప్రాంతంలో అగ్నిగుండగా మారి పెను ప్రమాదం చోటు చేసుకునేదని భారత్‌పెట్రోలియం, ఇండియన్ అయిల్ పెట్రోలియం విభాగాల సేఫ్టీ అధికారులు వివరిస్తున్నారు. రెండు నెలలపాటు డీజల్ దొంగలు ఎలాంటి జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీకి సంబంధించి చర్యలు చేపట్టలేదని సేఫ్టీ విభాగం సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రమాదవశాత్తు స్వల్ప అగ్నిప్రమాదం జరిగివుంటే ఊహించని విధంగా భారీ నష్టం వాటిల్లేదని వారు వివరిస్తున్నారు. పైప్‌లైన్‌కు అటు వైపు, ఇటు వైపు వెరసి 1000 నుంచి 1200 మీటర్ల మేరకు భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకునేదని, దీంతో ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం పెద్ద ఎత్తున వాటిల్లేదని సేఫ్టీ అధికారులు వివరిస్తున్నారు. 17 కిలోమీటర్ల పొడువునా ఉన్న పైప్‌లైన్‌లో ప్రమాదం జరిగితే చర్లపల్లి, ఘట్కేసర్ మధ్యలో ఉన్న వ్యాపార సముదాయాలు సర్వనాశనమయ్యేవని తెలిపారు. ఘటనా స్థలంలో మృతదేహాల ఆచూకీ సైతం దొరికేది కాదని తెలియజేస్తున్నారు. డీజల్ చౌర్యానికి గాను వారు సొరంగా మార్గం తవ్వే సమయంలో గునపం పైపులైనుకు తగిలిలా ప్రమాదం సంభవించేందుకు అవకాశం ఉందంటున్నారు. అలాగే తవ్వకం జరిపే వారు బీడీ, సిగరెట్ లాంటివి వాడినా ప్రమాదం జరిగేదన్నారు. అలాగే పైపునకు రంధ్రం వేసే క్రమంలో డీజల్ సరఫరా తక్కువగా ఉన్నందున ప్రమాదం జరగలేదని, తెల్లవారు జామున సమయంలో రంధ్రం వేసారని సేఫ్టీ అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే డీజల్ సరఫరా అయ్యే పైప్‌లైన్‌కు వాచర్లను ఉపయోగించి గేట్‌వాల్ ఏర్పాటు చేసి చోరులు కొంత జాగ్రత్త తీసుకున్నట్లు తెలుస్తోంది. పైప్‌లైన్‌కు గేట్ వాల్ అమర్చడం, పైపులకు మోటర్ భిగించదం వల్ల చిన్నపాటి షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంటే భారీ ఎత్తున ప్రమాదం జరిగేది. డీజల్ దొంగలు అవగాహనతోనే దొంగతనానికి పాల్పడినట్లు పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. డీజల్ చౌర్యంలో 12 మంది అంతరాష్ట్ర ముఠాకు చెందిన నలుగురు సభ్యులను మల్కాజ్‌గిరి, సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. డీజల్ చౌర్యం ఘటన వెలుగు చూడటంతో ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియంకు చెందిన అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా చర్లపల్లి నుంచి ఘట్కేసర్ వరకు 17 కిలోమీటర్ల మేర పహారా కాసే విధంగా చర్యలు తీసుకున్నారు. డీజల్ సరఫరా అయ్యే పైప్‌లైన్‌ల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు భారత్‌పెట్రోలియం, ఇండియన్ అయిల్ పెట్రోలియం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. భారత్‌పెట్రోలియం, ఇండియన్ అయిల్ పెట్రోలియం సరఫరా జరిగే పైప్‌లైన్ సమాచారం బయటకు ఎలా? వెళ్లిందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. డీజల్ దొంగతనం జరిగిన స్థలం యజమాని మహేందర్‌గౌడ్‌ను పోలీసులు ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. స్థలాలను లీజుకు ఇచ్చే ముందు స్థలాల యజమానులు సైతం కేవలం డబ్బు మాత్రమే కాకుండా లీజుకు వారు ఎందుకు తీసుకున్నారు, అక్కడ ఎలాంటి పనులు జరుగుతున్నాయన్నది తెలుసుకోవాలని పోలీసు బాసులు వివరిస్తున్నారు. డీజల్ చౌర్యానికి పాల్పడిన స్థలంలో చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించుకుని డీజల్ దొంగిలించిన వైనంతో భారత్ పెట్రోలియం, ఇండియన్ అయిల్ పెట్రోలియం ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. తమ సంస్థల ద్వారా అండర్‌గ్రౌండ్‌లో డీజల్ సరఫరా అవుతున్న పైప్‌లైన్ల భద్రతకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడం తక్షణ కర్తవ్యమని వారు నిర్ణయానికి వచ్చారు. భారత్‌పెట్రోలియం, ఇండియన్ అయిల్ పెట్రోలియం కంపెనీల నుంచి 1.30 లక్షల లీటర్ల డీజల్ దొంగలించిన చోరులకు కొన్ని ప్రాంతాల నుంచి కొంత బకాయి రావాల్సి ఉన్నట్లు పోలీసులు వివరిస్తున్నారు. డీజల్ దొంగిలించిన వారితోపాటు డీజల్‌ను కొన్నవారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఈ కేసు దర్యాప్తు చేపడుతున్న అధికారులు తెలిపారు.



అక్రమంగా ఆయుధాలు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

- రెండు ఆయుధాలు, రెండు రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- ఇద్దరి అరెస్టు, ఒకరి పరారీ
- వివరాలు వెల్లడించిన సిపి మహేష్ భగవత్



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: ఆయుధాలు అక్రమంగా రవాణా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎల్‌బినగర్ పోలీసులు, మల్కాజ్‌గిరి ఎస్‌ఓటి సిబ్బంది అరెస్టు చేశారు. ముగ్గురు సభ్యుల ముఠాలో ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి రెండు గన్‌లు, రెండు రౌండ్ల ఆయుధాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ ఎల్‌బీ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని థానే జిల్లా భీవండి, గంగాభాయి ఛాల్ గ్రామానికి చెందిన దత్తు వీరేష్ కోలి గార్మెంట్స్ వ్యాపారం చేస్తున్నాడు. థానే జిల్లా, భీవండి, శ్రీరంగ్ నగర్, న్యూకనేరి, ఆగ్రా రోడ్డు, బాబుషేట్ ఛల్‌కు చెందిన శ్యామ్ సుందర్ భూమయ్య వడ్డేపల్లి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉత్తరప్రదేశ్, ఆజాం ఘర్‌కు చెందిన జమ్‌షేర్ అలియాస్ హసన్ దత్తుకు ఆయుధాల అక్రమ రవాణా చేస్తున్న బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారితో సంబంధాలు ఉన్నాయి. హసన్ తక్కువ డబ్బులకు ఆయుధాలు కొనుగోలు చేసి లక్ష రూపాయలకు అమ్మేవాడు. దత్తుకు కూడా ఆయుధాలు సరఫరా చేస్తున్నాడు. దత్తు, శ్యాం సుందర్ రెండు ఆయుధాలు అమ్మేందుకు నగరానికి వచ్చి ఎల్‌బి నగర్‌లోని శ్రీ సాయి లాడ్జిలో ఉన్నారు. అమ్మకం కోసం పలువురిని సంప్రదించారు. సమాచారం తెలియడంతో పోలీసులు లాడ్జిపై దాడి చేసి దత్తు, శ్యాం సుందర్‌ను అరెస్టు చేశారు. హసన్ పరారీలో ఉన్నాడు. రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ పర్యవేక్షణలో అడిషనల్ డిసిపి సురేందర్ రెడ్డి, స్పెషల్ ఆపరేషన్ టీం, నవీన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు అవినాష్, రత్నం, మల్కాజ్‌గిరి ఎస్‌ఓటి పోలీసులు పాల్గొన్నారు.



సుబాబుల్ కొనుగోలులో నిర్లక్ష్యం

- పంట అమ్మకాలపై రైతుల మల్లగుల్లాలు
- సంవత్సర కాలంగా ఇవే ఇబ్బందులు
- అదనపు ఖర్చులతో తీరని నష్టం





మనతెలంగాణ/ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వేలాది మంది రైతులు దీర్ఘకాలిక పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. ప్రత్యామ్నాయంగా సుబాబుల్ పంటపై దృష్టిసారించారు. ఈ పంట కొనుగోలు విషయంలో ఐటిసి అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పంటను అమ్ముకోవడానికి రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఖమ్మం అవిభాజ్య జిల్లాలో గత దశాబ్ద కాలంగా రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలకు ప్రకృతి సహకరించకపోవడం, సహకరించినా చీడ పీడల కారణంగా భారీ నష్టాలను మూటగట్టుకుంటున్నారు. మరోపక్క సాగు నీరు లేక పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించక అప్పులపాలవుతున్న రైతన్నలు ప్రత్యామ్నాయంగా అనేక ప్రాంతాల్లో సుబాబుల్, జామాయిల్ సాగుపై దృష్టి సారించారు. ఈ పంట కూడా రైతులకు గిట్టుబాటు కావడం లేదని, అధికారుల తీరును నిరసిస్తూ ఆందోళనలకు పూనుకుంటున్నారు. మూడు నుంచి ఐదు సంవత్సరాలపాటు సాగు చేసిన సుబాబుల్, జామాయిల్ పంటకు గిట్టుబాటు ధరలేక వరుస నష్టాలను చవిచూస్తున్నారు. చివరకు భారీ మొత్తంలో అప్పుల భారం పెరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటను సాగు చేసిన రైతులకు ప్రోత్సహకంగా విత్తనాలు, గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సకాలంలో పంటను కొనుగోలు చేస్తారన్న భద్రాచలం ఐటిసి కంపెనీ పంట చేతికి రాగానే చేతులెత్తేస్తుంది. ఈ పంటను అమ్ముకునేందుకు రైతులు సంవత్సర కాలంగా ఎదురుచూస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 7వేల మంది రైతులు సుమారుగా 1.80 లక్షల ఎకరాల్లో జామాయిల్, సుబాబుల్ పంటను సాగు చేస్తున్నారు. 2012–13లో ఈ పంట టన్నుకు రూ.5,600 పైనే ఉంది. ధర గిట్టుబాటుగా ఉండటంతో మూడేళ్లకు కోతకు వచ్చే ఈ పంట సాగు వైపు రైతులు ఎంతో ఆసక్తి చూపారు. ఐటిసి కేంద్రం ఖమ్మం అవిభాజ్య జిల్లాలోని భద్రాచలం, సారపాక ప్రాంతంలో ఉండటంతో ఈ పంటను అమ్ముకునేందుకు రైతులకు సౌకర్యవంతంగా ఉంది. ప్రస్తుతం 15.60 లక్షల టన్నుల సుబాబుల్, జామాయిల్ పంట కోత దశలో ఉండగా గిట్టుబాటు ధర లేకపోవడంతో అ పంటను నరుక్కునేందుకు రైతులు తర్జనభర్జన పడుతున్నారు. రోజుకు 50 లారీల చొప్పన 1000 టన్నులు కొనుగోలు చేస్తేనే రైతుల పంట సకాలంలో నరికే కార్యక్రమం పూర్తవుతుంది. 20 లారీల సరుకు 400టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో రైతులు 7,8 నెలలుగా తమ పంటను అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సారపాక ఐటిసి కేంద్రం వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి కొనుగోళ్లను స్తంభింపజేశారు. భద్రాచలం ఐటిసి అధికారులు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఖమ్మం అవిభాజ్య జిల్లాలోని రైతుల పంటకే అధిక ప్రాధాన్యత ఇచ్చి కొనుగోలు చేయాల్సి ఉంది. ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో 15 రోజులపాటు ఆందోళన చేపట్టి యాజమాన్యం మెడలు వంచి హామీ తీసుకుంది. అప్పుడే గిట్టుబాటు ధరగా టన్నుకు కనీసం రూ.4,500కు తగ్గకుండా చెల్లిస్తామని, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చే లారీలకు బదులుగా ఈ ప్రాంత రైతుల పంటనే కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తామని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో జరిగిన చర్చల్లో ఐటిసి కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఐటిసి అధికారులు ఇచ్చిన హామీని విస్మరించి ఎపి లారీలకు అనుమతిని ఇస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీ భూముల్లో సాగు చేసిన సుబాబుల్, జామాయిల్ పంటను కొనుగోలు చేస్తూ రైతుల పంట లారీలు, ట్రాక్టర్లను రోజుల తరబడి సిరియల్ పేరుతో రోజుల తరబడి నిలిపివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తమ పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. టన్ను రూ.4,508కి కొనుగోలు చేస్తున్నట్లు ఐటిసి కంపెనీ ప్రతినిధులు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం రైతుకు అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. రైతులు తమ సరుకును రవాణా చేసేందుకు రూ.1000 నుంచి రూ. 1500, కటింగ్‌కు రూ.400 నుంచి రూ.600 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇలా టన్నుకు సగటున రైతుపై రూ.1500 ఖర్చు భారం పెరుగుతుందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా ఐటిసి అధికారులు స్పందించి ఇచ్చిన హామీ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని, లేనిపక్షంలో మరోమారు ఆందోళనకు పూనుకుంటామని సుబాబుల్ రైతు సంఘం అధ్యక్షులు ఏకె.రామారావు తెలిపారు. ఐటిసి మేనేజర్ అమిత్ సింగ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం 20 లారీల ద్వారా పంటను కొనుగోలు చేస్తున్నామని, మరో 15 లారీలను పెంచి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని రైతులు తమను అర్థం చేసుకోవాలని కోరారు.



మిన్నంటిన రోదనలు

అమెరికా అగ్ని ప్రమాదంలో మృతి చెందిన చిన్నారుల పార్థివ దేహాలకు హైదరాబాద్‌లో ప్రార్థనలు

మన తెలంగాణ / ముషీరాబాద్ : అమెరికాలో గత ఏడాది డిసెంబర్‌లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన సాత్విక షారోన్ నాయక్ కేతవత్ (17), ఆరోన్ సుహాస్ నాయక్ కేతవత్ (15), జోయ్ సుచిత్ర నాయక్ కేతవత్ (14)ల పార్థివ దేహాలు శుక్రవారం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. హైదరాబాద్ నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చ్‌లో ఆ ముగ్గురి పార్థివ దేహాలను ముందుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనలకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు హాజరై ముగ్గురి పార్థివ దేహాలకు నివాళ్లుర్పించారు. అగ్ని ప్రమాదంలో ఒకేసారి ముగ్గురు పిల్లలు చనిపోవడం, పార్థివ దేహాలు ఆలస్యంగా రావడాన్ని చూసిన తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఆ చిన్నారుల తల్లిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. ప్రార్థనల అనంతరం పార్థివ దేహాలను స్వగ్రామం అయిన నల్గొండ జిల్లా దేవరకొండకు తీసుకెళ్లారు.



ఆ డైరెక్టర్ లైంగికంగా వేధించాడని తెలీదు

నటి స్వర్ణ భాస్కర్ కామెంట్

ముంబయి: ఒక దర్శకుడి వల్ల తను లైంగిక వేధింపులకు గురయ్యానని, కానీ ఆ సంగతి తెలుసుకునేందుకు తనకు ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాలు పట్టిందని నటి స్వర్ణ భాస్కర్ తెలిపారు. మగాడి దోపిడి నైజాన్ని ఎలా గుర్తించాలో మన సంస్కృతి మహిళలకు నేర్పించలేదని ఆమె అన్నారు. ఎవరి పేరూ చెప్పకుండా స్వర్ణ పనిచేసేచోట తనకు వేధింపులు ఎదురయ్యాయని, వేధింపులు ఎలా ఉంటాయో ఒక చర్చలో పాల్గొన్నప్పుడు మిగతా వారు చెప్పినదాన్ని బట్టి తెలిసిందని ఆమె అన్నారు. మూడేళ్ల కిందట నాకు జరిగింది లైంగిక వేధింపే. కానీ నేను గుర్తించలేదు. ఆ వ్యక్తి నన్ను తాకలేదు. నేను ఎలాగో తప్పించుకున్నాను. అతనేమీ మూర్ఖుడు కాదు. ఒక డైరెక్టర్. కానీ లైంగిక దోపిడీ మనస్తత్వం కలవాడు. అని ఆమె అన్నారు. తనకు ఎవరైనా అవకాశమిస్తే విలువల గురించి చెప్పాలనుకున్నానని, కానీ అలాంటిదేమీ జరగలేదని స్వర్ణ భాస్కర్ అన్నారు.

కన్నుమూసిన 'ట్రీ మాన్'

తెహ్రీ: వన సంరక్షకుడు, వృక్ష మానవ్‌గా (ట్రీ మాన్) పేరుపొందిన విశ్వేశ్వర్ దత్ సక్లానీ ఉత్తరాఖండ్ తెహ్రీ జిల్లాలో తన గ్రామంలో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఆయన వయసు 96 సంవత్సరాలు. 1922 జూన్ 2న పుట్టిన సక్లానీ తన ఎనిమిదో ఏట నుంచే మొక్కలు నాటడం మొదలుపెట్టారు. తెహ్రీ జిల్లాలో 50 లక్షల మొక్కల్ని ఆయన పెంచారు. 'మొక్కలు నాటే టప్పుడు బురద, చిన్న రాళ్లు ఆయన కళ్లలో పడడంతో పదేళ్ల కిందట సక్లానీ కంటి చూపు కోల్పోయారు. అయితే, చూపులేకపోయినా వేలాది మొక్కల్ని ఆయన నాటారు' అని కుమారుడు సంతోష్ సక్లానీ చెప్పారు. తన స్వగ్రామం సక్లానాలో సక్లానీ తను ఒక్కడే కష్టపడి వంద హెక్టార్లలో అనేక రకాల మొక్కలు నాటారు. అంతకు ముందు బీడు భూమిగా ఉన్న ఆ ప్రాంతం ఇప్పుడు చెట్లతో కళకళ లాడుతోంది. ఆయన తన చేతులతో అభివృద్ధి చేసిన అటవీ ప్రాంతానికి ఆయన సోదరుడైన నాగేంద్రదత్ సక్లానీ వన్ అనే పేరు పెట్టారు. చెట్లే ఆయన సర్వస్వం...అని సక్లానీ భార్య భగవతీదేవి అంటారు. సక్లానీ స్వాతంత్ర్యోద్యమంలో కూడా పనిచేశారు.

ఉదయం, రాత్రి సమయాల్లో పెరగనున్న మంచు

- మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి • వాతావరణ శాఖ అధికారుల హెచ్చరిక



మన తెలంగాణ/– హైదరాబాద్ : రానున్న రెండు రోజుల్లో ఉదయం, రాత్రి సమయాల్లో పలు చోట్ల పొగ మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో చలి తీవ్రత కొంతమేర తగ్గిందని, ఉత్తర దిశ, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. రాగల మూడు రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కోస్తా ఆంధ్రాలో కూడా ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు కురిసే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. రాయలసీమలో ఉదయం సమయంలో పొగ మంచు ఏర్పడడంతో పాటు పొడి వాతావరణం నెలకొంటుందని, చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు భారీగా ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, మెదక్ మరియు సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీయడంతో పాటు పొగమంచు మరింత ఎక్కువగా ఉండవచ్చని అధికారులు తెలిపారు.

కేంద్ర విధానాలపై పోరాడాలి

- అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
- ట్విట్టర్ వేదికగా మోదీ ప్రభుత్వంపై నారాయణ ఫైర్

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా అధికారులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని ట్విట్టర్ వేదికగా సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. మేధావులను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని, అందులో భాగంగానే వరవర రావు, సాయిబాబాలను అరెస్టు చేయించిందని ఆరోపించారు. కల్పితమైన ఆరోపణలను సృష్టించి వీరిని పలు ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు చాలా చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. బిజెపి, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి సంస్థలు తమకు అనుకూలంగా వ్యవహరించని సంస్థలు, వ్యక్తులను కేసుల్లో ఇరికించడానికి కుట్రలు పన్నుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్ణయాల వలన న్యాయవ్యవస్థలో పనిచేసే వారు భయాందోళన చెందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు కూడా భయపడే పరిస్థితిని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కల్పించిందని ఆయన దుయ్యబట్టారు. కేంద్రంలో ఉన్న బిజెపి తీసుకుంటున్న నిర్ణయాలను అందరూ ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

పిల్లల్ని కనండి బాబోయ్ !





నజరానాలు కూడా ఇస్తాం

జనాభా తగ్గుతుండడంతో ప్రజలకు నార్డిక్ దేశాల అభ్యర్థనలు

ఓస్లో : ఒక పక్క భారత్, చైనా వంటి దేశాలు తమ దేశ జనాభా నానాటికీ పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తుంటే నార్డిక్ దేశాలు మాత్రం "పిల్లలను కనండోయ్..నజరానాలు కూడా ఇస్తాం" అంటూ తమ దేశాల ప్రజలను బతిమిలాడుతున్నాయి. నార్వే, డెన్మార్క్, ఫిన్‌ల్యాండ్, ఐస్‌ల్యాండ్, స్వీడన్ వంటి దేశాలను నార్డిక్ దేశాలుగా వ్యవహరిస్తారు. ఈ దేశాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలేవీ లేనప్పటికీ ప్రజలు మాత్రం స్వచ్ఛందంగా సంతానం వద్దనుకుంటున్నారు. కుటుంబంలో ఒక బిడ్డ ఉండడమే కనాకష్టంగా మారడంతో అధిక సంతానమే దేశ ప్రగతికి మూలాధారమంటూ అక్కడి ప్రభుత్వాలు ప్రజలను ఊదరగొడుతున్నాయి. "నార్వేకు ఎక్కువ మంది పిల్లలు కావాలి! ఇది ఎలా సాధించాలో నేను ఎవరికీ వివరించనక్కర్లేదు" అంటూ నార్వే మహిళా ప్రధానమంత్రి ఎర్నా సోల్బర్గ్ ముసిముసి నవ్వులతో ప్రజలకు నచ్చచెబుతున్నారు. ఒకప్పుడు అధిక సంతానంతో కళకళలాడిన నార్డిక్ దేశాలు ఇప్పుడు సంతాన క్షీణతను ఎదుర్కొంటున్నాయి.

ఇది భవిష్యత్తులో దేశానికే ప్రమాదకరమని నార్వే ప్రధాని ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో యుజవనుల సంఖ్య తగ్గిపోతే దేశం గతి ఏమవుతుందని ఆమె వాపోతున్నారు. నార్వే, ఫిన్‌ల్యాండ్, ఐస్‌ల్యాండ్ దేశాలలో శిశు జననాల సంఖ్య 2017లో కనిష్ట స్థాయికి పడిపోయింది. కొన్నేళ్ల క్రితం వరకు దేశంలోని జననాల సంఖ్య ప్రతి మహిళకు సగటున 2.1 చొప్పున ఉండగా గత ఏడాది అది 1.49 నుంచి 1.71 స్థాయికి పడిపోయింది. 2008లో సంభవించిన ఆర్థిక సంక్షోభం తర్వాత శిశు జననాల సంఖ్య దారుణంగా పడిపోయిందని, దేశంలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పటికీ శిశు జననాల సంఖ్య మాత్రం క్షీణిస్తూనే ఉందని ఓస్లో సామాజిక శాస్త్రవేత్త ట్రూడ్ లాపేగార్డ్ అంటున్నారు. ధరల పెరుగుదల, ఆర్థిక అస్థిరత వంటి కారణాలతో మహిళలు సంతాన ప్రాప్తికి దూరమవుతున్నారని ఆయన అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఉద్యోగాలు చేసే వయసు గల వారు తక్కువై పోయి పన్నుల భారం పెరిగి సామాజిక పథకాల అమలు ప్రభుత్వానికి కష్టసాధ్యమవుతుందని ఆయన అంచనా వేశారు. కాగా, సంతానం లేని మహిళల మనసు మార్చేందుకు ఫిన్‌ల్యాండ్‌లోని మున్సిపాలిటీలు కనే ఒక్కో బిడ్డకు 10,000(దాదాపు 8 లక్షల రూపాయలు) యూరోలను బహుమతిగా ఇస్తామని ప్రకటించడం విశేషం.



విదేశీ చదువులకు సర్కార్ అండ

- బిసి, ఇబిసి విద్యార్థులకు రూ.20లక్షల సాయం
- దరఖాస్తుకు తుది గడువు ఫిబ్రవరి 15

మన తెలంగాణ, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేయాలన్న పేద ప్రజల కల నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఆర్థిక వనరులులేక ఉన్నత చదువులకు దూరమవుతున్న వారు నయాపైసా లేకుండా విదేశాలలో ఉన్నత చదువులు పూర్తిచేయడానికి రూ. 20 లక్షలను మహత్మ జ్యోతిరావు పూలే బి.సి. విదేశీ విద్యానిధి పథకం క్రింద అందచేస్తుంది. 35 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు పథకం క్రింద దరఖాస్తు చేసుకోవచ్చు.
వైద్య విద్య, మేనేజ్‌మెంట్ చదువులు, నర్సింగ్, ఇంజినీరింగ్, సామాజిక శాస్త్రంలో డిగ్రీ స్థాయిలో 60 శాతంకు పైగా మార్కులు సాధించి టోఫెల్‌లో 60%, జి మ్యాట్‌లో 500 మార్కులు వచ్చినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల తల్లితండ్రుల వారిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలి. అభ్యర్థులు కుల, ఆదాయ, స్థానికత, జనన ధ్రువీకరణ పత్రాలను, ఆధార్ కార్డులతోపాటు విద్యార్హత పత్రాలను జత చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవలసి ఉంటుంది. విదేశీ విద్యాలయంలో ప్రవేశ అనుమతి పత్రం, పన్ను చెల్లింపు పత్రం, బ్యాంక్ పాస్ పుస్తకాలతోపాటు ఫోటోలను సైతం తప్పనిసరిగా జతపరచవలసి ఉంటుంది. దరఖాస్తులను బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in దరఖాస్తు సమర్పించండి.

'రెరా' అమలు తీరుపై బిల్డర్లకు అవగాహన

సందేహాలను నివృత్తి చేసిన మహారాష్ట్ర రెరా చైర్మన్ గౌతం ఛటర్జీ



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో 'రెరా' చట్టం అమలు తీరును మహారాష్ట్ర (రెరా) అథారిటీ చైర్మన్ గౌతం చటర్జీ అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్రలో అమలు చేస్తున్న రెరా చట్టం అమలు తీరును గురించి ఇక్కడి బిల్డర్లకు, ఏజెంట్లకు అవగాహన కల్పించారు. అక్కడి అమలు తీరును తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఇక్కడి బిల్డర్లకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ భవనంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన రియల్టర్లు, బిల్డర్లలు పాల్గొని పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మహారాష్ట్రలో రెరా చట్టం అమలు తీరుతో అక్కడ బిల్డర్లు, కొనుగోలుదారుల మధ్య నెలకొన్న సమస్యలు. వాటిని పరిష్కరించిన తీరు తదితర అంశాలను మహారాష్ట్ర (రెరా) అథారిటీ చైర్మన్ గౌతం చటర్జీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో పాల్గొన్న బిల్డర్లు, కొనుగోలుదారులు, ఏజెంట్లు అడిగిన ప్రశ్నలకు గౌతం చటర్జీ సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ రెరా (అథారిటీ) చైర్మన్ రాజేశ్వర్ తివారీ, డైరెక్టర్ విద్యాధర్ (పట్టణ ప్రణాళిక అభివృద్ధి శాఖ)లతో పాటు క్రెడాయ్ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డితో పాటు పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.







ఉద్యోగుల్లో...మానసిక ఒత్తిడి

ఆడుతు పాడుతు పని చేస్తుంటే.. అలుపూ సొలుపు ఉండదని పెద్దలు చెప్పిన మాట. కొండల్ని పిండి చేసి రహదారులు నిర్మించినా.. ఆకాశాన్ని అంటినట్టుండే రెండు కొండలను అనుసంధానిస్తూ వంతెనలు కట్టినా నాటి మనిషికి ఒత్తిడి అంటే ఏంటో తెలీదు. ఇప్పుడు మాత్రం ఒళ్లు కదలకుండా, కంప్యూటర్ ముందు గంటల కొద్దీ కూర్చునేవారు తీవ్ర అలసటకు గురవుతున్నారు. అయితే ఆ ఒత్తిడి శరీరానికి కాదు... మనస్సుకు. పని ప్రదేశాల్లో ఎదురవుతున్న పరిస్థితులే మానసిక ఒత్తిడికి కారణమని తేలింది. హైదరాబాద్‌లో 11 శాతం మంది వృత్తి, ఉద్యోగ నిపుణులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు ఓ తాజా సర్వేలో బహిర్గతమైంది.
మారుతున్న కాలంతోపాటు ఉద్యోగాల తీరు మారుతోంది. ఎంత కష్టమైన పనైనా ఇష్టంతో చేసినప్పుడు ఒత్తిడి ఉండదని మానసిక వైద్యులు చెబుతారు. కానీ ఎంత ఇష్టమైన ఉద్యోగమైనా ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పడం లేదని కార్పొరేట్ నిపుణుల చెబుతున్నారు. ఉద్యోగ అభద్రత, అనారోగ్యకర పోటీ వాతావరణం, చేస్తున్న పనికి తగిన గుర్తింపు లభించకపోవడం, బాస్‌ల వేధింపులు మానసిక ఒత్తిడికి కారణమవుతున్నాయని అంటున్నారు. ఇలాంటి పరిస్థితులో మనసులోని బాధను బయటకు చెప్పుకోలేక చాలామంది మానసిక సమస్యలకు గురవుతున్నారని పలు అధ్యయనాల ఆధారంగా పరిశోధకులు వెల్లడించారు.
ఏడాదిపాటు సాగిన అధ్యయనంలో మానసిక నిపుణులు వివిధ రంగాలకు చెందిన లక్ష మంది ప్రొఫెషనల్స్‌ను సంప్రదించారు. అందులో అత్యధికంగా 24శాతం మంది మార్కెటింగ్ ఉద్యోగులు మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ఆ తర్వాత స్థానంలో మెడికల్, పబ్లిక్ రిలేషన్స్ ఉద్యోగులు 22శాతం, బీపీఓలో 17శాతం, టూరిజం ఉద్యోగులు 9శాతం, మేనేజ్‌మెంట్ రంగంలో 8శాతం మంది ఒత్తిడికి గురవుతున్నట్లు ఆ అధ్యయనం చెబుతోంది.

ఎదగాలనుకునే వారికి చక్కటి వేదిక

రేడియో జాకీ

మాటల్లో వేగం, స్పష్టత... మంచి మ్యూజికల్ నాలెడ్జ్.. కలగలిస్తే రేడియో జాకీ(ఆర్జే)! మనసులోని మాటలను అందంగా, ఆసక్తికరంగా చెప్పే నైపుణ్యం ఉంటే చాలు... రేడియో స్టేషన్‌లో దూసుకుపోవచ్చు. హాట్‌హాట్‌గా కబుర్లు చెప్పేయొచ్చు. శ్రోతలు కోరిన పాటలు వినిపిస్తూ... వారితో కబుర్లు చెబుతూ... పసందుగా షో చేసేయొచ్చు. ఒకసారి ఆర్జేగా పేరు సంపాదిస్తే... సెలబ్రిటీ హోదా మీ సొంతమైనట్టే. శ్రోతలకు తాజా సమాచారం అందిస్తూ, ఎంటర్‌టైన్ చేయడం ఆర్జేల విధి. ఫోన్‌లో, ఈమెయిల్/ ఆన్‌లైన్‌లోనూ ఆడియన్స్‌తో సంభాషణలు జరపడం, మ్యూజీషియన్లు, ఆర్టిస్టులు, వివిధ రంగాల్లోని ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేయడం, మ్యూజికల్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం కూడా వీరి బాధ్యతలు.



నైపుణ్యాలు : ఆర్జేగా కెరీర్‌లో స్థిరపడాలనుకునేవారికి చూడగానే చక్కటి పర్సనాలిటీతో పాటు బోలెడు సమయస్ఫూర్తి కూడా అవసరమే. చక్కటి స్వరం, గలగలా మాట్లాడే స్వభావం, భాషపై మంచి పట్టు ఉండాలి. ఈ రంగంపై ఆసక్తి, సృజనాత్మకత, చక్కటి సెన్స్ ఆఫ్ హ్యూమర్, భావవ్యక్తీకరణ నైపుణ్యం, మొదలైన లక్షణాలు ఉండాలి. సంగీత పరిజ్ఞానంతో పాటు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశం ఉంటే మంచిది. ఇతర ఆర్జేల శైలిని పరిశీలించడం, సొంతగా ప్రాక్టీస్ చేయడం, మీకంటూ ఒక శైలిని సృష్టించుకోవడం వంటివి మిమ్మల్ని సక్సెస్‌ఫుల్ ఆర్జేగా తీర్చిదిద్దుతాయి. శ్రోతలు ఎటువంటి మాటలు వినాలని కోరుకుంటున్నారో అలా మాట్లాడటం ద్వారా కెరీర్‌లో విజయం సాధించొచ్చు.

అర్హతలు : డిగ్రీ విద్యార్హతతో పాటు ఈ రంగంలో విజయం సాధించడానికి చక్కటి స్వరాన్ని మించిన అర్హత మరోటి లేదు. మాట్లాడే విధానం, ఉచ్ఛారణలో స్పష్టత ఆర్జేను ప్రేక్షకులకు చేరువ చేస్తాయి. వీటన్నిటికీ తోడు వివిధ అంశాలపై పరిజ్ఞానం ఆదనపు అర్హత. దీనికోసం నిరంతరం చదవడం, రీసెర్చ్ చేయడం అవసరం. కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి ఉండాలి.

కోర్సులు : ఆల్ ఇండియా రేడియో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆడిషన్స్ నిర్వహిస్తుంది. అందులో సెలెక్ట్ అయినవారికి రెండు నెలలపాటు శిక్షణ ఇస్తుంది. ఈ రంగంలో ఎదగాలనుకునేవారికి ఇదో చక్కటి వేదికగా ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్ బ్రాడ్‌కాస్టింగ్ సబ్జెక్టులతో చాలా సంస్థలు కోర్సులు అందిస్తున్నాయి. వీటి కాలవ్యవధి రెండు నెలల నుంచి సంవత్సరం వరకు ఉంటుంది. ఇవేకాకుండా వాయిస్ ఓవర్, మిక్సింగ్‌లపై అవగాహన కోసం కొన్ని క్రాష్ కోర్సులు కూడా చేయొచ్చు.

జీతభత్యాలు, అవకాశాలు: రేడియో జాకీలుగా కెరీర్‌ను ప్రారంభించేవారికి మొదట్లో తక్కువ వేతనం అందుకున్నా, ఆ తర్వాత అనుభవంతోపాటు వేతనాల్లోనూ పెరుగుదల ఉంటుంది. మీరు చేసే కార్యక్రమాలకు శ్రోతల్లో ఉన్న ఆదరణ పెరగడం మొదలైతే జీతాల్లో పెరుగుదల కూడా భారీగానే ఉంటుంది. పైన చెప్పిన అర్హతలు, నైపుణ్యాలు మీకుంటే ఆర్జేగా కెరీర్‌ను ప్రారంభించేయొచ్చు. ఆల్ ఇండియా రేడియోతో పాటు రేడియో మిర్చి, రేడియో ఎఫ్ఎం వంటి సంస్థలు ఫ్రెష్ టాలెంట్‌కు ఆహ్వానం పలుకుతున్నాయి.

రేడియోలో సక్సెస్ సాధిస్తే అటునుంచి టెలివిజన్ రంగంలోకి దూసుకెళ్లే అవకాశం కూడా ఉంది. వాయిస్ ఓవర్ ఆర్టిస్టులుగానూ రాణించవచ్చు.

ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోండి

స్మార్ట్ ఫోన్ చేతిలో లేనిదే కాలం గడవని రోజులివి. అయితే కొన్ని సరదాలు, మరికొన్ని సంతోషాలు, బోలెడు ఆవేశాలు... ఇలా ప్రతి భావాన్నీ వెనువెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఇప్పుడో ట్రెండ్‌గా మారింది. ఈ అలవాటే ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు వెళ్లేవారి కొంప ముంచుతోంది. సామాజిక మాధ్యమాల్లో అభ్యర్థులు ఎంత ఉత్సాహంగా ఉంటున్నారనే దానిపై రిక్రూటర్లు ఓ కన్నేసి ఉంచుతున్నారు. వారి ప్రవర్తన, అలవాట్లు, పోస్ట్ చేసిన ఫొటోలు, ఇతరుల వాల్‌పై రాసిన కామెంట్స్... ఇలా అన్నీ పరిగణనలోకి తీసుకొని అతడి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నారు. మిస్టర్ క్లీన్ అని నమ్మినవారికే ఉద్యోగం ఆఫర్ చేస్తున్నారని సర్వేలు చెబుతు న్నాయి. కాబట్టి అభ్యర్థులు కూ డా కాస్త స్మార్ట్‌గా ఉండాల్సిన సమయం వచ్చేసింది. ఎవరికి వారు తమ ఫేస్‌బుక్ అకౌం ట్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచు కోవడం తప్పనిసరి. దీనికోసం సోషల్ స్వీప్‌స్టర్ సర్వీసు బాగా ఉపయో గపడు తుంది. ఫేస్‌బుక్, ట్విటర్ అకౌంట్లలో అవాంఛ నీయ మైన ఫొ టోలు, కామెంట్లను తొలగించేస్తుంది.
ఫ్రెండ్స్‌తో కలిసి బీరు పార్టీ లు, రాజకీయాంశాలపై వివాదాస్పద కామెం ట్స్, పో స్టు లు, ఫ్రెండ్స్‌ను ఆటపట్టించేందుకు సోషల్ మీడియా అకౌం ట్స్‌లో వాడే బూతుపదాలు, ఇలాంటి వాటన్నింటినీ... అకౌంట్ ప్రారం భించిన నాటినుంచి మీరు చేసిన పోస్ట్‌లను, ఫొటోలను స్కా న్ చేసి వాటిలో అభ్యంతరకరంగా ఉన్నవాటిని మీ అను మతితో తొలగిస్తుంది. కాబట్టి ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసే ముం దే ఒకసారి మీ అకౌంట్‌ను క్లీన్ చేయడం మర్చిపోవద్దు.



ఉద్యోగ అవకాశాలు

నిట్ వరంగల్



ఎంబీఏ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఎంబీఏ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.
కోర్సు పేరు: ఎంబీఏ
అర్హత: ఇంజనీరింగ్ (బీఈ/ బీటెక్) అభ్యర్థులకు మాత్రమే.
ఎంపిక: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
వెబ్‌సైట్ : www.nitw.ac.in

దరఖాస్తు చేశారా?

హైదరాబాద్ ఈఎస్ఐసీలో పారామెడికల్, నర్సింగ్ స్టాఫ్ పోస్టులు
అర్హత: ఇంటర్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ. చివరితేదీ: 21.01.2019
బార్క్‌లో మెడికల్/ సైంటిఫిక్ ఆఫీసర్, టెక్నీషియన్ పోస్టులు
అర్హత: ఇంటర్, ట్రేడ్ సర్టిఫికెట్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ పని అనుభవం.
చివరితేదీ: 25.01.2019, బీఎస్ఎన్ఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు
అర్హత: బీఈ/ బీటెక్, ఎంబీఏ లేదా ఎంటెక్ ఉత్తీర్ణత.
చివరితేదీ: 26.01.2019
========================

వాక్-ఇన్స్

ఎస్వీవీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు
శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, పాలిటెక్నిక్‌లలో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ.
ఖాళీలు గల కళాశాలలు: కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(ప్రొద్దటూరు), ఏహెచ్ పాలిటెక్నిక్(బనవాసి/ మడకశిర), లైవ్‌స్టాక్ రిసెర్చ్ స్టేషన్(సిద్దరామాపురం/ మహానంది).
విభాగాలు: వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ ఫిజియాలజీ, అనిమల్ న్యూట్రిషన్, వెటర్నరీ మైక్రోబయాలజీ, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ తదితరాలు. **అర్హత:** సంబంధిత విభాగంలో బీవీఎస్సీ, ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత. ఇంటర్వ్యూ తేది: 25.01.2019.
వేదిక: ఎక్స్‌టెన్షన్ హాల్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, ప్రొద్దటూరు.
వెబ్‌సైట్: www.svvu.edu.in
========================

ఫ్యాక్ట్‌లో ఖాళీలు

మొత్తం ఖాళీలు: 155
డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్ 57 ఖాళీలు
అర్హత: కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, కమర్షియల్ ప్రాక్టీస్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
స్టయిఫండ్: రూ. 8000/
ట్రేడ్ అప్రెంటిస్ 98 ఖాళీలు
అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మెకానిక్ మోటార్ వెహికిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, పెయింటర్, వెల్డర్, కోపా, కార్పెంటర్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత.
స్టయిఫండ్: రూ.6018 లేదా 6770/
వయస్సు: 2019 జనవరి 1 నాటికి 23 ఏండ్లకు మించరాదు.
ఎంపిక: రాతపరీక్ష+ అకడమిక్ మార్కులు
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో. టెక్నీషియన్ డిప్లొమా అభ్యర్థులు www.mhrdnats.gov.in, ఐటీఐ ట్రేడ్ అభ్యర్థులు www. apprenticeship.gov.in ద్వారా మొదట రిజిస్టర్ చేసుకోవాలి..
చివరితేదీ: జనవరి 23, వెబ్‌సైట్: www.fact.co.in
============================

టీఎంబీలో ఆఫీసర్లు

తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
జీఎం/డీజీఎం (ఐటీ)చెన్నై,
జీఎం/డీజీఎం/ఏజీఎం (క్రెడిట్) తూత్తుకూడి
డీజీఎం (ఇన్‌స్పెక్షన్/క్యామ్)తూత్తుకూడి
అర్హత: సంస్థ నిబంధనల ప్రకారం
ఎంపిక: ఇంటర్వ్యూ, దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తులకు చివరితేదీ: జనవరి 28, **వెబ్‌సైట్:** www.tmbnet.in

Tamilnadu Mercantile Bank Ltd

ప్రతిభ ఉంటే ప్రైవేటు రంగంలోనే...

ఉద్యోగం ప్రారంభ దశలో ప్రభుత్వ రంగంలో జీతాలు ఎక్కువగా ఉంటున్నాయి. తక్కువ నైపుణ్యం అవసరమైన, పెద్ద చదువులతో అవసరం లేని ఉద్యోగాలకు ప్రభుత్వమే ఎక్కువ జీతం ఇస్తోంది. ఆ దశలో ప్రైవేటు ఉద్యోగుల జీతాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కానీ.. కాలం గడిచే కొద్దీ అనుభవంతో రాటుదేలి అత్యుత్తమ ప్రతిభ చూపించేవారికి ప్రైవేటు రంగమే ఎక్కువ జీతాలిచ్చి బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా కాపాడుకొంటోంది. ప్రైవేటుతోపోలిస్తే.. అలాంటివారికి ప్రభుత్వ రంగంలో వేతనాలు తక్కువే! ఒక్కమాటలో చెప్పాలంటే.. ప్రారంభ దశలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎక్కువ వేతనం, మధ్యస్థాయిలో దాదాపు సమాన వేతనాలు, ఉన్నత స్థాయిలో ప్రైవేటు రంగంలో ఎక్కువ వేతనాలు. ఇదీ పద్ధతి. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతభత్యాలపై కసరత్తు చేసిన 7వ వేతన సంఘం అహ్మదాబాద్ ఐఐఎం చేత జరిపించిన అధ్యయనంలో తేలిన ఫలితాలివి. ప్రైవేటు రంగంతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రతిభగలవారికి తక్కువ వేతనాలు వస్తున్నాయనే అసంతృప్తి ఉన్న నేపథ్యంలో.. ప్రతిభగలవారు ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఆకర్షితులయ్యేలా వేతనాలను సవరించేందుకు వేతన సంఘం ఈ అధ్యయనాన్ని నిర్వహింపజేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగుల ప్రారంభ స్థాయి వేతనాలను పోల్చి చూశారు. వేతన సంఘానికి సమర్పించిన నివేదికలో వెల్లడైన అంశాలు... ఎక్కువ నైపుణ్యం, అనుభవం ఉన్న ఉద్యోగులకు ప్రైవేటు రంగమే ఎక్కువ జీతం ఇస్తోంది. డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలకు దేశంలో చాలా కొరత ఉంది. కానీ వారికి ప్రభుత్వ రంగంలో జీతాలు తక్కువ ఉన్నాయి. ప్రైవేటు రంగం మాత్రం అలాంటి వారికి జీతంతో పాటు రివార్డులు , ప్రోత్సాహకాలు కూడా ఇస్తూ కాపాడుకుంటోంది.

విద్యావినియోగాద్ధికాస: IIM

నర్సుల జీతాలు ప్రైవేటు రంగం కంటే ప్రభుత్వ రంగంలోనే ఎక్కువ ఉన్నాయి. ఎంబీబీఎస్ వైద్యుల ప్రారంభ జీతాలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో కన్నా ప్రభుత్వ రంగ ఆస్పత్రుల్లో ఎక్కువగా ఉంటున్నాయి. ఎండీ, ఎంఎస్ వైద్యులకు మాత్రం ప్రైవేటు రంగంలోనే ఎక్కువ లభిస్తున్నాయి.
ఫిజీషియన్లు, డైటీషియన్ల జీతాలు ప్రభుత్వ రంగంలోనే ఎక్కువ ఉన్నాయి. ప్రైవేటు రంగం చాలా తక్కువ జీతం ఇస్తోంది. అలాగే ల్యాబ్ టెక్నీషియన్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, రేడియోగ్రాఫర్ల జీతాలు ప్రైవేటు రంగంలో చాలా తక్కువగా ఉన్నాయి. స్కూల్ టీచర్లకు ప్రైవేటు రంగంలో ప్రారంభ స్థాయిలోచాలా తక్కువ జీతాలు అందుతున్నాయి. కానీ.. ఎక్కువ అనుభవం, ప్రతిభ ఉన్నవారికి మాత్రం భారీస్థాయిలో జీతాలిస్తున్నారు.
దేశంలో సైంటిస్టులకు కొరత ఉంది. దీంతో మంచి శాస్త్రవేత్తల్ని నిలుపుకొనేందుకు ప్రైవేటు సంస్థలు పోటీ పడుతున్నాయి. ప్రతిభ ఉన్న ఇంజనీర్ల కొరత తీవ్రంగా ఉంది. అలాంటి వారికి ప్రైవేటు రంగంలో భారీగా జీతాలు, రివార్డులు ఇస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల జీతాలు ప్రైవేటు రంగంలో ప్రారంభ దశలో తక్కువగానూ, తర్వాత దశల్లో ఎక్కువగానూ ఉంటున్నాయి.

సన్‌ఫార్మా షేరు భారీ పతనం



ముంబై: ఫార్మా దిగ్గజం సన్‌ఫార్మాపై సెబీలో మరో ఫిర్యాదు నమోదైనట్లు వార్తలు రావడంతో కంపెనీ షేరు విలువ ఒక్కసారిగా పడిపోయింది. గురువారం 5 శాతానికి పైగా నష్టపోయిన సన్‌ఫార్మా షేర్లు, శుక్రవారం భారీగా నష్టపోయాయి. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు విలువ 9 శాతం పతనమై రూ.390.25 వద్ద ఉంది. ఓ దశలో షేరు 12శాతానికి పైగా నష్టంతో ఆరేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. గత కొన్ని రోజులుగా సన్‌ఫార్మాపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సన్‌ఫార్మాలో అవకతవకలు జరుగుతున్నాయని తమకు ఫిర్యాదు అందినట్లు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గత నెలలో వెల్లడించింది. ఆ ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం మరో ఫిర్యాదు కూడా దాఖలైనట్లు వార్తలు రావడంతో కంపెనీ షేర్లు కుప్పకూలుతున్నాయి.

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు

దేశీయ స్టాక్‌మార్కెట్లు వారాంతం ఫ్లాట్‌గా ముగించాయి. ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభాల్లో ప్రారంభమై నష్టాల్లోకి జారుకున్నాయి. సన్ ఫార్మా షేర్లు కుప్పకూలడం మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈ కంపెనీ షేర్లు దాదాపు 11శాతం పడిపోయాయి. రిలయన్స్ షేర్లు దాదాపు నాలుగు శాతం లాభపడ్డాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 12.53 పాయింట్ల లాభంతో 36,386.61 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 1.80 పాయింట్ల స్వల్ప లాభంతో 10,907 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఇ రిలయన్స్, విప్రో, కొటక్ మహీంద్రా, హిందాల్కో, అదానీ పోర్ట్స్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. సన్ ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, గెయిల్, లార్సెన్, హెచ్‌పిసిఎల్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి.

పెరిగిన సైయెంట్ ఆపరేటింగ్ ప్రాఫిట్



హైదరాబాద్: హైదరాబాద్‌కు ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్ రూ.1,187.6 కోట్లతో అత్యధిక త్రైమాసిక రెవెన్యూ వృద్ధిని నమోదు చేసింది. గతేడాదితో పోలిస్తే 20.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.174 కోట్లు, అంటే వార్షికంగా 22 శాతం వృద్ధి నమోదు చేసింది. ఆపరేటిం గ్ మార్జిన్ 14.7 శాతంతో 12 త్రైమాసికాల్లోనే అత్యధికంగా ఉంది. వరుసగా చూస్తే డిసెంబర్ త్రైమాసికంలో తక్కువ వృద్ధిని చూపిందని సంస్థ వెల్లడించింది. రెండో త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం 27 శాతం క్షీణించింది. నికర లాభం కేవలం 6.3 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.87 కోట్లుగా ఉన్న నికర లాభం ఇప్పుడు 92.5 కోట్లకు పెరిగింది. మూడో క్వార్టర్లో ఫలితాలు కాస్త నీరసంగానే ఉంటాయని, సెమీ కండక్టర్, కమ్యూనికేషన్స్ బిజినెస్‌లో నెగిటివ్ వృద్ధి నమోదైందని సంస్థ ఎండి క్రిష్ణ అన్నారు.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	36386.61	12.53	(+0.03%)
నిఫ్టీ	10906.95	1.75	(+0.02%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.18
యూరో	81.08
బ్రిటిష్ పౌండ్	91.64
ఆస్ట్రేలియన్ డాలర్	51.02
కెనెడియన్ డాలర్	53.63
సింగపూర్ డాలర్	52.49
స్విస్ ఫ్రాంక్	71.80
చైనీస్ యువాన్	10.52
మలేషియన్ రింగిట్	17.32
న్యూజిలాండ్ డాలర్	48.14
హాంకాంగ్ డాలర్	9.08
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	234.95
సౌతాఫ్రికన్ రాండ్	5.20

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31000	33155.08	0.26%
ముంబై	31820	34032.09	0.51%
ఢిల్లీ	31750	33957.22	0%
కోల్‌కతా	31990	34213.90	0%
కేరళ	30250	32352.94	0%
బెంగళూరు	30500	32620.32	0%
హైదరాబాద్	31110	33272.73	0.1%
గల్ఫ్	137.45	147.00	-0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42700.00
ముంబై	₹ 42700.00
ఢిల్లీ	₹ 42700.00
కోల్‌కతా	₹ 42700.00
హైదరాబాద్	₹ 42700.00





వస్తున్నా.. కాసుకోండి

ఇ-కామర్స్‌లోకి ముకేశ్ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్

- అమెజాన్, వాల్‌మార్ట్‌లకు గట్టి పోటీనిచ్చేందుకు సిద్ధం
- 12 లక్షల రిటైలర్లు, స్టోర్ ఓనర్లకు ఆన్‌లైన్ షాపింగ్ వేదిక
- త్వరలో ప్రారంభించనున్నామని ముకేశ్ అంబానీ వెల్లడి

గాంధీనగర్: దేశీయ ఇ-కామర్స్ రంగంలో ఇతర దేశాల సంస్థల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ సిద్ధమవుతోంది. ఇ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, వాల్‌మార్ట్‌లకు గట్టి పోటీనిచ్చేందుకు ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ సరికొత్త ప్రణాళికతో వస్తోంది. దేశవ్యాప్తంగా 12 లక్షల రిటైలర్లు, స్టోర్ ఓనర్లకు ఆన్‌లైన్ షాపింగ్ వేదికను రిలయన్స్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా దేశంలో ప్రత్యర్థి ఇ-కామర్స్ సంస్థలకు గట్టి పోటీనివ్వనుంది. జియో టెలికామ్ సేవలు, మొబైల్ ఫోన్లు, రిటైల్ నెట్‌వర్క్‌ను కలపడం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద రిటైలర్లపై తమ సత్తా చూపవచ్చని ఆసియాలో అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ భావిస్తున్నారు. వివిధ రంగాల్లోకి విస్తరించిన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు దూకుడుగా ప్రపంచ వ్యాప్తంగా ఇ-కామర్స్ మార్కెట్‌ను పెంచుకుంటున్నాయని, అక్కడ వ్యవస్థీకృత రిటైల్ అరుదుగా ఉందని అన్నారు. 12 లక్షల చిన్న రిటైలర్లు, దుకాణదారులకు సాధికారత, సంపన్నులను చేయడం కోసం జియో-రిలయన్స్ రిటైల్‌లు అద్భుతమైన కొత్త వాణిజ్య వేదికను ప్రారంభించనున్నామని శుక్రవారం వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో ముకేశ్ తెలిపారు. ఇకామర్స్‌లోకి ప్రవేశం గురించి సంబంధించిన వివరాలను ముకేశ్ క్రమక్రమంగా వెల్లడిస్తున్నారు.



రిలయన్స్ సంస్థలన్నీ ఏకం

వేగంగా వృద్ధిని సాధిస్తున్న జియోకు ప్రస్తుతం 28 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని, అలాగే దేశవ్యాప్తంగా 6500 పట్టణాలు, నగరాల్లో అంబానీకి చెందిన రిటైల్ సంస్థలకు చెందిన ఔట్‌లెట్లు 10 వేల వరకు ఉన్నాయి. జియో యాప్, ఫోన్ల ద్వారా వీరంతా కలిసి పనిచేయనున్నారని గురువారం క్యూ3 ఫలితాలను ప్రకటించిన తర్వాత రిలయన్స్ రిటైల్ టాప్ ఎగ్జిక్యూటివ్ వి సుబ్రమణ్యం తెలిపారు.

ఆన్‌లైన్ నిబంధనలను కఠినతరం

గత నెలలో విదేశీ సంస్థలకు చెందిన ఆన్‌లైన్ రిటైలర్లపై ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. ఇ-కామర్స్ సంస్థలకు సంబంధించి కొన్ని కొత్త నిబంధనలను కేంద్రం ప్రవేశపెట్టింది. ఇకపై ఇకామర్స్ పోర్టళ్లు తమకు లేదా తమ గ్రూపు వ్యాపారాలకు ఈక్విటీ వాటాలున్న కంపెనీలు, సరుకు నిల్వలపై నియంత్రణ కలిగిన కంపెనీలకు చెందిన ఉత్పత్తులను తమ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించేందుకు అనుమతి ఉండదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనితో పాటు ఇకామర్స్ సంస్థలు ప్రకటించే క్యాష్‌బ్యాక్ మొదలగు ఆఫర్లు కూడా సముచితంగా, వివక్షారహితంగా ఉండాలని పేర్కొంది. ఈ నిబంధనల మేరకు వ్యాపారం చేసి గత ఆర్థిక సంవత్సరం గురించి ఓ నివేదికను రూపొందించి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30 కల్లా ఆర్‌బిఐకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనలు 2019 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

డేటా గుత్తాధిపత్యంపై చర్యలు తీసుకోండి

ప్రధాని మోడీని కోరిన ముకేశ్ అంబానీ

భారతీయులకు సంబంధించిన డేటా(సమాచారం)పై ఇతర దేశాల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ప్రధాని నరేంద్ర మోడీ చర్యలు తీసుకోవాలని శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ కోరారు. భారత్ సమాచారం తప్పనిసరిగా దేశీయ సంస్థల వద్దనే ఉండాలని ఆయన అన్నారు. రాజకీయ వలసవాదానికి వ్యతిరేకంగా మహాత్మాగాంధీ ఉద్యమం చేపడితే, సమాచార వలసవాదానికి వ్యతిరేకంగా భారత్ కొత్త ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే పది సంవత్సరాల్లో తమ సంస్థ గుజరాత్‌లో రూ.3లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుందని ప్రకటించారు. ఇక్కడ శుక్రవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్‌లో ముకేశ్ మాట్లాడుతూ, గుజరాత్ ఎప్పటికీ తమ మొదటి ప్రాధ్యాన్యమని అన్నారు. ఈ కొత్త ప్రపంచంలో డేటా అనేది కొత్త సంపద, భారత్‌కు చెందిన డేటాకు భారతీయులే నేతృత్వం వహించాలి. విదేశాల గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవాలని అన్నారు. భారత్‌లో సమాచార విప్లవాన్ని తీసుకురావడంలో విజయం సాధించడానికి భారత్ సంపదపై నియంత్రణ మన వద్దే ఉండాలని వెల్లడించారు. ప్రధాని చేతల మనిషని, డిజిటల్ ఇండియా మిషన్ లక్ష్యాల్లో దీన్ని చేర్చుతారని ముకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



గ్రామీణ ప్రాంతాల్లో

మార్కెటే లక్ష్యం

'ఫిన్‌కేర్' ఎస్‌ఎఫ్‌బి ప్రారంభోత్సవంలో సిఎండి రాజీవ్ యాదవ్



మన తెలంగాణ/ హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్‌ను పెంచుకోవడమే లక్ష్యంగా 'ఫిన్‌కేర్' స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(ఎస్‌ఎఫ్‌బి) తెలంగాణ రాజధానిలోకి ప్రవేశించింది. ఈ సంస్థ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో తన మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలను ప్రారంభించింది. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా ఈ సంస్థ సేవలను అందిస్తోంది. తాజాగా బంజారాహిల్స్‌లో ప్రారంభించిన బ్రాంచ్.. తెలంగాణలో పూర్తిస్థాయి బ్రాంచ్ అని మీడియా సమావేశంలో ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ యాదవ్ తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్‌పై 'ఫిన్‌కేర్' దృష్టి పెట్టిందని బ్యాంక్ ప్రమోటర్ జి.దశరథ్ రెడ్డి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో 2007లో ఈ సంస్థ మైక్రోఫైనాన్స్ కార్యకలాపాలను ప్రారంభించి ఇప్పుడు విస్తరణ దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. ఎన్‌ఆర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 9 శాతం వరకు వార్షిక వడ్డీ, సీనియర్ సిటిజెన్ ఎఫ్‌డిలపై 9.5 శాతం, సేవింగ్ ఖాతాలపై 7 శాతం వార్షిక వడ్డీని బ్యాంక్ అందిస్తోంది. ముంబై, ఢిల్లీ, కొచ్చి వంటి నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ బ్యాంక్ దేశంలోని 10 ముఖ్య మెట్రోపాలిటన్ నగరాలకు గాను 8 చోట్ల బ్రాంచ్‌లను కలిగి ఉంది. తెలంగాణలో తొలి బ్రాంచ్‌ను ప్రారంభించిన ఫిన్‌కేర్‌కు 532 ఔట్‌లెట్లు ఉన్నాయి. దేశంలోని 11 రాష్ట్రాల్లో, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 14 లక్షల మంది ఖాతాదారులు ఉన్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకు 5200 మంది ఉద్యోగులను కలిగివుంది.

అంచనాలను మించిన విప్రో

క్యూ3లో నికర లాభం రూ.2,544కోట్లు • గతేడాది త్రైమాసికంతో పోలిస్తే 32 శాతం అప్ • 1:3బోనస్ షేరు ఆఫర్

న్యూఢిల్లీ: దేశీయ ఐటి దిగ్గజం విప్రో క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాల్లో అంచనాలను మించి రాణించింది. కంపెనీ నికర లాభం రూ.2,544.5 కోట్లకు పెరిగిందని తెలిపింది. ఆటోమేషన్‌లో పెట్టుబడులు, బలహీన త్రైమాసికంలోనూ మెరుగైన పురోగతి కారణంగా మంచి లాభాలను నమోదు చేసింది. గతంలోని ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం 31.8శాతం పెరిగినట్లు సంస్త వెల్లడించింది. 2017 డిసెంబరు నాటి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.1930 కోట్లుగా ఉంది. కంపెనీ లాభాలు సాధించిన సందర్భంగా కంపెనీ బోనస్ షేర్లను ఆఫర్ చేసింది. మూడు షేర్లు ఉన్న షేర్‌హోల్డర్‌కు ఒక బోనస్ షేరు ఇస్తున్నట్లు తెలిపింది. వ్యూహాత్మక పెట్టుబడులు, వినియోగదారులతో మెరుగైన సంబంధాల కారణంగా ఈ త్రైమాసిక ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని విప్రో సిఇఒ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబిదాలి నీముచ్‌వాల అన్నారు. విప్రో కార్యకలాపాల ఆదాయం గతంతో పోలిస్తే 10.17 శాతం పెర్గా, 2018 డిసెంబరు నాటికి ముగిసిన త్రైమాసికంలో రూ.15,059.5కోట్ల ఆదాయం వచ్చింది. కాగా గతేడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ.13,669 కోట్లుగా ఉంది. ఐటి సేవల నుంచి రూ.14,555కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ తెలిపింది.





శుక్రవారం న్యూఢిల్లీలో కామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న టొయొటా కిర్లోస్కర్ మోటార్ ఎండి మసకజు యోషిమురా

త్వరలో దివాలా చట్టానికి మరింత పదును

ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్



న్యూఢిల్లీ: త్వరోల దివాలా చట్టంలో కీలక మార్పులు చేట్టి, త్వరగా సమస్య పరిష్కారమయ్యేలా, మరింత సమర్థవంతంగా చట్టాన్ని రూపొందించనున్నారు. ఈ చట్టంలో సెక్షన్ రుణ పరిష్కార ప్రక్రియ కింద నిర్వహించే వేలానికి సదరు సంస్థకు సంబంధించిన ప్రమోటర్లు, వారి కుటుంబ సభ్యులను దూరంగా ఉంచుతుంది. ఇప్పటికే ఈ సెక్షన్‌కు సంబంధించి పలు వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్‌బిఐ చైర్మన్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ, దివాల చట్టంలోని సెక్షన్ 29ఎ పరిధి చాలా విస్తృతం గా ఉందని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాల్సి ఉందని, సంస్థ దివాలాకు కారణమైన వ్యక్తులు మళ్లీ కీలక పదవుల్లో చేరకూడదనేది ఈ సెక్షన్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సెక్షన్‌పై స్పష్టతనివ్వాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ సెక్షన్ సమస్యాత్మకంగా మారిందన్నారు. ఆలస్యంగా బిడ్డింగ్‌లో పాల్గొనేవారిపై కూడా ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొన్ని నెలల పాటు బిడ్డింగ్ ప్రక్రియ జరిగినా వారు మౌనంగా ఉంటారని, అంతా ముగిశాక రూ.15వేల కోట్లకు బిడ్ ఖరారైతే రూ.16వేల కోట్లు చెల్లిస్తామంటూ వస్తారని, దీనివల్ల బిడ్డింగ్ ప్రక్రియ దెబ్బతింటుందని రజనీష్ అన్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
రిలయన్స్	1,189.90	1,135.25	1,184.35	1,134.45	49.90	4.40
విప్రో	347.50	333.40	346.15	335.40	10.75	3.21
కోటాక్ మహీంద్ర	1,243.00	1,216.50	1,240.20	1,219.95	20.25	1.66
హిండల్కో	209.40	205.95	208.80	206.00	2.80	1.36
హెచ్‌సిఎల్ టెక్	968.75	946.35	966.30	954.70	11.60	1.22
ఆదాని పోర్ట్స్	399.95	392.25	399.30	394.50	4.80	1.22
ఒఎన్‌జిసి	147.70	145.10	146.75	145.00	1.75	1.21
ఎసియన్ పెయింట్స్	1,404.75	1,383.00	1,400.45	1,389.60	10.85	0.78
వేదాంతా	200.00	196.25	198.70	197.45	1.25	0.63
టెక్ మహీంద్రా	714.20	702.35	709.15	705.55	3.60	0.51

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
సన్ ఫార్మా	424.10	370.20	390.75	426.55	35.80	8.39
భారతీ ఎయిర్‌టెల్	332.45	304.30	311.15	332.05	20.90	6.29
గెయిల్	332.85	320.50	322.15	332.40	10.25	3.08
లార్సెన్	1,352.00	1,313.00	1,317.90	1,346.05	28.15	2.09
హెచ్‌పిసిఎల్	245.35	238.25	239.50	244.20	4.70	1.92
యాక్సిస్ బ్యాంక్	676.05	661.45	664.60	676.65	12.05	1.78
బజాజ్ ఫిన్సర్వ్	6,379.95	6,230.00	6,249.90	6,359.00	109.10	1.72
ఎస్ బ్యాంక్	203.05	196.20	198.60	201.50	2.90	1.44
ఎయిచర్ మోటర్స్	20,425.00	19,950.00	20,122.75	20,369.95	247.20	1.21
జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్	291.85	283.25	285.60	289.00	3.40	1.18

‘పింక్’ తమిళ్ రీమేక్‌లో ప్రత్యేక పాత్రలో కనిపించబోతున్నా. ఇందులో నాది చాలా చిన్న పాత్ర. రీమేక్‌లలో నటించడం నాకు ఇష్టం లేదు.కానీ నిర్మాత బోనీకపూర్ కోసమే ఈ సినిమా చేస్తున్నా.
– బాలీవుడ్ నటి విద్యాబాలన్

సినిమా


వెంకటేష్

కొత్త కిక్ ఇచ్చిన సక్సెస్

టాలీవుడ్‌లోని నలుగురు సీనియర్ స్టార్లలో వెంకటేష్‌ది ప్రత్యేక స్థానం. సబ్జెక్ట్ నచ్చితే చాలు ఎలాంటి రిస్క్ చేయడానికైనా సిద్ధం అనే తత్వం వల్లే ఆయన ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. సరైన కథ పడితే చాలు కుటుంబాలను థియేటర్లకు రప్పించడంలో వెంకీ స్టైలే వేరు. 15 ఏళ్ల క్రితమే ఫ్యామిలీ కథలతో పలు విజయవంతమైన చిత్రాలు చేశారు ఈ సీనియర్ స్టార్. వర్తమానానికి వస్తే వెంకటేష్ ట్రాక్ రికార్డు గత కొన్నేళ్లుగా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. ‘దృశ్యం’ చిత్రంలో టీనేజ్ అమ్మాయి తండ్రిగా ‘గురు’లో మధ్యవయసు దాటిన బాక్సింగ్ కోచ్‌గా ఈ సీనియర్ స్టార్ వైవిధ్యాన్ని ప్రదర్శించడంతో మంచి ఫలితాలే వచ్చాయి. అయితే అతని అభిమానులు పూర్తిగా సంతృప్తి చెందలేదు. ఇలా అన్ని వయసుమీరిన పాత్రలు చేయడం ఏమిటని బాధపడ్డారు. అయితే ‘ఎఫ్2’ చిత్ర విజయంతో అభిమానులు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ సినిమా ఫస్టాఫ్‌లో వెంకీ చెలరేగిపోయిన తీరు మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ చిత్రాల రోజులని గుర్తుకుతెచ్చింది. ‘ఎఫ్2’ సూపర్ హిట్‌గా నిలవడంతో వెంకటేష్‌తో సినిమాలు చేసేందుకు దర్శక నిర్మాతలు ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ఇక వెంకటేష్‌తో ‘వెంకీ మామ’ చిత్రాన్ని ప్రారంభించబోతున్న దర్శకుడు బాబీ, ఈ సీనియర్ స్టార్‌తో స్టోరీ లైన్ ఓకే చేయించుకున్న దర్శకుడు త్రినాథరావు, ఇంతకుముందే ఓ సినిమాకు కమిట్‌మెంట్ తీసుకున్న త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో పాటు నిర్మాతలకు ‘ఎఫ్2’ సక్సెస్ కొత్త కిక్ ఇచ్చింది. ఈ చిత్రంలో మిల్కీబ్యూటీ తమన్నా వెంకటేష్ పక్కన మంచి ఛాయిస్‌గా కనిపించింది కాబట్టి మిగిలిన హీరోయిన్లు కూడా ఈ సీనియర్ స్టార్‌తో నటించేందుకు ఓకే చెబుతారు. మొత్తానికి వెంకటేష్ సక్సెస్ ట్రాక్‌లో పడడంతో అభిమానులు ఎంతో సంతోషంగా ఉన్నారు.


నాగచైతన్య



క్రేజీ కాంబినేషన్‌లో

బంగార్రాజు

నాగార్జున కెరీర్‌లో ‘సోగ్గాడే చిన్ని నాయనా’ చిత్రం ఓ మంచి హిట్‌గా నిలిచింది. మూడు సంవత్సరాల క్రితం వచ్చిన ఈ చిత్రంలో ఈ సీనియర్ స్టార్ ద్విపాత్రాభినయం చేసి ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. ఇందులో నాగార్జున చేసిన బంగార్రాజు పాత్ర హైలైట్‌గా నిలిచింది. అయితే అప్పట్లోనే ఈ చిత్రానికి సీక్వెల్‌గా ‘బంగార్రాజు’ చేయాలని ప్లాన్ చేశారు. అప్పటి నుంచి నలుగుతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు వర్కవుట్ అయ్యేటట్టు కనిపిస్తోంది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. అంతా అనుకుంటున్నట్టు ఇది నాగార్జున సినిమా మాత్రమే కాదు. ఇందులో నాగచైతన్య కూడా కనిపించబోతున్నారు. నాగార్జున, చైతన్య కాంబినేషన్‌లో రాబోతోంది ‘బంగార్రాజు’. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కథలో చేయాల్సిన మార్పులన్నీ చేశాడు. నిజ జీవితంలో తండ్రి, కొడుకులైన నాగార్జున, నాగచైతన్య ఈ సినిమాలో మాత్రం తాత, మనవడు పాత్రల్లో కనిపించబోతున్నారు. నాగచైతన్య చేయాల్సిన ‘వెంకీ మామ’ సినిమా పూర్తయిన తర్వాత ‘బంగార్రాజు’ సినిమా సెట్స్‌పైకి వస్తుందట. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

ఆద్యంతం ఓల్డ్ గెటప్‌లోనే

1996లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘భారతీయుడు’ చిత్రం తెలుగు, తమిళ్, హిందీలో ఘన విజయం సాధించింది. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో దేశవ్యాప్తంగా ఓ సంచలనం. ఈ చిత్రంలోని నేతాజీ పాత్రను యూత్ ఆదర్శంగా తీసుకున్నారు. లంచంపై పోరాడేందుకు యువతరం ముందుకు వచ్చింది. అప్పట్లో పెను సంచలనం సృష్టించిన ‘భారతీయుడు’ సినిమాకు సీక్వెల్‌గా ఇప్పుడు ‘ఇండియన్ 2’ రాబోతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శంకర్ మాట్లాడుతూ ‘‘నా కాలేజీ రోజుల్లో జరిగిన ఒక సంఘటన వల్లే ‘భారతీయుడు’ సినిమాను తీశాను. కాలేజీలో ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అడిగితే ప్రభుత్వ ఆఫీస్‌కు నా తల్లిదండ్రులతో కలిసి వెళ్లాను. అక్కడి సిబ్బంది ఈ సర్టిఫికెట్లను ఇచ్చేందుకు లంచం అడిగారు. ఈ సంఘటన నన్ను కదిలించింది. ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకొని ‘భారతీయుడు’ను తెరకెక్కించాను’’అని చెప్పారు. ఇక ‘భారతీయుడు’ సినిమాలో మాదిరిగానే ‘ఇండియన్ 2’లో కూడా ఓల్డ్ మ్యాన్ పాత్ర ఉంటుందని ఫస్ట్‌లుక్‌తోనే తెలిసిపోయింది. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రారంభం సందర్భంగా కూడా కమల్ ఓల్డ్‌మ్యాన్ గెటప్‌లో కనిపించారు. ఈ చిత్రంలో ఆద్యంతం కమల్ ఇలాగే ఓల్డ్ గెటప్‌లో కనిపిస్తారని తెలిసింది. ‘భారతీయుడు’ సినిమాలో కమల్ తండ్రి, కొడుకులుగా కనిపించారు. కానీ ఈ సినిమాలో మాత్రం తండ్రి పాత్రలోనే కనిపిస్తారు. కొడుకు పాత్ర మొదటి పార్టులో మరణించిన విషయం తెలిసిందే. శంకర్ ఈ చిత్రాన్ని వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.


కమల్‌హాసన్

మెగా ఆఫర్ కోసం...

చిరంజీవి నటిస్తున్న ‘సైరా’ సినిమా షూటింగ్ చకచకా సాగుతోంది. అది పూర్తయిన తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో ఈ మెగాస్టార్ తన నెక్స్ట్ మూవీ చేస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారు కొరటాల. ఈ సినిమాలో ఎవరు హీరోయిన్‌గా చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే చిరంజీవితో కాజల్ హీరోయిన్‌గా చేసేసింది. ‘సైరా’లో నయనతార నటిస్తోంది. ఇప్పుడు హీరోయిన్‌గా ఎవరిని తీసుకుంటారా? అని ప్రేక్షకులు, అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే కొరటాల శివ సీనియర్ హీరోయిన్ అనుష్కను ఈ సినిమా కోసం పరిశీలిస్తున్నారని తెలిసింది. కానీ ఆమె ఈమధ్య లావుగా మారడంతో కొంత ఇబ్బందిగా మారింది. అందుకే కొరటాల ఓ కండీషన్ పెట్టారట. మార్చి తర్వాత షూటింగ్ ప్రారంభమయ్యేలోగా అనుష్క వీలైనంత బరువు తగ్గి నాజూకుగా తయారు కావాలన్నది ఆ కండీషన్. ప్రస్తుతం అనుష్క చేతిలో ఓ సినిమా ఉంది. మాధవన్ హీరోగా కోనవెంకట్, పీపుల్స్ మీడియా నిర్మించే సినిమా ఇది. అది పట్టాల మీదకు రావడానికి ఇంకా సమయం ఉంది. అందుకే ఇప్పుడు అనుష్క బరువు తగ్గే ప్రయత్నంలో ఉందని తెలిసింది. నాజూకుగా తయారయ్యేందుకు ఆమె వర్కవుట్స్ చేస్తోందట. అనుష్క సన్నగా మారితేనే చిరంజీవి పక్కన ఆమె హీరోయిన్‌గా కనిపించే అవకాశం లభిస్తుంది.


అనుష్క



యువ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్

షార్ట్‌ఫిల్మ్స్‌తో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న విరించి వర్మ ‘ఉయ్యాల జంపాల’ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించి అతనికి విమర్శకుల ప్రశంసలను తెచ్చిపెట్టింది. అయితే అతని రెండవ సినిమా ‘మజ్ను’ మాత్రం పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకొని మూడవ సినిమాకు సిద్ధమయ్యాడు ఈ యువ దర్శకుడు. అతను తన మూడవ సినిమాను హీరో కల్యాణ్‌రామ్‌తో చేయబోతున్నట్లు తెలిసింది. విరించి వర్మ చెప్పిన కథకు ఈ కథానాయకుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని... త్వరలోనే ఈ సినిమాను పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఒప్పుకున్న సినిమాలను పూర్తిచేసిన తర్వాత కల్యాణ్‌రామ్ ఈ సినిమాను మొదలుపెట్టే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రాధాకృష్ణ నిర్మించే అవకాశం ఉంది.

ముచ్చటగా మూడోసారి

కెరీర్ ప్రారంభంలో యంగ్ హీరో నాగశౌర్యకు ‘ఊహలు గుసగుసలాడే’ చిత్రం మంచి సక్సెస్‌ను అందించింది. కమేడియన్‌గా అప్పటివరకు మంచి పేరు తెచ్చుకున్న అవసరాల శ్రీనివాస్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యాడు. నాగశౌర్యకు మంచి బ్రేక్ ఇచ్చిన ఈ చిత్రం ద్వారా రాశీఖన్నా హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయమైంది. ఈ చిత్రం తర్వాత మరోసారి నాగశౌర్య, అవసరాల శ్రీనివాస్ కాంబినేషన్‌లో ‘జో అచ్యుతానంద’ సినిమా తెరకెక్కింది. ఈసారి నారా రోహిత్ వీరితో కలిశాడు. తక్కువ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం మంచి లాభాలను తెచ్చిపెట్టింది. ఇక ప్రస్తుతం వీరి కాంబినేషన్‌లో మూడవ సినిమా రాబోతోందని తెలిసింది. నాగశౌర్య కోసం ఓ మంచి కథను అవసరాల శ్రీనివాస్ సిద్ధం చేశాడు. ఓ ప్రముఖ నిర్మాత వీరి కాంబో మూవీని నిర్మించేందుకు ఓకే అన్నారని సమాచారం.


నాగశౌర్య

గట్టిగా వార్నింగ్ ఇస్తోంది

వీరనారి ఝాన్సీ లక్ష్మీ భాయ్ జీవిత కథ ఆధారంగా రూపొందిన ‘మణికర్ణిక’ చిత్రం ఈనెల 25న విడుదల కానుంది. ఇక ఎప్పటిలాగే ఇలాంటి చారిత్రాత్మక సినిమాలకు వచ్చే బెదిరింపులు దీనికి కూడా వస్తున్నాయి. మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన విడుదలకు ముందే తమకు ఈ చిత్రాన్ని చూపించాలని అంటోంది. ఓ బ్రిటీష్ ఆఫీసర్‌తో లక్ష్మీ భాయ్ ప్రేమాయణాన్ని ఇందులో చూపినట్టు అనుమానం ఉందని... అందుకే సినిమాను తమకు చూపించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది. గత ఏడాది సరిగ్గా ఇదే సమయంలో దీపికా పదుకునే చిత్రం ‘పద్మావత్’ ఇంతకంటే చేదు అనుభవాలను ఎదుర్కొంది. ఇప్పుడు ‘మణికర్ణిక’కు అదే పరిస్థితి ఎదురవుతోంది. అయితే అప్పుడు సంజయ్‌లీలా భన్సాలీ తరహాలో ఇప్పుడు కంగనా వీటికి బెదిరిపోవడం లేదు. తాను రాజ్‌పుత్ వంశానికి చెందిన దాన్నేనని... తన సినిమాను ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే లేపేస్తానని గట్టిగా వార్నింగ్ ఇస్తోంది. అంతే కాదు విడుదలకు ఎవరు అడ్డు వచ్చినా ప్రతి ఒక్కరి అంతు చూస్తానని ఘాటుగా బదులిస్తోంది. కంగనా రనౌత్ మొండి ధైర్యం చూసి ఇండస్ట్రీ పెద్దలు కూడా షాక్ అవుతున్నారు.


కంగనారనౌత్

షాకిచ్చిన ప్రియాంక


బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా ఇటీవల అమెరికన్ పాప్ సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌ను పెళ్లాడి కొత్త జీవితాన్ని మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. పెళ్లయిన తర్వాత తొలిసారిగా ఈ భామ ఓ టివి లైవ్ షోలో పాల్గొంది. తాజాగా ‘ఎలెన్ డిజైనర్స్ టివి షో’లో ప్రియాంక ప్రత్యక్షమై పెద్ద సర్‌ప్రైజ్‌నే ఇచ్చింది. ఈ టివి షోలో ఆమె టకీలా అనే అరుదైన మత్తు పానీయాన్ని పుచ్చుకొని అందరికీ షాకిచ్చింది. మీరు రెగ్యులర్ తీసుకునే పానీయమేది? అని హోస్ట్ తనను ప్రశ్నిస్తే... రెడ్ వైన్ అంటూ వెంటనే ప్రియాంక సమాధానమిచ్చింది. ఇండియన్ల ఫేవరేట్ పానీయం రెడ్ వైన్ అని చాలా చక్కగా చెప్పింది. ఇక పిసి ఇప్పటికే పలు టివి షోలలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఓవైపు హాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు ప్రఖ్యాత టివి ఛానళ్ల లైవ్ ఇంటర్వ్యూల్లోనూ సందడి చేస్తోంది ఈ బ్యూటీ. హాలీవుడ్‌లో రెండేళ్లుగా సాగిస్తున్న పయనం, వ్యక్తిగత జీవితం గురించి ప్రియాంక చోప్రా ఈ కార్యక్రమంలో ముచ్చటించింది. ఈనెల 30న వరల్డ్‌వైడ్ ఈ టివి షోను ప్రసారం చేయనున్నారని తెలిసింది. ఇక పిసి నటించిన ‘ఏ కిడ్ లైక్ జేక్’ చిత్రం జూన్‌లో విడుదల కానుంది.


ప్రియాంక చోప్రా

ముస్తాబవుతున్న మహాలక్ష్మి

తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘దట్ ఈజ్ మహాలక్ష్మి’ షూటింగ్ పూర్తి చేసుకుంది. సాధారణ యువతి నుంచి అసాధారణ మహిళగా ఆమె ఎలా మారుతుందనే కథతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈమధ్యే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. త్వరలోనే ఫిల్మ్‌మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. అమిత్ త్రివేది సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి మైఖేల్ ట్యూబ్యరియస్ సినిమాటోగ్రాఫర్. మెడైంటే ఇంటర్నేషనల్ బ్యానర్‌పై మను కుమరన్ ప్రొడక్షన్‌లో ఈ చిత్రం వస్తోంది. టైజాన్ ఖొరాకివాలా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నటి పరుల్ యాదవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా ఉన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: గౌతం రాజు, కొరియోగ్రఫీ: బాస్కో సీజర్.





న్యాయ, ఆత్మగౌరవ ఉద్యమాలు


- ఇ.వి.ఆర్ మణియమ్మన్ అనే మహిళను వివాహమాడాడు. దీనితో ద్రావిడ కజగం పార్టీలో చీలిక ఏర్పడింది.
- 1949లో అన్నాదురై ద్రావిడ కజగం పార్టీ నుండి బయటకు వచ్చి ద్రావిడ మున్నేట్ర కజగం (డి.ఎం.కె) అనే పార్టీని స్థాపించాడు.
- డి.ఎం.కె కూడా ద్రావిడ నాడును డిమాండ్ చేసింది.
- 1962లో చైనా దాడి తరువాత తమిళ ప్రజలు తమ ద్రావిడ నాడు డిమాండ్‌ను విరమించుకున్నారు.
- అన్నాదురైకు ప్రధాన అనుచరులు – కరుణానిధి, ఎం.జీ. రామచంద్రన్ (ఎం.జి.ఆర్).
- అన్నాదురై మరణానంతరం కరుణానిధి డి.ఎం.కెకు నాయకత్వం వహించారు.
- దీనితో 1972లో ఎం.జీ. రామచంద్రన్ డి.ఎం.కె నుంచి బయటకు వచ్చి 'ఆల్ ఇండియా అన్నా డి.ఎం.కెను స్థాపించాడు.
- తమిళనాడులోని డి.ఎం.కె, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె రెండు రాజకీయ పార్టీలు కూడా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ఖండించేవి.

జాతీయోద్యమం

- 1885 డిసెంబర్ 28న బొంబాయిలోని గోకుల్‌దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్'ను ఎ.ఓ.హ్యూమ్ ఏర్పాటు చేయటంతో జాతీయోద్యమం (మితవాద యుగం) ప్రారంభమైంది.
- ఇండియన్ నేషనల్ యూనియన్‌కు కాంగ్రెస్ అనే పదాన్ని సూచించిన వాడు – దాదాబాయి నౌరోజి.
- 1) మితవాదులు : 1885 – 1905
- 2) అతివాదులు : 1905 – 1919/20
- 3) విప్లవాత్మక తీవ్రవాదులు : 1897 – 1931
- 4) వామపక్షాలు : 1936– 1939
- 5) గాంధీ యుగం : 1919/20– 1947

INCకి ముందున్న సంస్థలు

- 1. లాండ్‌హోల్డర్స్ సొసైటీ –1838 – కలకత్తా, ద్వారకానాథ్ ఠాగూర్.
- 2. బ్రిటీష్ ఇండియా సొసైటీ –1839 – లండన్, విలియం ఆడమ్స్
- 3. బెంగాల్ బ్రిటీష్ ఇండియా సొసైటీ –1843 – కలకత్తా, దేవేంద్రనాథ్ ఠాగూర్
- 4. బ్రిటీష్ ఇండియా అసోసియేషన్ –1851 – కలకత్తా, దేవేంద్రనాథ్ ఠాగూర్
- 5. మద్రాస్ నేటివ్ అసోసియేషన్ –1852 – మద్రాస్, గాజుల లక్ష్మీ నరసుశెట్టి.
- 6. బొంబాయి అసోసియేషన్ –1852 – బొంబాయి, జగన్నాథ్ శంకర్ శేఠ
- 7. ఈస్ట్ ఇండియా అసోసియేషన్ –1866 – లండన్, దాదాబాయ్ నౌరోజీ
- 8. నేషనల్ ఇండియన్ అసోసియేషన్ –1867 – లండన్, మేరీ కార్పెంటర్
- 9. ఇండియన్ సొసైటీ –1872 – లండన్, ఆనంద్‌మోహన్‌బోస్
- 10. ఇండియన్ అసోసియేషన్ –1876 – కలకత్తా, ఎస్.ఎన్.బెనర్జీ, ఆనంద్‌మోహన్‌దాస్
- 11. మద్రాస్ మహాజనసభ –1884 – మద్రాస్, వీరరాఘవాచారి, సుబ్రహ్మణ్య అయ్యార్, పి. ఆనందాచార్యులు, రంగయ్యనాయుడు.





- 12. దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ –1884 – పూనె – జి.జి. అగార్కర్
- 13. బాంబే ప్రెసిడెన్సీ అసోసియేషన్ –1885 – బొంబాయి, ఫిరోజ్‌షా మెహతా, బద్రుద్దీన్‌త్యాబ్జి, టి.కె. తెలాంగ్.

INC ఆవిర్భవించిన తర్వాత ఏర్పడిన సంస్థలు



- **పద్ధతులు :** ppp (Pray, Petition, Protest) ప్రార్థన విజ్ఞాపన నిరసన.
- వార్తాపత్రికలు ప్రచురించుట.
- పుస్తకాలు రచించుట
- పట్టణాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రసంగాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించుట.

- **సంస్థలు :** ఈస్ట్ ఇండియా అసోసియేషన్ – లండన్‌లో
- పార్శీ రీఫార్మ్ అసోసియేషన్ (మహారాష్ట్రలో – పార్శీల సంస్కరణల కొరకు).
- INC కి 3సార్లు అధ్యక్షుడైన మొట్టమొదటివాడు – దాదాభాయ్ నౌరోజి. (1886– కలకత్తా, 1893 – లాహోర్, 1906 – కలకత్తా)

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

- 1906 కలకత్తా INC సమావేశంలో నౌరోజి అధ్యక్షతన 4 తీర్మానాలు ఆమోదించబడ్డాయి.
- **అవి :** 1) స్వరాజ్య తీర్మానం, 2) స్వదేశీ తీర్మానం 3) బహిష్కరణ తీర్మానం, 4) జాతీయ విద్య తీర్మానం
- నౌరోజీ లండన్‌లో ప్రిన్స్‌బెరీ నియోజకవర్గం నుంచి లిబరల్ పార్టీ తరపున (1892) పోటీ చేసి బ్రిటీష్ పార్లమెంటు (House of commons – దిగువసభ) కు ఎన్నికయ్యాడు. (ఎగువ సభ – House of Lords)

సురేంద్రనాథ్ బెనర్జీ

- **బిరుదులు :** ఇండియన్‌బర్క్, జాతిగురు, ఇండియాసిసిరో, ఇండియా డెమస్థనీస్, దేశకోత్తమ, Silver tongue orator,
- **పుస్తకం :** A Nation in the making (ఆత్మకథ)
- **సంస్థ :** 1876 ఇండియన్ అసోసియేషన్ ఆనంద మోహన్‌బోస్‌తో కలిసి ఏర్పాటు చేశాడు.
- SN బెనర్జీ ఒక ICS (Indian civils service) (1869) అధికారి.
- జాతీయ ఉద్యమంలో కీలకంగా పాల్గొంటున్నాడు అనే నెపంతో బ్రిటీష్

నిర్బంధ ప్రాథమికవిద్య కావాలన్న తొలి వ్యక్తి?

- 1. 1887 – నేషనల్ సోషల్ కాన్ఫరెన్స్ – ఎం.జి. రణడే
- 2. 1888 – యునైటెడ్ ఇండియా పాట్రియాటిక్ అసోసియేషన్ – సర్‌సయ్యద్ అహ్మద్‌ఖాన్ (అలీఘడ్).
- 3. 1889 – బ్రిటీష్ కమిటీ ఆఫ్ ఐ.ఎన్.సి. – ఏ.ఓ. హ్యూమ్ దాదాబాయ్ నౌరోజి, వెడిన్‌బర్న్ – లండన్. ఇది 1890లో 'ఇండియా' అనే జర్నల్‌ను డిగ్బి సంపాదకీయంలో ప్రచురించింది.
- 4. 1911– సోషల్ సైన్స్ లీగ్ – ఎన్.జి చంద్రవార్కర్ – లాహోర్.
- 5. 1925 – సి.పి.ఐ. సత్యభక్త – కాన్పూర్.
- 6. 1927 – ఆలిండియా ఉమెన్ కాన్ఫరెన్స్ – సదాశివఅయ్యంగార్ (మద్రాస్)
- 7. 1939 – ఇండియా పార్టీ బోల్షివిక్ – ఎన్.డి. మజుందార్ (కలకత్తా)
- 8.1940 – రాడికల్ డెమోక్రటిక్ పార్టీ – ఎమ్.ఎన్. రాయ్.

మితవాద యుగం (1885-1905)

- భారతదేశంలో జాతీయ ఉద్యమం లేదా మితవాద ఉద్యమం 1885లో ఐఎన్‌సి ఏర్పాటు ప్రారంభమైనది.
- **లక్ష్యాలు :** బాధ్యతాయుతమైన ప్రభుత్వం.
- వయోజన ఓటు హక్కు.
- గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఎక్కువగా భారతీయులు ఉండుట.
- భారతీయులు సివిల్ సర్వీసెస్‌లో ఎక్కువగా ఉండుట.
- భారతదేశంలోని అనేక ప్రాంతాలలో ఉన్న వెనుకబాటుతనానికి గల కారణాలు తెలుసుకొని వాటి అభివృద్ధి కొరకు చర్యలు తీసుకొనుట.
- దక్షిణాఫ్రికాలో భారతీయుల స్థితిగతులను మెరుగుపరచాలి, మిలటరీపై ఖర్చు తగ్గించాలి.

గోపాలకృష్ణ గోఖలే

- **బిరుదులు** – మహారాష్ట్ర సోక్రటీస్, మహారాష్ట్ర రత్నం, భారతీయవజ్రం, ఆధునిక భారతదేశ తొలి రాజనీతిజ్ఞుడు (కె. ఎం. ఫణిక్కర్), భారత జాతీయోద్యమ పితామహుడు.
- **వార్తా పత్రిక** – సుధారక్
- జి.జి. అగార్కర్ కూడా సుధారక్ పత్రికను మహారాష్ట్రలో ప్రచురించాడు.
- **పుస్తకం :** 'The principles of political science'
- **సంస్థ :** 'The Servents of India society' (1905 బొంబాయిలో)
- గోఖలే గురువు – మహాదేవ గోవింద రణడే.
- గాంధీజీ యొక్క రాజకీయ గురువు – గోఖలే.
- నిర్బంధ ప్రాథమికవిద్యను డిమాండ్ చేసిన మొట్టమొదటి వ్యక్తి – గోఖలే. (భారతదేశ సంస్థానంలో బరోడా మొట్టమొదటిసారిగా నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టింది.)

దాదాభాయ్ నౌరోజి


- ఐఎన్‌సికు కాంగ్రెస్ అనే పదాన్ని తొలిసారిగా సూచించాడు. (అంతకు ముందుIndianNationalUnion)ద్యాన్‌ప్రకాశ్‌మండలినిస్థాపించాడు.
- **బిరుదులు :** భారతదేశ కురువృద్ధులు
- First Economist of India/ మొదటి ఆర్థికవేత్త
- Father drain theory
- First Indian British Parliamentrarian.
- **వార్తాపత్రికలు :** Voice of India (లండన్‌లో ఇంగ్లీషులో)
- రాస్ట్‌గోఫ్తర్ (మహారాష్ట్రలో – పార్శీ భాషలో)
- **పుస్తకము :** Poverty and Unbritish Rule in India – 1901, Debt to India.

SN బెనర్జీని ICS నుండి తొలగించినది.

- ఇండియన్ అసోసియేషన్ ద్వారా భారతీయులు ICS పరీక్షలు రాసేవిధంగా ప్రోత్సాహాన్ని కల్పించాడు. కలకత్తాలో 'రిప్పన్ కాలేజి'ని స్థాపించాడు.
- ఇండియన్ అసోసియేషన్ యొక్క శాఖ అయిన Indian national confererrence బ్రిటీష్ వద్ద నుండి పరిపాలనా సంస్కరణలను డిమాండ్ చేసింది.
- 1905 బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా విభజన ఉద్యమాలను మొట్టమొదటిసారిగా SN బెనర్జీ కృష్ణకుమార్ మిత్రాలు ప్రారంభించారు. (KK మిత్రా యొక్క సంజీవని వార్తా పత్రికలో మొదటిసారిగా Boycutt / బహిష్కరణ అనే పదం పేర్కొనబడినది)
- 1917 ఆగస్టు డిక్లరేషన్ (1919 చట్టానికి సంబంధించినది)ను సమర్థిస్తూ 1918లో 'నేషనల్ లిబరల్ పార్టీ'ని ఏర్పాటు చేస్తాడు.

ఆనందమోహన్ బోస్

- 1905 బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా కలకత్తా సమావేశానికి అధ్యక్షత వహించాడు.
- ఈ సమావేశం తర్వాత కలకత్తాలోని టౌన్‌హాల్ వద్ద శంకుస్థాపన చేసి బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమాలను, వందేమాతరం, స్వదేశీ ఉద్యమాలను బెంగాల్ అంతటా వ్యాప్తిచేయుటకు నిర్ణయించాడు.
- మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ (1888–1958) 11–11–1888లో సౌదీ ఆరేబియాలో జన్మించాడు.
- **వార్తా పత్రికలు :** 1) అల్‌హిలాల్, 2) బిల్‌హిలాల్, 3) గబ్బర్ – ఇ–ఖాదీర్ 4) ఆల్‌బలగ్
- **పుస్తకం :** Indian wins freedom





ప్రయోగశాలలో రక్తనాళాల తయారీ

శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో కచ్చితమైన మానవ రక్తనాళాలను మొట్టమొదట సారి తయారు చేయ గలిగారు. ఫలితంగా డయాబెటిస్ తోపాటు రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులను నివారించడానికి తగిన మార్గం దొరికినట్టయింది. దీనివల్ల కొత్తగా మందులను తయారు చేయడానికి వీలు కలుగుతుంది. మూలకణాల నుంచి రక్తనాళాలను అవయవాలుగా మార్చ గలిగే సామర్థ్యం చేకూరడంతో అనేక రకాల రక్తనాళాల వ్యాధులు అల్జిమర్స్ నుంచి గుండెనాళాల వ్యాధులు, గాయాలను మాన్పే సమస్యలు, పక్షవాతం, క్యాన్సర్, బయాబెటిస్ తదితర వ్యాధుల చికిత్సకు కొత్త విధానాలు అవలంబించడానికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఆర్గనాయిడ్ అంటే త్రి డైమెన్షనల్ నిర్మాణం. మూలకణాల నుంచి ఇది వృద్ధి చెందుతుంది. ఇది అవయవంగా అనుకరించ గలదు. ఈ వాస్క్యులర్ ఆర్గనాయిడ్స్ ప్రయోగశాలలో మూలకణాల నుంచి తయారు చేయవచ్చు. ఇవి అచ్చంగా మానవ రక్త నాళాల వలె పనిచేస్తాయి. పరిశోధకులు ఈ రక్తనాళాల ఆర్గనాయిడ్స్ ను ఎలుకలో ప్రవేశ పెట్టారు. ఇవి మానవ రక్త నాళాల వలె పనిచేశాయి. ధమనులు, రక్త నాళికల వలె ఇవి పనిచేయడం గమనార్హం. మానవ మూలకణాల నుంచి ప్రయోగశాలలో రక్తనాళాలను తయారు చేయడమే కాక, మానవ రక్త ప్రసార వ్యవస్థను మరో ప్రాణిలో ప్రవేశ పెట్టడానికి కూడా ఈ పరిశోధన దోహదం చేస్తుందని చెబుతున్నారు. ఈ పరిశోధన వివరాలు జర్నల్ నేచరల్‌లో ప్రచురించారు. రక్త నాళాల్లో వచ్చే అనారోగ్య మార్పులను ఈ పరిశోధన వల్ల నివారించవచ్చు. అంతే కాకుండా డయాబెటిస్ రోగుల రక్తంలో వచ్చే అనారోగ్య పరిస్థితిని తొలగిస్తుంది. డయాబెటిక్ వాతావరణం ప్రయోగశాల పాత్రలో కల్పించి ఈ రక్తనాళాల ఆర్గనాయిడ్స్‌ను ప్రయోగించారు. వాస్క్యులర్ ఆర్గనాయిడ్స్‌లో ఆధారభూతమైన పొర విస్తరించి దళసరిగా తయారవ్వడం పరిశోధకులకు విస్మయం కలిగించింది. ఈ విధంగా పొర దళసరి కావడం డయాబెటిక్ రోగి నాళాలు దెబ్బతినడాన్ని పోలి ఉంటుంది. రక్తనాళాలు దళసరి కావడాన్ని ఆపడానికి కావలసిన రసాయన మూలకాల కోసం పరిశోధకులు అన్వేషించారు. ఈ విధంగా ఆపగలిగే లక్షణం ప్రస్తుతం ఉన్న యాంటీబయోటిక్స్‌లో దేనిలోనూ లేదని తెలుసుకున్నారు. అయితే ఈ విధంగా నిరోధించే లక్షణం శరీరం లోని ఒకరకమైన ఎంజైమ్ వై సెక్రటీస్ కే ఉందని గ్రహించారు. దీనివల్ల డయాబెటిస్ చికిత్స సాధ్యమవుతుందని పరిశోధకులు చెప్పారు. ఈ పరిశోధనల వల్ల రక్తనాళాల వ్యాధులకు కారణాలు తెలియడమే కాక, డయాబెటిస్ రోగులకు సరైన చికిత్స చేయడానికి కొత్త విధానాలు రూపొందించడానికి మార్గం ఏర్పడుతుందని భావిస్తున్నారు.


డయాబెటిస్ రోగుల రక్తనాళాల్లో మార్పులు : ప్రపంచం మొత్తం మీద డయాబెటిస్ రోగులు 420 మిలియన్ మంది ఉన్నారు. వీరి రక్తనాళాల్లో అనేక మార్పులు వస్తుంటాయి. ఫలితంగా రక్త ప్రసరణ సరిగ్గా జరగదు. కండరాలకు ఆక్సిజన్ సరఫరా జరగదు. ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉన్నప్పటికీ దీనివల్ల రక్తనాళాల మార్పులు వస్తాయని చాలామందికి తెలియదు. ఈ మార్పుల్లో ఒకటి రక్తనాళాల లోపలి పొర బాగా దళసరి కావడం. ఫలితంగా ఆక్సిజను, పోషకాహార విలువలు కణాలకు కండరాలకు సరిగ్గా అందకుండా పోతాయి. ఈ కారణంగా మూత్రపిండాల వైఫల్యం, గుండెపోటు, పక్షవాతం, అంధత్వం, ధమనిపై పొరకు వ్యాధి, తదితర అనారోగ్య పరిస్థితులు దాపురిస్తాయి.

–సైన్స్ విభాగం

భూగోళానికి గ్రహశకలాల తాకిడి

భూగోళానికి గ్రహ శకలాల తాకిడి తప్పడం లేదు. అయినా ఏ ప్రమాదం లేదని ఖగోళశాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారీ రాతి శకలాలు అంతరిక్షం నుంచి ఊడి పడుతుంటాయి. గత 700 మిలియన్ సంవత్సరాల క్రితం ఏం జరిగిందో అదే విధంగా గత 290 మిలియన్ సంవత్సరాల్లో భారీ గ్రహ శకలాలు రెండు మూడు సార్లు కన్నా ఎక్కువగానే భూమిని ఢీ కొన్నాయి. సాధారణంగా ప్రతి మిలియన్ లేదా కొన్ని మిలియన్ సంవత్సరాలకు ఒకసారి గ్రహ శకలాలు భూమిని ఢీకొంటుండడం పరిపాటి. రానున్న 861 సంవత్సరాల్లో ఎదురుకానున్న పెద్ద ప్రమాదం ఏంటంటే 4200 అడుగుల వెడల్పు కలిగిన గ్రహశకలం అత్యంత వేగంగా దూసుకొచ్చి 99,988 శాతం భూమిని ఢీకొనే అవకాశం ఉన్నప్పటికీ ఆ ప్రమాదం తప్పిపోవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భూమిపై మనం పెద్ద గుంతలను కొన్నిటిని చూడవచ్చు. భూమిపై 70 శాతం సముద్రం, హిమవాహినులు ఆవరించి ఉన్నాయి. ఇవి కొన్ని గుంతలను పూడ్చి సమతలం చేశాయని యూనివర్శిటీ ఆఫ్ టొరంటో ప్లానెటరీ సైంటిస్టు రెబెక్కా ఘెంట్ పేర్కొన్నారు. ఇక చూడలేని వాటితో కలుపుకొని భూగోళానికి గ్రహశకలాలు ఢీ కొన్న సంఘటనలు గత 230 మిలియన్ సంవత్సరాల్లో 260 వరకు జరిగాయని శాస్త్రవేత్తలు అంచనాకు వచ్చారు. మిగతా అంశాలు కలుపుకుని ప్రస్తుతం భూగోళానికి ఢీకొనే ప్రమాదాల రేటు గత 700 మిలియన్ సంవత్సరాల కన్నా 2.6 రెట్లు ఎక్కువగా ఉందని పరిశోధకులు రెబెక్కా వివరించారు. 650 మిలియన్ సంవత్సరాల కన్నా పాతవైన పెద్ద గుంతలు భూమిపై హిమవాహినుల శక్తి వల్ల తుడుచుపెట్టుకు పోయాయని అందువల్ల 650 మిలియన్ నుంచి 1 బిలియన్ సంవత్సరాల క్రితం నాటి గుంతలను అంచనా వేయడానికి సమీపాన గల చంద్రునిపై గల గుంతల





ప్రభావాన్ని శాస్త్రవేత్తలు ప్రమాణంగా తీసుకున్నారు. భూమిని ఢీకొన్న సంఘటనలను అంచనా వేయడానికి చంద్రుడు చక్కని మార్గదర్శి. ఎందుకంటే ఢీకొనే మార్గంలో చంద్రుడు ఉండడమే కారణం. అందువల్ల 300 మిలియన్ సంవత్సరాల క్రితం ఏం జరిగింది? బహుశా చిన్న గ్రహాల కుటుంబం గ్రహ అనుబంధ బాట నుంచి విచ్ఛిన్నమై ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఆ అంతరిక్ష శిలలు భూమి, చంద్రుని వైపు వేగంగా దూసుకు వచ్చి ఉండవచ్చు. భూగోళం గురుత్వాకర్షణ శక్తి ఎక్కువ అయినందున ఢీ కొనడం కొద్దిగా లేదా ఎక్కువగా జరిగి ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 250 మిలియన్ నుంచి 65 మిలియన్ సంవత్సరాల వరకు సామూహిక విధ్వంసం లేకుండా మానవజాతి మనుగడ సాధ్యం కాకపోవచ్చు. ఈ కొనసాగుతున్న ప్రభా వం రానున్న మరో విధ్వంసానికి దారి తీయకుండా సాంకేతిక పరిజ్ఞానంతో మనం నివారించ వలసి ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు. 65 మిలియన్ సంవత్సరాల క్రితం సెంట్రల్ అమెరికాలో భారీ అంతరిక్ష శిల ఢీకొనడం వల్లనే డైనోసార్లు వంటి అనేక తెగల ప్రాణికోటి నశించి ఉండవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. బ్రిటన్, అమెరికా శాస్త్రవేత్తలు భూగోళంపైన చంద్రునిపైన ఢీకొనగా 12 మైళ్ల పొడవున ఏర్పడిన గుంతల జాబితాను లెక్కించారు. అరమైలు వెడల్పున్న శిలల వల్ల ఈ గుంతలు ఏర్పడ్డాయని అంచనాకు వచ్చారు. 290 మిలియన్ సంవత్సరాల కన్నా తక్కువ కాలంలో 29 గుంతలు, 291–650 మిలియన్ సంవత్సరాల మధ్య 9 గుంతలు ఏర్పడ్డాయని నిర్ధారించారు. **–సైన్స్ విభాగం**



టైటాన్ చంద్రుని ఉత్తర ధ్రువంపై

మిథేన్ వర్షపాతం

శనిగ్రహం తాలూకు పెద్ద చంద్రుడు టైటాన్ ఉత్తర ధ్రువంపై మిథేన్ వర్షపాతం ఆనవాలును శాస్త్రవేత్తలు గమనించ గలిగారు. కెసిని వ్యోమనౌక నుంచి డేటా ఉపయోగించుకుని ఈ వర్షపాత ఆనవాలును కనుగొన గలిగారు. టైటాన్ ఉత్తరార్ధగోళంలో వేసవి రుతువు ప్రారంభానికి ఇది మొదటి సూచన అని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ వివరాలన్నీ జియోఫిజికల్ రీసెర్చి ఉత్తరాల్లో ప్రచురించడమైంది. 2016 జూన్ 7న ఈ దృశ్యాన్ని కెసిని సమీప ఇన్‌ఫ్రారెడ్ సాధనం విజువల్ అండ్ ఇన్‌ఫ్రారెడ్ మేపింగ్ స్పెక్ట్రోమీటర్‌తో చిత్రీకరించారు. 46,332 చదరపు కిలోమీటర్ల మేర ఈ దృశ్యం చిత్రీకరించడమైంది. ఇటువంటి దృశ్యం ఇదివరకు ఎప్పుడూ కనిపించ లేదు. తక్కువ కాలమే ప్రతిబింబించిన ఈ దృశ్యాన్ని విశ్లేషించగా తడి ప్రదేశంపై సూర్య కిరణాలు ప్రసరించడం వల్లనే ఇది కనిపించిందని నిర్ధారించారు. భూగోళంపై ఏటా వచ్చే నాలుగు రుతువులతో పోల్చి చూస్తే టైటాన్‌పై రుతుకాలం భూమిపై ఏడు సంవత్సరాలకు సమానం. టైటాన్ దక్షిణ వేసవి సమయంలో కెసిని టైటాన్ వద్దకు వచ్చింది. దక్షిణార్ధగోళంపై మబ్బులు, వర్షపాతాన్ని గమనించింది. ఇటువంటి వాతావరణమే 2017లో ఉత్తరాది వేసవి సమయంలో ఏర్పడుతుందని టైటాన్ వాతావరణ నమూనాలు అంచనా వేశాయని పరిశోధకులు వెల్లడించారు. ఏదేమైనా 2016 నాటికి అనుకున్న మబ్బుల సమూహం ఏం కనిపించ లేదు. ఈ అధ్యయనం టైటాన్ చంద్రునిపై రుతువుల ధర్మాన్ని క్షుణ్ణంగా తెలుసుకోడానికి శాస్త్రవేత్తలకు చాలా ఉపయోగపడుతుందని పరిశోధకులు వెల్లడించారు.

–సైన్స్ విభాగం

కాంగ్రెస్‌తోనే అయోధ్యలో రామాలయం



డెహ్రాడూన్: తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ద్వారానే అయోధ్యలో రామాలయం నిర్మాణం జరుగుతుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి హరీశ్ రావత్ పేర్కొన్నారు. రిషికేశ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి అనైతిక పార్టీ అని, నైతిక విలువలు, గౌరవం లేని వారు మర్యాద పురుషోత్తముడైన రాముని భక్తులు కాలేరని రావత్ పేర్కొన్నారు. తమకు నైతిక నియమాలు,రాజ్యాంగం అంటే నమ్మకం ఉందన్నారు.కర్నాటక ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిజెపి యత్నిస్తోందని రావత్ విమర్శించారు. ధన బలం, అంగ బలంతో ఇడి, సిబిఐ, ఇన్‌కం ట్యాక్స్ శాఖలను దుర్వినియోగం చేసినట్లుగానే అధికారంలో ఉన్న ప్రత్యర్థి పార్టీలను ఏదో రకంగా పడగొట్టేందుకు యత్నిస్తోందని రావత్ విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్–జెడి(ఎస్) కూటమి 27 సీట్లను గెలుచు కుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భారత్‌లో భూ క్షీణతపై 'సమితి' భేటీ

న్యూఢిల్లీ: భూమి క్షీణత, ఎడారిగా మారడం సమస్యను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి (యుఎన్) ఆధ్వర్యంలో జరిగే 14వ అంతర్జాతీయ సమావేశానికి హాజరయ్యే దేశాలకు భారతదేశం ఆతిథ్యమిస్తుంది. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసెర్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి) పేరుతో ఈ సమావేశం జరుగుతుంది. దాదాపు 100 దేశాలు పాల్గొనే ఈ సమావేశం ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగుతుందని పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. కరువు వంటి విపత్తుల బారిన పడకుండా భూ సారాన్ని, భూమిని కాపాడుకోడానికి 1994లో 197 దేశాలతో యుఎన్‌సిసిడి ఏర్పాటైంది. ఈ సమావేశానికి ఆతిథ్యమివ్వడం దేశానికి ఎంతో గౌరవాన్ని తెస్తుందని మంత్రిత్వశాఖ ప్రతినిధి గౌరవ్ ఖారే చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి 15) కు ఇండియా కట్టుబడి ఉంది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కావాలి అన్న ప్రధాని దృక్పథానికి ఇది అద్దం పడుతుంది. వాతావరణ మార్పులు, పేదరికం, ఆహార భద్రత, స్వచ్ఛమైన నీరు, లింగ వివక్ష, పారిశుధ్యం, జీవనోపాధి వంటి భూమికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఎస్‌డిజి 15 కృషి చేస్తుంది' అని ఆయన తెలిపారు.

2025 నాటికి రామమందిరం: భయ్యాజీ



న్యూఢిల్లీ: అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయాలని ఇటీవల వరకు పట్టుపట్టిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) మనసు మార్చుకున్నట్లు కనపడుతోంది. 2025 నాటికి రామమందిరం నిర్మాణం పూర్తవుతుందంటూ ఆర్‌ఎస్‌ఎస్ అగ్రనాయకులలో ఒకరైన భయ్యాజీ జోషి తాజాగా ప్రకటించారు. రామమందిరం నిర్మించి తీరాలన్నది తమ ఆకాంక్షని, అది 2025 నాటికి పూర్తి కావలసిందేనంటూ ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ శుక్రవారం అల్టిమేటమ్ జారీ చేశారు. ఆలయ నిర్మాణాన్ని వాయిదా ఎందుకు వేస్తున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేస్తూ, ఆలయ నిర్మాణం ఇప్పుడు మొదలుపెడితే ఐదేళ్లకు పూర్తవుతుందన్నది తన ఉద్దేశమని ఆయన చెప్పుకొచ్చారు.

డ్యాన్స్‌బార్లపై ఆర్డినెన్స్ తెస్తాం: మహారాష్ట్ర

ముంబయి: మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లపై అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని ప్రభుత్వం శుక్రవారం స్పష్టం చేసింది. రాష్ట్రంలో డ్యాన్స్ బార్లను నియంత్రించేందుకు తగిన నిబంధనలను అమలు చేసేందుకు అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని తెలిపింది. మహారాష్ట్రలో డ్యాన్స్ బార్లకు షరతులతో కూడిన అనుమతి ఇస్తూ గురువారం సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం డ్యాన్స్ బార్ల లైసెన్స్‌లు, నిర్వహణపై విధించిన నిబంధనలు సరికాదని, నియంత్రణ ఉండొచ్చు కానీ అవి పూర్తిస్థాయి నిషేధానికి చేరుకోకూడదని సుప్రీంకోర్టు వెల్లడించింది. 2005 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం డ్యాన్స్ బార్ల ఏర్పాటుకు ఒక్కరికి కూడా లైసెన్స్ మంజూరు చేయని విషయాన్ని ప్రస్తావించింది.

కాంగ్రెస్‌తో పొత్తు ప్రసక్తి లేదు : ఆప్




న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు ఉండబోదని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ "దురహంకారం"తో వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆప్ తమ పార్టీ ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలోని అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాలలో పోటీ చేస్తుందని ప్రకటించింది. ఆప్ సీనియర్ నాయకుడు, పార్టీ ఢిల్లీ శాఖ కన్వీనర్ గోపాల్ రాయ్ శుక్రవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆప్‌తో పొత్తును వ్యతిరేకిస్తూ పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షీలా దీక్షిత్ చేసిన ప్రకటనల నేపథ్యంలో తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. "దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ కక్కే విషాన్ని కూడా తాగాలనుకున్నాం. కాని కాంగ్రెస్‌కు దురహంకారం ఇంకా పోలేదని ఆ ఇద్దరు నాయకుల ప్రకటనలు రుజువుచేస్తున్నాయి. ఆప్ సొంతంగా అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాలలో పోటీ చేస్తుంది" అని ఆయన చెప్పారు.

యుపిలోనూ పదిశాతం కోటా

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అగ్రవర్ణాలకు చెందిన పేదలకు పదిశాతం రిజర్వేషన్ల కల్పించారు. రాష్ట్రంలో యోగి ఆదిత్యానాథ్ నాయకత్వపు బిజెపి ప్రభుత్వం శుక్రవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది . అగ్రవర్ణాల పేదలకు పదిశాతం కోటా కల్పనకు ఇటీవలే కేంద్రం చట్టం తీసుకువచ్చింది. దీనికి అనుగుణంగా నిర్ణయం తీసుకున్న రాష్ట్రాలలో ఉత్తరప్రదేశ్ మూడో రాష్ట్రంగా నిలిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదిశాతం కోటా నిర్ణయానికి ఆమోదం తెలిపారని రాష్ట్ర సీనియర్ మంత్రి , యుపి ప్రభుత్వ అధికార ప్రతినిధి శ్రీకాంత్ శర్మ విలేకరులకు చెప్పారు. తొలుత గుజరాత్, తరువాత జార్ఖండ్ ఇప్పుడు యుపి ఈ పదిశాతం కోటాకు ఆమోదం తెలిపాయి. జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడ్డ వారికి ప్రభుత్వోద్యోగాలు, విద్యాసంస్థలలో పది శాతం రిజర్వేషన్ల కల్పనకు ఇటీవలే జాతీయ స్థాయిలో చట్టం వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో పదిశాతం కోటా అమలుకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరించారు. ఇది ఈ నెల 14వ తేదీ నుంచే అమలులోకి వచ్చినట్లుగా పరిగణిస్తున్నట్లు శ్రీకాంత్ శర్మ విలేకరులకు చెప్పారు. ఇతర వర్గాలకు ఇప్పటివరకూ ఉన్న కోటాపై ఎటువంటి ప్రభావం పడకుండానే ఈ ఇబిసి కోటా వర్తింపు ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలలో పది శాతం కోటా మేరకు సీట్లు కల్పించేందుకు రంగం సిద్ధం అవుతోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే ఉన్నత విద్యాశాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి దినేష్ శర్మ సీట్ల పెంపుదలపై ప్రభుత్వ, ప్రైవేటు వర్శిటీల అధినేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీట్లను పదిశాతం కోటాకు అనుగుణంగా పెంచాలని నిర్ణయించారు.

ఇబిసి రిజర్వేషన్లపై హైకోర్టులో డిఎంకె పిటిషన్



చెన్నై: అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డిఎంకె మద్రాసు హైకోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేసింది. రిజర్వేషన్లు అనేవి పేదరికం నిర్మూల కార్యక్రమం కాదని, శతాబ్దాలుగా విద్యా, ఉద్యోగ అవకాశాలు లభించక, అణచివేతకు గురవుతన్న వర్గాల సముద్ధరణ కోసం ఉపయోగించే ఒక సామాజిక న్యాయం కల్పించే మార్గం మాత్రమేనని డిఎంకె ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ ఎస్ భారతి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో స్పష్టం చేసిందని, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రిజర్వేషన్లు ఆ పరిమితికి మించి పోతాయని కూడాఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. తమిళనాడులో ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు 68 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని కూడా ఆ పిటిషన్ తెలిపింది. కాగా ఈ పిటిషన్ ఈ నెల 21న విచారణకు వచ్చే అవకాశముంది.

మార్చిలో లోక్‌సభ షెడ్యూల్?

ఏప్రిల్, మేలో ఎన్నికలు • కుదిరితే కశ్మీర్ అసెంబ్లీకీ..

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల తేదీల షెడ్యూల్‌ను మార్చి మొదటివారంలో ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని శుక్రవారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత లోక్‌సభ కాలపరిమితి జూన్ 3వ తేదీ వరకూ ఉంది. ఎన్నికలు ఎప్రిల్ చివరిలో కానీ మే నెల మొదటి వారంలో కానీ జరిగే వీలుంది. ఎన్నికల తేదీల ఖరారుపై ఎన్నికల సంఘం ఇప్పటికే విస్తృత స్థాయి కసరత్తు జరుపుతోంది. ఎన్నికల తేదీలు, ఎన్ని దశలలో వీటిని నిర్వహించాలనేది ఎన్నికల సంఘం పరిశీలిస్తోంది. ఎన్నికల తేదీలు ఎప్పుడు ఉంటాయనేది ప్రస్తుతం వివిధ రాజకీయ పార్టీలకు ఆసక్తికరంగా మారింది. అయితే భద్రతా బలగాల అందుబాటు, ఇతర అవసరాలు పరిగణనలోకి తీసుకుని ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం అధికారులు భావిస్తున్నారు. మొత్తం మీద ఎన్నికల తేదీల వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి తొలివారంలోనే ప్రకటిస్తారని విశ్వసనీయ వర్గాలు నిర్థారించాయి. ఈసారి సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను కూడా నిర్వహించే అవకాశం ఉంది. సాధారణంగా లోక్‌సభ కాలపరిమితికి అత్యంత సమీపంలో ఉండే అసెంబ్లీ ఎన్నికలను కలిపి ఒకేసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలు ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లలో ఎన్నికలకు వీలుంది. ఇక జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ రద్దు అయింది. దీనితో ఆరు నెలల వ్యవధిలో అక్కడ కూడా ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. మరి లోక్‌సభ ఎన్నికలతో ఇక్కడి ఎన్నికలను జోడిస్తారా? అనేది వెల్లడి కావాల్సి ఉంది. గత ఏడాది నవంబర్‌లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ అర్థాంతరంగా రద్దు అయింది. అక్కడ ఎన్నికల నిర్వహణకు గరిష్ట కాల పరిమితి మే నెల వరకూ ఉంది. దీనితో మే నెలలోనే లోక్‌సభ పోల్ సమరం జరిగితే కశ్మీర్ అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతాయి. అయితే అంతకు ముందు కూడా జరిగేందుకు వీలుంది. రాష్ట్రంలో సంక్లిష్ట పరిస్థితి, ప్రత్యేకించి



భద్రతా బలగాల అందుబాటును పరిగణనలోకి తీసుకుని ఎన్నికల నిర్వహణ జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సాధారణ పరిస్థితులలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ కాల పరిమితి ఆరు సంవత్సరాలు. ఇతర రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభ కాల పరిమితి ఐదేళ్లుగా ఖరారు అయింది, ఆరేళ్ల అసెంబ్లీ కాల పరిమితి ప్రకారం అసెంబ్లీ గడువు 2021 మార్చి 16 వ తేదీతో ముగియాల్సి ఉంది. సిక్కిం అసెంబ్లీ కాల పరిమితి 2019 మే 27వ తేదీతో ముగుస్తుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 18తో ముగుస్తుంది. ఒడిషా అసెంబ్లీ కాలపరిమితి జూన్ 11తో, అరుణాచల్ అసెంబ్లీ కాల పరిమితి జూన్ 1వ తేదీతో ముగుస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని మొత్తం ఎన్నికల ప్రక్రియను ఎన్నికల సంఘం ఖరారు చేయాల్సి ఉంది. ఇది ఎన్నికల సంఘం చేపట్టే మెగా ఎలక్షన్ అవుతుందని భావిస్తున్నారు.

గతంలో ఎన్నికల షెడ్యూల్ సరళి

పరిస్థితులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికలను పలు దశలలో నిర్వహించింది. 2004లో వీటిని నాలుగు దశలలో నిర్వహించారు. అప్పట్లో తొలి దశ పోలింగ్ ఎప్రిల్ 20న జరిగింది. చివరి నాలుగోదశ పోలింగ్ మే పదవతేదీన నిర్వహించారు.

2009లో ఎన్నికల సంఘం ఐదు దశలలో పోలింగ్ నిర్వహించింది. తొలి దశ పోలింగ్ ఎప్రిల్ 16న, చివరి ఐదో దశ పోలింగ్ మే 13వ తేదీన జరిగింది.

2014లో ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5వ తేదీన ప్రకటించింది. విస్తృత స్థాయిలో తొమ్మిది దశలలో జరిగిన పోలింగ్ ఎప్రిల్ నుంచి మే నెల వరకూ విస్తరించుకు పోయింది. ఈ ఎన్నికలలో భాగంగా మొదటి దశ పోలింగ్ ఎప్రిల్ 7వ తేదీన, చివరి దశ పోలింగ్ మే 12న జరిగింది. ఇప్పటి అంచనాల మేరకు ఈ 2019 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చి 5 లేదా 6వ తేదీలలో ప్రకటించేందుకు వీలుందని భావిస్తున్నారు. ఎన్ని దశలలో వీటిని నిర్వహిస్తారనేది, కశ్మీర్‌కు కూడా అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయా? అనేది అప్పుడే వెల్లడవుతుంది.

51 మంది మహిళలు దర్శించుకున్నారు

శబరిమలపై సుప్రీంకోర్టుకు కేరళ సర్కార్ నివేదిక

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తీర్పు తర్వాత శబరిమల ఆలయంలోకి 51 మంది మహిళలు ప్రవేశించారని, వీరంతా 50 ఏళ్ల లోపు వయసు వారేనని కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అయ్యప్ప ఆలయంలోకి అడుగుపెట్టిన తొలి ఇద్దరు మహిళలు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో కేరళ ప్రభుత్వం ఇప్పటివరకు ఆలయంలోకి ప్రవేశించిన మహిళల జాబితాను సుప్రీంకోర్టుకు అందజేసింది. 'దాదాపు 16 లక్షల మంది భక్తులు ఆలయప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఏడు వేల మంది మహిళలున్నారు. వారంతా పదినుంచి యాభై ఏళ్ల లోపు వయసు వారే. 16 లక్షల మందిలో 8.2 లక్షల మంది అయ్యప్పను దర్శించుకున్నారు. ఇక ఏడు వేల మంది మహిళల్లో 51 మంది మాత్రమే స్వామిని దర్శించుకున్నారు. వీరు ఆలయంలోకి ప్రవేశిసున్నప్పుడు ఎలాంటి అవాంతరాలు తలెత్త



లేదు. వారు సన్నిధానం నుంచి బైటికి వచ్చాక టికెట్లను పక్కాగా స్కాన్ చేసి పంపించాం. మొత్తానికి 2018లో ఇప్పటివరకు అయ్యప్పను దర్శించుకున్న వారి సంఖ్య 44 లక్షలు' అని ప్రకాశ్ అనే ప్రభుత్వాధికారి వెల్లడించారు.

ఆ ఇద్దరు మహిళలకు రక్షణ కల్పించండి: సుప్రీం

బరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గలకు రోజులో 24 గంటలూ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు కేరళ ప్రభుత్వాన్ని శుక్రవారం ఆదేశించింది. ఆలయంలోకి ప్రవేశించినందుకు తమకు బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆ ఇద్దరు మహిళలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ ఎల్‌ఎన్ రావులతో కూడిన బెంచ్ ఆ ఇద్దరు మహిళలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, తాము మహిళలకు భద్రత కల్పించే అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, మరే ఇతర అంశాన్ని దీనికి జత చేయబోమని ఈ సందర్భంగా బెంచ్ స్పష్టం చేసింది. బిందు, కనకదుర్గలు ఆలయంలోకి వెళ్లి వచ్చినప్పటినుంచి వారికి బెదిరింపులు వస్తున్నాయి. ఈ కారణంగానే వారు ఇంటికి కూడా వెళ్లలేదు. దాదాపు రెండు వారాల పాటు అజ్ఞాతంగా గడిపారు. చివరికి ఈ నెల 15న కనకదుర్గ ఇంటికి వెళ్లగా ఆమె అత్త కనకదుర్గపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. దీంతో ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ట్రంప్ సలహా కమిటీలో పరమేశ్వరన్

వాషింగ్టన్ : అమెరికాలో అత్యంత కీలకమైన దేశాధ్యక్షుడి సలహా కమిటీకి భారతీయ సంతతి ప్రముఖుడు నియమితులు కానున్నారు. ఈ సలహా సంప్రదింపుల కమిటీకి ఆర్థిక నిపుణులు ప్రేమ్ పరమేశ్వరన్‌ను నియమించనున్నట్లు స్వయంగా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ట్రంప్ ఆలోచనను వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఇండో అమెరికన్ అయిన పరమేశ్వరన్ 50 సంవత్సరాల ఆర్థిక వ్యవహారాలలో దిట్టగా పేరుతెచ్చుకున్నారు. ఆసియన్ అమెరికన్స్, పసిఫిక్ ఐలాండర్స్‌కు సంబంధించి దేశాధ్యక్షుడికి ఎప్పటికప్పుడు సలహాలు అందించే డజన్ మంది సభ్యులతో కూడిన అడ్వయిజరీ కమిషన్‌లో ఆయన కూడా ఒక సభ్యుడిగా నియమితులు అయ్యేందుకు వీలేర్పడింది. పరమేశ్వరన్‌ను ఈ కమిటీలో తీసుకోనున్నట్లు ట్రంప్ ప్రకటించడం భారతీయ సంతతి విజయకేతనంగా భావిస్తున్నారు. ట్రంప్ కొలువులో ఇప్పటికే ఉన్న పలువురు ఇండో అమెరికన్ల బృందంలో ఆయనా ఒకరిగా నిలిచారు. న్యూయార్క్ నివాసి అయిన పరశమేశ్వరన్ ఎరోస్ ఇంటర్నేషనల్ నార్త్ అమెరికా వ్యవహారాల అధినేతగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. ఒబామా హయాంలో ప్రెసిడెంట్ అడ్వయిజరి కమిటీ వ్యవస్థ ఏర్పాటు అయింది. దీనికి అనుగుణంగానే ఇప్పటి కమిటీకి ట్రంప్ నియామకాలు చేపట్టారు. పరిశ్రమలు, వ్యాపారం,వాణిజ్యం, విద్యా ఆరోగ్య పరిరక్షణ, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ వ్యవహారాలు ఇతరత్రా పలు కీలక అంశాలకు సంబంధించి ఈ కమిటీ ఎప్పటికప్పుడు ప్రెసిడెంట్‌కు కీలక సలహాలు అందిస్తుంది. వీటిని పరిశీలించిన తరువాతనే దేశాధ్యక్షులు సముచిత నిర్ణయాలు తీసుకుంటారు. దీనితో ఈ కమిటీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రెసిడెంట్ భవితకు ఆయువుపట్టుగా నిలిచింది. ఈ కమిటీకి తీసుకోబోయే ఇతర సలహాదార్లను కూడా ట్రంప్ ప్రకటించారు.





తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం నోవాటెల్‌లో ప్రారంభమైన అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపి కవిత. సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారేకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

నేడు మమత ప్రతిపక్ష సభ

కోల్‌కతా/ న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ చొరవతో భారీ స్థాయి ప్రతిపక్ష నేతల సభ శనివారం ఇక్కడ జరుగనుంది. స్థానిక బ్రిగేడ్ పరేడ్‌లో ఈ ర్యాలీ కోసం అన్ని ఏర్పాట్లు జరిగాయి. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఒకేతాటికి తెచ్చేందుకు మమత సంకల్పించారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్ టిడిపి, ఎస్‌పి, ఆర్జేడీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఆప్ నేతలు హాజరు అవుతారు. కాంగ్రెస్ తరపున పార్టీ ఎంపి సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే వస్తున్నారు. ఇప్పటికే ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ సభకోసం కోల్‌కతాకు చేరారు. అయితే ఈ సభకు దేశంలోని ప్రధాన ప్రతిపక్షాలు, వామపక్షాలు, ప్రత్యేకించి కొన్ని ప్రాంతీయ పార్టీలు దూరంగా ఉన్నాయి. అయితే చంద్రబాబు కూడా ఈ సభకు హాజరు కానున్నారు.

మమత ర్యాలీలో సంఘటిత జన సందేశం: రాహుల్ ఆకాంక్ష

మమత బెనర్జీ ఆధ్వర్యంలో శనివారం (నేడు) జరిగే ప్రతిపక్ష మెగా ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. సమైక్య భారత్ సందేశాన్ని ఈ ర్యాలీ వెలువరిస్తుందని, ప్రతిపక్షాల ఐక్యతను బ్రహ్మాండమైన స్థాయిలో చాటుతుందని రాహుల్ శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో బిజెపిని సమర్థవంతంగా ఎదుర్కొనే దిశలో ప్రతిపక్షాలు ఏకం



అయి కూటమిగా నిలిచే యత్నాలు జరుగుతున్నాయి. దీనికి పశ్చిమ బెంగాల్ సిఎం,టిఎంసి అధినేత్రి మమత బెనర్జీ సారథ్యం వహిస్తున్నారు. ఇందులో భాగంగా కోల్‌కతాలో జరిగే ర్యాలీకి పలువురు ప్రతిపక్ష నేతలు హాజరుకానున్నారు. అయితే రాహుల్ గాంధీ ఈ సభకు వెళ్లకపోవచ్చునని వెల్లడైంది. కాంగ్రెస్ తరపున సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే దీనికి హాజరు అవుతున్నట్లు తెలిసింది. ర్యాలీ నేపథ్యంలో రాహుల్ గాంధీ శుక్రవారం మమతకు ఒక లేఖ పంపించారు. ఘనమైన బెంగాళీలు ఎప్పుడూ మన సిద్ధాంతాల రక్షణలో చారిత్రకంగా అగ్రపథంలో ఉంటారని రాహుల్ కితాబు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష కూటమికి యత్నిస్తున్న మమతకు తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు , ఐక్యత , నమ్మిక కలగలిపిన సమైక్య భారతపు సంకేతాలు ఈ సందర్భంగా వెలువడుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. మమత దీకి తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. తాను మమతకు లేఖ పంపించిన విషయాన్ని రాహుల్ తమ ఫేస్‌బుక్‌లో పొందుపర్చారు. నిజమైన జాతీయ వాదం, అభివృద్ధితోనే ప్రజాస్వామిక మూల స్తంభాలు పటిష్టం అవుతాయి. సామాజిక న్యాయం, లౌకికత వెల్లివిరుస్తుందని ప్రతిపక్షం సంఘటితంగా విశ్వసిస్తోంది. ప్రతిపక్ష సముచిత సూత్రీకరణను బిజెపి, మోడీ విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని రాహుల్ విమర్శించారు. మోడీ ప్రభుత్వపు తప్పుడు వాగ్దానాలు, అసత్యాల అల్లికలతో కోట్లాది మంది భారతీయులు ఇప్పుడు రగిలిపోతున్న బలీయ శక్తులుగా నిలిచారని రాహుల్ తాము పంపించిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను తమ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. మోడీకి వ్యతిరేకంగా సమీకృతం అవుతోన్న శక్తులు నూతన భవితపై ఆశలు పెట్టుకున్నాయి. ప్రతి ఒక్కరి అంటే స్త్రీ పురుషులు, ఆబాలగోపాలం గళం విన్పించాలనే ఆలోచనా విధానంతో కూడుకున్న రేపటి భారతం కీలకమైనది.మతాలు , కులాలు, ఆర్థిక స్థితిగతులకు నిమిత్తం లేకుండా ఉండే సమిష్టి గళానికి ప్రాధాన్యత ప్రస్తుత రేపటి నినాదం అని రాహుల్ తేల్చిచెప్పారు.

బిసిఎఎస్ డైరెక్టర్ జనరల్‌గా అస్థానా

ఖరారు చేసిన అపాయింట్‌మెంట్స్ కమిటీ



న్యూఢిల్లీ: అంతర్గత విభేదాలతో రచ్చకెక్కిన సిబిఐ డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు సిబిఐనుంచి ఉద్వాసన పలికిన ఒక రోజు తర్వాత శుక్రవారం ప్రభుత్వం ఆయనను పౌర విమానయాన భద్రతాసంస్థ (బిసిఎఎస్)కు కొత్త డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. రాకేశ్ అస్థానాను బిసిఎఎస్ డైరెక్టర్ జనరల్‌గా నియామకానికి కేంద్ర మంత్రివర్గానికి చెందిన నియామకాలు కమిటీ(అపాయింట్‌మెంట్స్ కమిటీ) ఆమోదం తెలియజేసింది. అస్థానా బాధ్యతలు చేపట్టిన రోజునుంచి రెండేళ్ల పాటు, లేదా తదుపరి ఆదేశాలుజారీ చేసే వరకు (ఏది ముందయితే అది) ఆయన ఈ పదవిలో ఉంటారని ఒక అధికార ప్రకటన తెలియజేసింది. సిబిఐ ప్రత్యేక డైరెక్టర్‌గా అస్థానా పదవీ కాలాన్ని కుదించిన కేంద్ర ప్రభుత్వం గురువారం ఆయనతో పాటు ముగ్గురు సిబిఐ అధికారులను వేరే శాఖలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. సిబిఐ డైరెక్టర్ అలోక్‌వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాల మధ్య వ్యక్తిగత విభేదాలు రచ్చకెక్కి సిబిఐ ప్రతిష్ఠను దిగజార్చిన నేపథ్యంలో కేంద్రం గతంలో ఆ ఇద్దరినీ బలవంతంగా సెలవుపై పంపించిన విషయం తెలిసిందే. దీనిపై అలోక్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆయనను తక్షణం విధుల్లో నియమించాలని సర్వోత్తమ న్యాయస్థానం ఈ నెల 10న ఆదేశించడం, వర్మ బాధ్యతలు చేపట్టిన ఒక రోజుకే ఆయనను పదవినుంచి తప్పించి ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేయడంతో కలత చెందిన వర్మ కొత్త బాధ్యతుల చేపట్టకుండానే రాజీనామా చేపిన విషయం తెలిసిందే. అయితే అస్థానాకు మాత్రం కోర్టులో చుక్కెదురయింది. సిబిఐకి కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేయడానికి ప్రధాని మోడీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ సమావేశం కానున్న నేపథ్యంలో ఈ లోగానే సిబిఐ ప్రక్షాళనకు నడుం బిగించిన కేంద్రం అస్థానాతో పాటుగా వివాదాస్పదులైన మరో ముగ్గురు అధికారులను కూడా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

జట్టు అవసరాల కోసం ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధమే. నాకు జట్టు ప్రయోజనాలే ముఖ్యం. ఏ స్థానంలో దిగుతున్నా అనేది పట్టించుకోను. ఆసీస్ గడ్డపై నిలకడగా ఆడడం సంతృప్తి ఇచ్చింది.

– మాజీ కెప్టెన్ ధోని

వోజ్నియాకి ఇంటికి

షరపోవా, కెర్బర్, నాదల్, ఫెదరర్ ముందంజ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కరోలైన్ వోజ్నియాకి నిష్క్రమించింది. మరోవైపు పురుషుల చాంపియన్ రోజర్ ఫెదరర్, రెండో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ అంజెలిక్ కెర్బర్ (జర్మనీ), 30వ సీడ్ మారియా షరపోవా, 8వ సీడ్ పెట్రా క్విటోవా (చెక్) మూడో రౌండ్‌లో విజయం సాధించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోటీలో రష్యా స్టార్ షరపోవా 6–4, 4–6, 6–3 తేడాతో ప్రస్తుత చాంపియన్ వోజ్నియాకిను ఓడించింది. తొలి సెట్‌లో షరపోవా అలవోక విజయం సాధించింది. అయితే రెండో సెట్‌లో వోజ్నియాకి జయభేరి మోగించింది. కీలకమైన మూడో సెట్‌ను మళ్లీ షరపోవా సొంతం చేసుకుని ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఇక, రెండో సీడ్ కెర్బర్ 6–1, 6–0తో ఆస్ట్రేలియా క్రీడాకారిణి కింబర్లీను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన కెర్బర్ ఏ దశలోనూ ప్రత్యర్థిని



కోలుకునే అవకాశం ఇవ్వలేదు. మరో పోటీలో 8వ సీడ్ క్విటోవా జయభేరి మోగించింది. దూకుడుగా ఆడిన క్విటోవా 6–1, 6–4తో స్విట్జర్లాండ్‌కు చెందిన బెలిండా బెన్‌సిక్‌ను ఓడించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారులు నాదల్, ఫెదరర్ ముందంజ వేశారు. మూడో రౌండ్‌లో రెండో సీడ్ నాదల్ 6–1, 6–2, 6–4 తేడాతో స్థానిక ఆటగాడు అలెక్స్ డి మినౌర్‌ను చిత్తు చేశాడు. ప్రస్తుత విజేత ఫెదరర్ 6–2, 7–5, 6–2 తేడాతో అమెరికా ఆటగాడు ఫ్రిట్జ్‌ను ఓడించాడు. ఇక, ఆరో సీడ్ మారిన్ సిలిక్, 22వ సీడ్ రొబెర్టో అగట్‌లు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.



భారత్‌దే సిరీస్

ఆస్ట్రేలియా గడ్డపై పరిపూర్ణ విజయం

చెలరేగిన చాహల్, రాణించిన ధోని, కేదార్
చివరి వన్డేలో టీమిండియా జయభేరి





మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా చారిత్రక ప్రదర్శనతో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన మూడో చివరి వన్డేలో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య ఆసీస్ జట్టు 230 పరుగులకే కుప్పకూలింది. యువ స్పిన్నర్ యజువేంద్ర చాహల్ ఆరు వికెట్లు తీసి ప్రత్యర్థి ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు. భువనేశ్వర్, షమీలు రెండేసి వికెట్లు తీసి తమవంతు సహకారం అందించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సీనియర్ ఆటగాడు, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోని (87; 114 బంతుల్లో 6X4), కేదార్ జాదవ్ 57 బంతుల్లో ఏడు ఫోర్లతో 61 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. దీంతో భారత్ ఘన విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ పరిపూర్ణ విజయం సాధించింది. తొలుత ట్వంటీ–20 సిరీస్‌ను 1–1తో సమం చేసింది. తర్వాత జరిగిన టెస్టు సిరీస్‌ను 2–1తో దక్కించుకుంది. తాజాగా 2–1 తేడాతో వన్డే సిరీస్‌ను కూడా సొంతం చేసుకుంది. దీంతో ఆస్ట్రేలియా గడ్డపై మూడు సిరీస్‌లు సాధించిన ఏకైక భారత కెప్టెన్‌గా విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు. కాగా, చివరి వన్డేలో అద్భుతంగా రాణించిన చాహల్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. సిరీస్‌లో మూడు అర్ధ సెంచరీలతో సహా 193 పరుగులు చేసిన మహేంద్ర సింగ్ ధోనికి ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు దక్కింది.

ప్రారంభంలోనే..

ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ 9 పరుగులు మాత్రమే పెవిలియన్ చేరాడు. పిచ్ మందకొడిగా ఉండడంతో ప్రతి పరుగు కోసం చెమటోడ్చాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లితో కలిసి మరో ఓపెనర్ శిఖర్ ధావన్ స్కోరును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. భారీ షాట్ల జోలికి పోకుండా సమన్వయంతో ఆడారు. ఇద్దరు కుదురుగా ఆడడంతో భారత్ కోలుకున్నట్టే కనిపించింది. కానీ, 23 పరుగులు చేసిన ధావన్‌ను స్టోయినిస్ వెనక్కి పంపాడు.

ఆదుకున్న కోహ్లి

ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యతను కెప్టెన్ కోహ్లి తనపై వేసుకున్నాడు. అతనికి ధోని అండగా నిలిచాడు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న కోహ్లి స్కోరును ముందుకు నడిపించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్



ఆడిన కోహ్లి 62 బంతుల్లో మూడు ఫోర్లతో 46 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ధోనితో కలిసి అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు.

ధోని, కేదార్ జోరు

కోహ్లి ఔటైనా తర్వాత మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను ధోని తీసుకున్నాడు. కేదార్ జాదవ్ అతనికి సహకారం అందించాడు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ జట్టును లక్ష్యం వైపు తీసుకెళ్లారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సింగిల్స్‌కే ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు ఆస్ట్రేలియా బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో పరుగులు రావడమే గగనమైంది. అయితే వికెట్లు పడక పోవడం, రెండు సార్లు ధోనికి లైఫ్ లభించడం భారత్‌కు కలిసి వచ్చింది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ధోని కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సిరీస్‌లో వరుసగా మూడో అర్ధ సెంచరీ సాధించి తనకు ఎదురు లేదని నిరూపించాడు. అద్భుత సమన్వయాన్ని ప్రదర్శించిన ధోని 114 బంతుల్లో ఆరు ఫోర్లతో 87 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు ధాటిగా ఆడిన కేదార్ జాదవ్ 57 బంతుల్లోనే ఏడు ఫోర్లతో 61 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. దీంతో భారత్ కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

చాహల్ మ్యాజిక్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో సఫలమయ్యారు. ఓపెనర్లు అరోన్ ఫించ్, అలెక్స్ కారేలు తమ పేలవమైన ఫామ్‌ను ఈసారి కూడా కొనసాగించారు. కారే ఐదు పరుగులకే పెవిలియన్ చేరాడు. ఫించ్ కూడా 14 పరుగులకే వెనుదిరిగాడు. ఈ రెండు వికెట్లు కూడా భువనేశ్వర్‌కే దక్కాయి. ఈ దశలో ఉస్మాన్ ఖ్వాజా (34), షాన్ మార్ష్(39) సమన్వయంతో ఆడి ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. కానీ ఇద్దరిని చాహల్ వెంట వెంటనే వెనక్కి పంపి భారత్‌కు పైచేయి అందించాడు. మరోవైపు పీటర్ హాండ్స్‌కొంబ్ ఒంటరి పోరాటం చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన పీటర్ రెండు ఫోర్లతో 58 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో చాహల్ అద్భుతంగా రాణించాడు. 42 పరుగులకే ఆరు వికెట్లు తీశాడు. దీంతో ఆసీస్ ఇన్నింగ్స్ 48.4 ఓవర్లలోనే 230 పరుగుల వద్ద ముగిసింది.

స్కోరుబోర్డు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలెక్స్ కారే (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 5, అరోన్ ఫించ్ ఎల్బీ–బి భువనేశ్వర్ 14, ఉస్మాన్ ఖ్వాజా (సి) అండ్ (బి) చాహల్ 34, షాన్ మార్ష్ (స్టంప్డ్) ధోని (బి) చాహల్ 39, పీటర్ హాండ్స్‌కొంబ్ ఎల్బీ–బి చాహల్ 58, స్టోయినిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 10, మాక్స్‌వెల్ (సి) భువనేశ్వర్ (బి) షమీ 26, రిచర్డ్‌సన్ (సి) కేదార్ (బి) చాహల్ 16, ఆడమ్ జంపా (సి) విజయ్ (బి) చాహల్ 8, పీటర్ సిడిల్ నాటౌట్ 10, స్టాన్‌లెక్ (బి) షమీ 0, ఎక్స్‌ట్రాలు 10, మొత్తం 48.4 ఓవర్లలో 230 ఆలౌట్.
బౌలింగ్: భువనేశ్వర్ 8–1–28–2, షమీ 9.4–0–47–2, విజయ్ శంకర్ 8–0–23–0, కేదార్ జాదవ్ 6–0–35–0, రవీంద్ర జడేజా 9–0–53–0, యజువేంద్ర చాహల్ 10–0–42–6.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) షాన్ (బి) సిడిల్ 9, శిఖర్ ధావన్ (సి) అండ్ (బి) స్టోయినిస్ 23, విరాట్ కోహ్లి (సి) కారే (బి) రిచర్డ్‌సన్ 46, మహేంద్ర సింగ్ ధోని నాటౌట్ 87, కేదార్ జాదవ్ నాటౌట్ 61, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 49.2 ఓవర్లలో 234/3.
బౌలింగ్: రిచర్డ్‌సన్ 10–1–27–1, పీటర్ సిడిల్ 9–1–56–1, స్టాన్‌లెక్ 10–0–49–0, మాక్స్‌వెల్ 1–0–7–0, ఆడమ్ జంపా 10–0–34–0, స్టోయినిస్ 9.2–0–60–1.

కెటిఆర్ అభినందనలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయాన్ని అందుకున్న టీమిండియాను తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు అభినందించారు. టెస్టు, వన్డే సిరీస్‌లను గెలిచి భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించడం దేశానికి గర్వకారణమని కెటిఆర్ అన్నారు.



ఒకుహరకు సైనా షాక్

క్వార్టర్స్‌లోనే శ్రీకాంత్ ఔట్

కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్, తెలుగుతేజం సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలయ్యాడు. సైనా మాత్రం అద్భుత ఆటతో టైటిల్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. శుక్రవారం జరిగిన హోరాహోరీ క్వార్టర్ ఫైనల్లో సైనా చిరకాల ప్రత్యర్థి, జపాన్ స్టార్ నజోమి ఒకుహరను ఓడించింది. నువ్వా నేనా అన్నట్టు సాగిన సమరంలో సైనా 21–18, 23–21 తేడాతో జయకేతనం ఎగుర వేసింది. ప్రారంభం నుంచే ఇద్దరు సర్వం ఒడ్డి పోరాడారు. దీంతో ప్రతి పాయింట్ కోసం హోరాహోరీ తప్పలేదు. ఇద్దరి పోరు యుద్ధాన్ని తలపించింది. ఇద్దరు పట్టు వీడకుండా పోరాడంతో ఆధిపత్యం తరచు చేతులు మారుతూ వచ్చింది. ఒకసారి సైనా ఆధిక్యంలోకి దూసుకెళితే ఆ వెంటనే ఒకుహర పైచేయి సాధించేది. అయితే కీలక సమయంలో పట్టును నిలబెట్టుకున్న భారత స్టార్‌కే విజయం వరించింది. చివరి వరకు అసాధారణ ఆటతో అలరించిన సైనా వరుసగా రెండు గేమ్స్ గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఇదే క్రమంలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. కాగా, పురుషుల విభాగంలో భారత్‌కు చుక్కెదురైంది. స్టార్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లో పోరాడి ఓడాడు. దక్షిణ కొరియా ఆటగాడు సాన్ వ్యాన్ హోతో జరిగిన హోరాహోరీ పోరులో శ్రీకాంత్ 23–21, 16–21, 17–21 తేడాతో ఓటమి పాలయ్యాడు. తొలి సెట్ గెలిచి దూకుడు మీద కనిపించిన కిదాంబి తర్వాతి సెట్‌లలో వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న వ్యాన్ వరుసగా రెండు సెట్లు గెలిచి సెమీస్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.



సెమీస్‌లో కర్ణాటక

బెంగళూరు: ప్రతిష్టాత్మకమైన రంజీ ట్రోఫీలో కర్ణాటక జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. రాజస్థాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో కర్ణాటక ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 185 పరుగుల లక్ష్యాన్ని కర్ణాటక కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటకకు ప్రారంభంలోనే ఎదురు దెబ్బలు తగిలాయి. ఒక దశలో 56 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. అయితే సీనియర్లు కరుణ్ నాయర్, మనీష్ పాండేలు అద్భుత ఆటతో కర్ణాటకకు అద్భుత విజయాన్ని సాధించి పెట్టారు కీలక ఇన్నింగ్స్ ఆడిన కరుణ్ నాయర్ ఆరు ఫోర్లతో 61 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అలరించిన మనీష్ పాండే 75 బంతుల్లోనే 14 ఫోర్లు, రెండు సిక్సర్లతో 87 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో కర్ణాటక నాలుగో రోజే మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఇంతకుముందే దక్షిణ భారత్‌కు చెందిన మరో జట్టు కేరళ కూడా సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే.



హైదరాబాద్ వేదికగా జరుగనున్న జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల బ్రోచర్, లోగోను ఆవిష్కరిస్తున్న టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, శాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి

బ్రిటన్ రాణి ఎలిజబెత్ భర్త ప్రిన్స్ ఫిలిప్ గురువారం ఒక కారు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఇంగ్లండ్‌లోని నార్‌ఫోక్‌లోగల శాండ్రిన్‌గామ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రిన్స్ ఫిలిప్ స్వయంగా కారు నడుపుతుండగా మరో కారు వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో మరో కారులోని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

విశాల

కర్నాటకలో రిసార్ట్ రాజకీయాలు


ఎమ్మెల్యేల రక్షణకు కాంగ్రెస్ క్యాంప్ • సిఎల్‌పి భేటీకి నలుగురి డుమ్మాతో సంచలనం

బెంగళూరు : కర్నాటకలో తిరిగి రాజకీయ వేడి రగులుకుంది. రాష్ట్రంలోని జెడిఎస్ – కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి సవాలు తలెత్తింది. శుక్రవారం అత్యంత కీలకమైన కాంగ్రెస్ లెజిస్లేచర్‌పార్టీ సమావేశానికి నలుగురు పార్టీ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంతో ఇప్పుడు విడిది రాజకీయాలు జోరందుకున్నాయి. తమ పార్టీ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా ఉండేందుకు, ప్రభుత్వానికి ముప్పు వాటిల్లకుండా చూసుకునేందుకు ఎమ్మెల్యేలను పార్టీ వ్యూహకర్తలు శుక్రవారం రాత్రి హుటాహుటిన రిసార్ట్‌లకు తరలించారు. సిఎల్‌పి సమావేశానికి అంతా హాజరు కావాలని పార్టీ నేత, మాజీ సిఎం సిద్ధరామయ్య విప్ జారీ చేశారు. అయినప్పటికీ దీనిని ఖాతరు చేయకుండా నలుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారు. దీనిని పార్టీ అధినేతలు తీవ్రంగా పరిగణించారు. క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈలోగా తమ ఎమ్మెల్యేల రక్షణార్థం వారిని వేరేచోటికి తరలించినట్లు వెల్లడైంది. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ కూల్చివేతకు బిజెపి అన్ని విధాలుగా యత్నిస్తోందని, విడిది రాజకీయాలను నడిపిస్తోందని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ దశలోనే తమ ఎమ్మెల్యేల బలం చెక్కుచెదరకుండా ఉందని నిరూపించుకోవడానికి బలప్రదర్శనగా సిఎల్‌పి భేటీ ఏర్పాటు చేశారు. నలుగురు ఎమ్మెల్యేలు అసమ్మతితో ఉండటం, వీరు సిఎల్‌పికి రాకపోవడం వల్ల సంకీర్ణానికి తక్షణం ఎటువంటి ముప్పు లేదని భావిస్తున్నారు. అయితే సంకీర్ణానికి అసమ్మతివాదుల బెడద పొంచి ఉందనే విషయాన్ని ఈ పరిణామం స్పష్టం చేసింది. ఇప్పుడు సమావేశానికి రాకుండా ఉన్న ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సిద్ధరామయ్య తెలిపారు. గైర్హాజరుకు కారణాలపై వివరణలు కోరుతామని చెప్పారు. వారి స్పందనను బట్టి తదుపరి చర్యలు ఉంటాయి. ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలో వారిపై చర్యలకు వీలుంటుందా? అనేది వెల్లడవుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇప్పుడు కాంగ్రెస్ సమావేశానికి రాకుండా ఉన్న ఎమ్మెల్యేలలో రమేష్ జర్కిహోలి, బి నాగేంద్ర, ఉమేష్ జాదవ్, మహేష్ కుమటహళ్లి ఉన్నారు. ఇటీవలి కేబినెట్ ప్రక్షాళన దశలో అత్యంత పలుకుబడి గల జర్కిహోలికి పదవీ ఉద్వాసన పలకడం కీలకంగా మారింది. దీనితో ఆయన అసంతృప్తి మరింత రగులుకుంది. ఇక తాను అనారోగ్యంతో ఉండటం వల్లనే, సిఎల్‌పికి రావాలనే లేఖ సరిగ్గా చూడకపోవడం వల్లనే భేటీకి రాలేకపోయినట్లు ఉమేష్ జాదవ్ తెలిపారు. తన గైర్హాజరీని తీవ్రంగా పరిగణించరాదని, వదిలిపెట్టాలని కోరారు. ఇక తాను కోర్టు కేసులో తీరిక లేకుండా ఉన్నందున సిఎల్‌పికి రాలేకపోతున్నట్లు మరో ఎమ్మెల్యే నాగేంద్ర ముందుగానే తెలిపారు. శుక్రవారం నాటి సిఎల్‌పికి లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, సిద్ధరామయ్య, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు హాజరు అయ్యారు. బిజెపి ఎన్ని కుటిల యత్నాలకు దిగినా సంకీర్ణ ప్రభుత్వానికి ఎటువంటి ముప్పు రాదని అంతకు ముందు కాంగ్రెస్ నేతలు విలేకరులకు తెలిపారు. బిజెపి కుట్రలు విఫలం అయ్యాయని వారి ఆటలు ఇకముందు కూడా సాగబోవని తెలిపారు. తమ పార్టీ ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా ఉన్నారని , ఎవరో ఒకరు పార్టీకి అందుబాటులో లేరని మీడియా చెప్పడం చూస్తూ ఉంటే పార్టీని మారే వారి జాబితాను వారే ముందుగా సిద్ధం చేసుకున్నట్లు అన్పిస్తోందని కెపిసిసి అధ్యక్షులు దినేష్ గుండూ రావు విలేకరులకు చురకలు పెట్టారు. సిఎల్‌పికి దాదాపుగా అంతా వచ్చారని, రానివారు ఉంటే వస్తారని, లేదా తమతో మాట్లాడుతారని తేల్చిచెప్పారు. అయితే సిఎల్‌పి తరువాత నలుగురు ఎమ్మెల్యేల మిస్సింగ్‌తో పార్టీ వర్గాలు కలవరం చెందాయి. బుధవారం కాంగ్రెస్ గూటికి ఇద్దరు రెబెల్స్ ఆనంద్ సింగ్, భీమా నాయక్‌లు తిరిగి వచ్చారు. అయితే కీలకమైన సిఎల్‌పికి నలుగురు ఎమ్మెల్యేలు రాకపోవడం అందులోనూ అత్యంత పలుకుబడి గల్ల జర్కిహోలి కాంగ్రెస్ పెద్దలతో ఫోన్‌లో కూడా మాట్లాడకపోవడంతో, చివరికి జర్కిహోలీ సోదరుడు ఇటీవల రాష్ట్ర మంత్రి అయిన సతీష్ జర్కిహోలీ చేసిన యత్నాలు కూడా విఫలం కావడంతో పార్టీ వర్గాలు కంగుతిన్నాయి. ఇది ఇలా ఉండగా సిఎల్‌పికి రాకుండా ఉన్న ఎమ్మెల్యేలు నగరంలోని ఒక హోటల్‌లో బస చేసినట్లు , వారిని ఇజెపి ఎంపి సంజయ్ రామచంద్రన్ పాటిల్ కలిసినట్లు వెల్లడైంది సిఎల్‌పి భేటీకి నలుగురు ఎమ్మెల్యేలు రాకపోవడం వల్ల వచ్చే తక్షణ నష్టం లేదని, అయితే దీని ప్రభావం విస్తృతం చేసేందుకు బిజెపి వర్గాలు యత్నిస్తేనే కాంగ్రెస్ సారథ్యపు కూటమికి ముప్పు అవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

• బిజెపి పావులతో ఏడు నెలల సంకీర్ణ సంక్షోభం



మోడీ దుష్ట పన్నాగం: ఖర్గే



కర్నాటకలో ప్రస్తుత పరిణామాలకు ప్రధాని మోడీ వక్రబుద్ధులే కారణం అని కాంగ్రెస్ నేత మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. కర్నాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వారి వైపు తిప్పుకునేందుకు మోడీనే వ్యూహరచనకు దిగాడని, సిబిఐ, ఇడి, ఆదాయపు పన్ను వారిని ఉగ్రవాదుల మాదిరిగా వాడుకుంటూ బెదిరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరుగుతున్న కుట్ర ఇప్పుడు వెలుగులోకి వచ్చిందన్నారు. పలు విధాలుగా కేంద్రీయ దర్యాప్తు సంస్థలతో దాడులు జరిపించి తమ పార్టీ ఎమ్మెల్యేలను చికాకు పెడుతున్నారని, ఇదంతా కూడా మోడీ ఆయనతో పాటు అమిత్ షాల వ్యూహాల దిశలో సాగుతోందన్నారు.

నాకే ఎందుకు ఈ దుస్థితి!: కుమారస్వామి



ర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి మళ్లీ ప్రజలకు తన గోడు వెళ్లబోసుకున్నారు. రెండుసార్లు తాను సంకీర్ణ ప్రభుత్వాలకు ముఖ్యమంత్రిని కావడం తన దురదృష్టమంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నాడిక్క డ కర్నాటక విద్యుత్ బోర్డు ఇంజనీర్ల సంఘం కార్యక్రమంలో పాల్గొన్న కుమారస్వామి రెండవ సారి కూడా సంకీర్ణ ప్రభుత్వంలోనే ముఖ్యమంత్రి కావడం తన దురదృష్టమని, ఈ కారణంగానే ప్రజలు ఆశించిన స్థాయిలో తాను పనిచేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నానని చెప్పారు. "మా పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చి నేను సొంతంగా ముఖ్యమంత్రి అయితేనే నా కలల ప్రాజెక్టులను అమలు చేయడం నాకు సాధ్యమవుతుంది" అంటూ కుమారస్వామి చెప్పుకొచ్చారు. పనిలోపనిగా మీడియా మీద కూడా ఆయన విరుచుకుపడ్డారు. రాజకీయ నాటకాలను ప్రచారం చేస్తూ మీడియా కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందంటూ ఆయన విమర్శించారు.

మేమేం చేస్తాం?: యడ్యూరప్ప



కర్నాటకలోని సంకీర్ణ ప్రభుత్వంలో అయోమయానికి బిజెపి కారణం కాదని రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బిఎస్ యడ్యూరప్ప తెలిపారు. అతిపెద్ద పాత పార్టీ (కాంగ్రెస్) వారు తమ మందను జాగ్రత్తగా చూసుకోవల్సి ఉంటుందని యడ్యూరప్ప వ్యాఖ్యానించారు. అధికార సంకీర్ణంలో గందరగోళం నెలకొనడం జరిగితే అందులో బిజెపి తప్పేమి ఉంటుందని, అది వారి అసమర్థత, వారి స్వయంకృతం అవుతుందని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో అధికార జెడిఎస్ – కాంగ్రెస్ కూటమి నుంచి ఫిరాయింపుల వార్తలు, క్యాంపుల నిర్వహణ నేపథ్యంలో బిజెపి నేత స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బిజెపి గాలం వేస్తోందనే వాదనను యడ్యూరప్ప తోసిపుచ్చారు. అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేల బలం 104. తామంతా ఒక్కటిగా నిలిచి ఉన్నామని, ప్రస్తుతం బిజెపి కర్నాటకలో లోక్‌సభ స్థానాలను అత్యధికంగా గెల్చుకోవాలనేదే తమ లక్ష్యం అన్నారు.

'గగన్‌యాన్' వ్యోమగాములుగా పైలట్లు!

• ఇస్రో శాస్త్రజ్ఞుల వెల్లడి
• రోదసీ టెక్నాలజీలో చైనాకు దీటుగా ఉన్నాం: శివన్



న్యూఢిల్లీ: భారత దేశ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర ' గగన్‌యాన్'లో వెళ్లే వ్యోమగాముల్లో చాలావరకు పైలట్లే ఉంటారని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు చెందిన శాస్త్రవేత్తలు సూచనప్రాయంగా తెలియజేశారు. విమానాలు నడపడంలో తగినంత అనుభవం ఉండే వారి కోసం చూస్తున్నామని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఇస్రో శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. కాగా భారత్ చేపట్టే ఈ మానవ సహిత అంతరిక్ష యాత్రలో పాల్గొనే వ్యోమగాములను ఎంపిక చేయడంలో భారత వైమానిక దళం, ఇతర ఏజన్సీలు కీలక పాత్ర పోషిస్తాయని ఇస్రో చైర్మన్ కె శివన్ చెప్పారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, గగన్‌యాన్‌కు సంబంధించి తొలి మానవ రహిత మిషన్‌ను 2020 సెప్టెంబర్‌లో చేపడతామని, రెండో మిషన్ 2021 జూలైలో ఉంటుందని, చివరగా 2021 డిసెంబర్‌లో మానవ సహిత అంతరిక్ష యాత్ర ఉంటుందని చెప్పారు. 2022 నాటికి ముగ్గురు వ్యోమగాములతో 'గగన్‌యాన్' ప్రయోగాన్ని చేపడతామని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా, అంతరిక్ష రంగంలో చైనా, భారత్‌ల మధ్య పోటీ విషయానికి వస్తే, సాంకేతిక రంగంలో మన దేశం చైనాతో సమానంగా పోటీ పడే స్థితిలో ఉన్నామని శివన్ స్పష్టం చేశారు. భారత్ వచ్చే ఏడాది చంద్రయాన్–2 మిషన్‌ను చేపట్టనుండగా ఏడాది ముందుగానే చైనా ప్రయోగించిన చాంగ్ ఇ–4 రోవర్ చంద్రుడిపై చీకటిగా ఉండే వైపున దిగిన విజయవంతంగా దిగిన నేపథ్యంలో శివన్ ఈ ప్రకటన చేయడం విశేషం. అయితే ఈ రెండు ప్రయోగాలకు మధ్య ఉన్న తేడా గురించి శివన్ వివరిస్తూ, చైనా చంద్రుడిపై చీకటి వైపున దిగగా, మనం చంద్రుడిపై వెలుతురు ఉన్న వైపు దిగబోతున్నామని చెప్పారు. అయితే ఇప్పటివరకూ ఎవరూ వెళ్లని ప్రదేశంలో మనం దిగబోతున్నామని ఆయన చెప్పారు. ఇప్పటివరకు చంద్రుడి దక్షిణ ధ్రువానికి దగ్గరగా ఎవరూ వెళ్లలేదని, మనం అక్కడ దిగబోతున్నామని ఆయన తెలిపారు. కాగా గగన్‌యాన్ ప్రాజెక్టు విషయంలో ఫ్రాన్స్, రష్యాలాంటి చాలా దేశాలు సహకరించడోతున్నాయని, చివరికి అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా కూడా సాయం అందించడానికి ముందుకు వచ్చిందని శివన్ తెలిపారు. ' ప్రతి ఒక్కరి సహాయాన్ని మేము ఉపయోగించుకుంటాం. వారందించే సాయాన్ని గరిష్టంగా ఉపయోగించుకుంటాం' అని శివన్ చెప్పారు. కాగా ఈ ఏడాది ఇస్రో చేపట్టబేయే మిషన్ల గురించి మాట్లాడుతూ ఈ ఏడాది 32 మిషన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

పని మనిషికి 21 మిలియన్ డాలర్ల పరిహారం



ఫ్లోరిడా: ఒక మహిళ అభిమతానికి విరుద్ధంగా ఆమె చేత ఆదివారాల్లో పనిచేయించుకున్నందుకు ఆమెకు హోటల్ యాజమాన్యం 21 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాల్సి వచ్చింది. మేరీ జాన్ అనే మహిళ హైతీ నుంచి ఫ్లోరిడాలోని మియామీకి వచ్చి అక్కడ ఓ హోటల్‌లో పనిమనిషిగా చేరింది. తను ఆదివారం చర్చిలో పనిచేయాల్సి ఉంటుందని, కాబట్టి ఆరోజు సెలవు తీసుకుంటానని ఆమె అడిగితే యాజమాన్యం అంగీకరించింది. కొంతకాలం తర్వాత కిచెన్ మేనేజర్ ఆదివారాల్లో పనికి రావాలని కోరాడు. కానీ ఆమె ఒప్పుకోలేదు. సమస్యను చర్చి ఫాదర్‌కు వివరిస్తే ఆయన మేరీ హోటల్ మేనేజర్‌కు లేఖ రాశారు. కానీ మేనేజర్ కాదనడంతో పదేళ్లపాటు మేరీ ఆదివారాలు పనిచేయాల్సి వచ్చింది. అప్పుడప్పుడు తోటి ఉద్యోగుల మంచితనంతో ఆమె ఆదివారాలు సెలవుతీసుకుంది. కొన్ని రోజులకు విషయం తెలిసిన మేనేజర్ ఆమెను ఉద్యోగం నుంచి తీసేశాడు. సమాన ఉద్యోగావకాశాల కమిషన్‌కు ఆమె ఫిర్యాదు చేసింది.తన మత విశ్వాసాలను హోటల్ యాజమాన్యం అవమానించిందని మేరీ తన పిటిషన్‌లో పేర్కొంది. కొన్నేళ్లపాటు ఈ కేసు నడిచింది. ఇటీవల ఫ్లోరిడా ఫెడరల్ కోర్టు తీర్పు వెలువరించింది. మేరీ మనోభావాల్ని కించపరిచినందుకు పరిహారంగా... చెల్లించని జీతంతో పాటు అదనంగా కొంత మొత్తం కలిపి హోటల్ యాజమాన్యం 21.5 మిలియన్ డాలర్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అయిష్టంగానే మేరీకి హోటల్ యాజమాన్యం ఆ జరిమానా చెల్లించింది.

వచ్చే ఏడాది టాప్–50 లక్ష్యం

• 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై మోడీ
• 'వైబ్రంట్ గుజరాత్'ను ప్రారంభించిన ప్రధాని



గాంధీనగర్: 'సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ర్యాంకింగ్స్ విషయంలో వచ్చే ఏడాది టాప్–50లో స్థానం సంపాదించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. ప్రపంచ బ్యాంక్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాకింగ్స్‌లో మన దేశం గత ఏడాది ఏకంగా 75 స్థానాలు ఎగబాకి ప్రస్తుతం 77 వ స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ' వచ్చే ఏడాది టాప్–50 ఉండేందుకు వీలుగా గట్టిగా కృషి చేయాలని నేను నా టీమ్‌కు చెప్పాను. మన నిబంధనలు, ప్రక్రియలు ప్రపంచంలోని అత్యుత్తమమైన వాటితో పోటీ పడే విధంగా ఉండాలని నేను వారికి చెప్పాను. అంతేకాకుండా మన దేశంలో వ్యాపారం చేయడాన్ని చౌకగా చేశాం' అని శుక్రవారం ఇక్కడ తొమ్మిదవ వైబ్రంట్ గుజరాత్ అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ మోడీ చెప్పారు. దేశం తన శక్తి మేరకు రాణించడానికి అడ్డుపడుతున్న అడ్డంకులను తొలగించడంపై తమ ప్రభుత్వం దృష్టిపెట్టిందని, సంస్కరణలు, నిబంధనల సడలింపు ప్రక్రియను ఇదే వేగంతో కొనసాగిస్తుందని మోడీ చెప్పారు. వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) అమలు, పన్నుల సరళీకరణ, స్థిరీకరణతో లావాదేవీ ఖర్చులు తగ్గి, ప్రక్రియలు సమర్థవంతంగా మారాయని ఆయన తెలిపారు. మరింత తెలివిగా వ్యాపారం చేయడంపైన కూడా తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన చెప్తూ, ప్రభుత్వం జరిపే కొనుగోళ్లు, సేకరణల్లో ఐటి ఆధారిత లావాదేవీలు, డిజిటల్ చెల్లింపులను ప్రవేశపెట్టడం ఈ దిశగా తీసుకున్న చర్యలని ప్రధాని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల కారణంగా గత నాలుగేళ్ల కాలంలో 263 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశంలోకి వచ్చాయని, గత 18 ఏళ్లలో వచ్చిన మొత్త ఎఫ్‌డిఐలలో ఇది 40 శాతమని ఆయన చెప్పారు. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో ప్రారంభించిన వైబ్రంట్ గుజరాత్ సదస్సు ప్రతి ఏటా దేశ విదేశాల్లోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు పాల్గొనే వేదికగానే కాక, దేశంలో గుజజరాత్‌ను పెట్టబడులకు కేంద్రంగా చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

అనిల్ అంబానీకి 'నో ఎంట్రీ '

రాఫేల్ వివాదం నేపథ్యంలో ఈ ఏడాది వైబ్రెంట్ గుజరాత్ సదస్సు(పారిశ్రామిక పెట్టుబడిదారుల సదస్సు)కు రిలయెన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీని గుజరాత్ ప్రభుత్వం ఆహ్వానించలేదు. గుజరాత్‌లో 2003లో ఈ సదస్సును చేపట్టిన నాటి నుంచి దీనికి పూర్తి స్థాయిలో సహకారం అందచేస్తున్న పలువురు పారిశ్రామికవేత్తలలో ఒకరైన అనిల్ అంబానీకి ఈ ఏడాది సదస్సుకు మాత్రం ఆహ్వానం అందలేదు. సదస్సుపై వ్యతిరేక ప్రభావం చూపే ఎటువంటి వ్యక్తులను ఆహ్వానించకూడదని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆహ్వానితుల జాబితాలో ముఖేష్ అంబానీ, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ఆదిత్య బిర్లా గ్రూపు చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ, గోద్రేజ్ గ్రూపు చైర్మన్ ఆది గోద్రేజ్ తదితర ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఉన్నారు.

సుప్రీం జడ్జీలుగా మహేశ్వరి, ఖన్నా ప్రమాణం



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నా శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. చీఫ్ జస్టిస్ కోర్టురూములో వీరి పదవీ స్వీకార ప్రమాణం జరిగింది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ఈ ఇద్దరు న్యాయమూర్తుల చేత పదవీ ప్రమాణం చేయించారు. కొత్త న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నేడు ఢిల్లీ, ముంబయి కొత్త రాజధాని ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ: ఢిల్లీ–ముంబయిల మధ్య నేడు మరో కొత్త రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి బయల్దేరి కళ్యాణ్, నాసిక్, జల్గాం, ఖాండ్వా, భోపాల్, ఝాన్సీ, ఆగ్రా, హజరత్ నిజాముద్దీన్‌కు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధ, శనివారాల్లో మధ్యాహ్నం 2.50 గంటలకు ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి బయల్దేరి, ఆ తర్వాత రోజు ఉదయం 10.20 గంటలకు హజరత్ నిజాముద్దీన్‌కు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్రతి గురు, ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు ఛత్రపతి శివాజీ టెర్మినస్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలులో ఒకటి ఫస్ట్ ఎసి, మూడు ఎసి2టైర్, 8 ఎసి 3 టైర్, పాంట్రీ కారు ఉన్నాయని వారు పేర్కొన్నారు.

36 రాఫెల్ విమానాలే ఎందుకు కొనాలి?



న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం దేశ భద్రతపై రాజీ పడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పి. చిదంబరం విమర్శించారు. వైమానిక దళానికి 126 రాఫెల్ జెట్ విమానాలు అవసరమైతే ప్రభుత్వం 36 విమానాల్ని మాత్రమే ఎందుకు కొనుగోలు చేసిందని ఆయన ప్రశ్నించారు. ఒక్కో విమానానికి 41.42 శాతం ఎక్కువ రేటు చెల్లించి 36 విమానాల్ని కొనడానికి ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం నిర్ణయించిందని మీడియాలో సమాచారం వచ్చిన నేపథ్యంలో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. 'రాఫెల్ యుద్ధ విమానాల గురించి మీడియాలో తాజా సమాచారం రావడంవల్ల, 36 విమానాల్ని మాత్రమే ఎందుకు కొనాల్సి వచ్చిందన్న ప్రశ్నకు తక్షణం సమాధానం అవసరం' అని చిదంబరం ట్వీట్ చేశారు.ఒక్కో విమానం రేటును ఎందుకు పెంచాల్సి వచ్చిందో మోడీ చెప్పాలని కాంగ్రెస్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా కూడా డిమాండ్ చేశారు. మోడీ ఇందుకు ఎప్పుడు సమాధానం చెబుతారని సింధియా ప్రశ్నించారు.

ఢిల్లీలో 450 విమానాలపై పొగమంచు ప్రభావం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో అనేక ప్రాంతంలో కమ్ముకున్న దట్టమైన పొగమంచు వల్ల శుక్రవారం ఉదయం ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 450 విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫ్లైట్ ఆపరేషన్స్ సాధ్యం కాలేదు. 'ఉదయం 10.20 వరకు దట్టంగా పొగమంచు పడుతుండడంతో 450 విమానాలలో 95 శాతం నిర్ణీత సమయానికి బయలుదేరడానికి కానీ, కిందికి దిగడానికి కానీ సాధ్యం కాలేదు. మిగిలిన విమానాల్ని రద్దు చేయడం లేదా దారిమళ్లించడం జరిగింది. ఉదయం 5.30 10.20 మధ్యలో బయలు దేరాల్సిన విమానాల్ని ఆపాల్సి వచ్చింది. ఆ సమయంలో సింగపూర్ నుంచి రావాల్సిన అయిదు విమానాల్ని దారిమళ్లించాము. బ్యాంకాక్, దుబాయ్, గౌహతి, మస్కట్ నుంచి రావలసిన విమానాల్ని జైపూర్ విమానాశ్రయానికి మళ్లించాము' అని ఎయిర్ పోర్ట్ అధికారి తెలిపారు.

ఏ పార్టీలోనూ చేరను : ప్రకాశ్‌రాజ్



బెంగళూరు: తాను ఏ రాజకీయ పార్టీలోనూ చేరనని, అవి నిజాయితీగా లేవని నటుడు ప్రకాశ్‌రాజ్ శుక్రవారం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఇటీవల ప్రకటించిన ప్రకాశ్ రాజ్ తను ఇండిపెండెంట్‌గా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. 'నేను ఏ పార్టీలో చేరినా మూడు నెలల కంటే ఎక్కువ ఉండలేను. నేను ప్రజలవాణికి ప్రతినిధిగా ఉండాలనుకుంటున్నాను' అని విలేకరుల సమావేశంలో చెప్పారు. 2017 సెప్టెంబర్ 5న జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్య జరిగిన తర్వాత ప్రకాశ్‌రాజ్ రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. తను రాజకీయాల్లోకి వస్తానని పదిహేను రోజుల కిందటే ఆయన ప్రకటించారు. రాజకీయాల్లోకి రావాలన్న మీ భావోద్వేగం మీకు ఎంతవరకు తోడ్పడుతుంది? ...అని అడగ్గా 'నిజాయితీ లేనివారిపట్ల ఆగ్రహం అవసరం'.. అని బదులిచ్చారు.

మోడీకి అయిన వారికోసమే 'రాఫెల్'



న్యూఢిల్లీ: తనకు కావలసిన వ్యాపారవేత్త ప్రయోజనం కోసమే నరేంద్రమోడీ ప్రభుత్వం ఫ్రాన్స్‌తో 36 రాఫెల్ జెట్ ఫైటర్ల ఒప్పందం కుదుర్చుకుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి శుక్రవారం ఆరోపించారు. భారత వైమానిక దళానికి 126 జెట్ ఫైటర్లను ఫ్రాన్స్ నుంచి కొనాలి. గత యూపీఏ ప్రభుత్వం ఇందుకు సంబంధించి చర్చలు కూడా జరిపింది. అయితే ఇప్పుడు 36 విమానాల్ని మాత్రమే కొనేందుకు ఎన్‌డిఏ నిర్ణయించింది. యూపీఏ నిర్ణయించిన కొనుగోలు ధర కన్నా ఇప్పుడు ఒప్పందం ద్వారా కుదుర్చుకున్న రేటు 41.42 శాతం ఎక్కువ అని ఒక వార్తా కథనం వచ్చిన నేపథ్యంలో సీతారాం ఏచూరి ఈ వ్యాఖ్య చేశారు. '126 రాఫెల్ యుద్ధ విమానాల బదులు 36 విమానాల్ని మాత్రమే కొంటామని మోడీ ప్యారిస్‌లో హఠాత్తుగా చేసిన ప్రకటనతో మొత్తం ప్రక్రియను ఉల్లంఘించినట్టయింది. అంతేకాదు, భారతదేశ భద్రత విషయంలో కూడా ప్రభుత్వం రాజీపడింది. అందుకే మోడీ ఒప్పందం వివరాల్ని వెల్లడించేందుకు భయపడుతున్నారు' అని ఏచూరి ఘాటుగా విమర్శిస్తూ ట్వీట్ చేశారు.

లడఖ్‌లో హిమపాతానికి ఐదుగురు మృతి



శ్రీనగర్: జమ్ముూకశ్మీర్‌లో హిమపాతానికి ఐదుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. శుక్రవారం ఉదయం లడఖ్ ప్రాంతంలోని ఖార్దుంగ్లా కనుమ వద్ద ట్రక్కులో వెళ్తున్న వారిపై మంచు గడ్డలు విరిగి పడడంతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఓ)అధికారులు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందు తమ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టాయన్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్, ఆర్మీ, ఎస్‌డిఆర్‌ఎఫ్ బలగాలు సహాయక చర్యల్లో పాల్గొనట్లు అధికారులు తెలిపారు. ఐదుగురి మృతదేహాలను వెలికి తీశామని,గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు వారు పేర్కొన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666